సమావేశము - VI
వాల్యూము - I
నెం. 4

వెల : రూ. 18-00
20 డిసెంబర్, 2016
మంగళవారం,
(శక సం. 1938,
మార్గశిరం - 7)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

<u>విషయ సూచిక</u>

I. ప్రశ్నోత్తరాలు ... 1

II. సభా కార్యక్రమం : ... 16
   1. ప్రత్యేక ప్రస్తావనలు
   2. వాయిదా తీర్మాన తిరస్కరణ

III. లఘు చర్చ : ... 17
   మిషన్ కాకతీయ గురించి

# తెలంగాణ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గాప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి.ఎన్. ప్రసన్నకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## ( ఆరవ సమావేశము – నాల్గవ రోజు)

## మంగళవారం, డిసెంబర్ 20, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ ఛైర్మన్: గౌరవ సభ్యులందరికీ నమస్కారం, సభకి స్వాగతం. ఇప్పుడు క్వశ్చన్ అవర్ టేకప్ చేద్దాం. మొదటి ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసిన మంత్రిగారు శాసనసభకు వెళ్లడం జరిగింది. కాబట్టి ఆ ప్రశ్న తరువాత టేకప్ చేయబడుతుంది.

### I. ప్రశ్నోత్తరాలు

### పాఠశాలల్లో క్రీడల నిర్వహణ

ప్రశ్న నెం. 1456(32)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి,ఎం.ఎల్.సి.లు:– గౌరవనీయులైన ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా పాఠశాల లన్నింటిలో క్రీడలను నిర్వహించే ప్రతిపాదన ఏదైనా ఉందా?

(ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి (శ్రీ టి. పద్మారావు):– (అ) తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా పాఠశాలలన్నింటిలో క్రీడలను నిర్వహించే ప్రతిపాదన ఏదీ లేదు.

(ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ టి. పద్మారావు: అధ్యక్షా, పాఠశాలలో నిర్వహించే కార్యకలాపాలను ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌తో కోఆర్డినేషన్ చేసుకొని, రాబోయే రోజులలో entire system అంతా స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ చూసే విధంగా విద్యాశాఖమంత్రి గారితో మాట్లాడి, వాటికి సంబంధించిన ప్రయత్నాలు చేసి క్రీడా శాఖకు వచ్చే విధంగా మా వంతు కృషి చేస్తామని తెలియజేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: (ఉపాధ్యాయ నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) అధ్యక్షా, మన రాష్ట్రంలో క్రీడలు నిర్వహించడానికి స్టేడియంలు ఉన్నాయి. ఇప్పుడు మన రాష్ట్ర ప్రభుత్వం యొక్క పాలసీ ప్రకారం ప్రతి నియోజక వర్గానికి ఒక స్టేడియం నిర్మాణం జరుగుతోంది. 16 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరికీ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్‌తో సమన్వయం చేసుకొని ఆ క్రీడా మైదానాలు వినియోగించు కునేటట్లుగా మరియు ఆటల పోటీలు నిర్వహించే ప్రతిపాదన ఏమైనా ఉందా? తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియంను ఏర్పాటు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పారు. మండలాల్లో హైస్కూల్ మరియు ఇంటర్‌మీడియట్ కాలేజీ ఒకటే కాంపౌండ్‌లో ఉంటాయి. మీరు ఇప్పటి వరకు ఎన్ని స్టేడియంలను నిర్మించారు. ఎన్నింటికి శాంక్షన్ ఇచ్చారు? మీ బడ్జెట్ ఎంత ఉంది? బడ్జెట్‌లో ఎన్ని నిధులను రిలీజ్ చేశారు? మీరు మంచి ప్రపోజల్ పెట్టారు. వచ్చే సంవత్సరం నుండి స్పోర్ట్స్ & కల్చరల్ వాళ్లే స్కూల్స్‌లో స్పోర్ట్స్‌ను నిర్వహిస్తామన్నారు. దానికి ఫిజికల్ డైరెక్టర్‌ల ఖాళీలు దాదాపు 50 శాతం ఉన్నాయి. ఆ ఖాళీలను భర్తీ చేయాలని, అదే విధంగా రూరల్ బ్యాక్‌గ్రౌండ్ వాళ్లను కూడా ప్రోత్సహించాలని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్: (ఉపాధ్యాయ నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ) అధ్యక్షా, స్కూల్ గేమ్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలో వ్యాయమ విద్యను ఒక సబ్జెక్ట్‌గా పాఠ్యాంశాలలో పెట్టాలని కోరుతున్నాను. స్కూల్ గేమ్స్‌ను పాఠశాల విద్య నుండే కాకుండా స్పోర్ట్స్ శాఖ నుండే నిర్వహిస్తే, దానికి సంబంధించినటు వంటి ఖర్చు చాలా ఉంటుంది. స్టేట్, నేషనల్ లెవల్లో ఎన్నికైన వారికి

ప్రభుత్వం ప్రోత్సహించాలని వారి ఖర్చులను ప్రభుత్వమే భరించాలని తమరి ద్వారా కోరుతున్నాను.

డా. ఎం. శ్రీనివాస్ రెడ్డిః (నామినేటెడ్) అధ్యక్షా, నేటి పరిస్థితులలో స్కూల్ ఎడ్యుకేషన్‌లో స్పోర్ట్స్ మరియు గేమ్స్ అనేవి కనబడటం లేదు. చాలా పాఠశాలల్లో మైదానాలు కూడా లేవు. పిల్లలు ఇంట్లో, పాఠశాలలో, ట్యూషన్‌లో చదువు కోసం ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయి కాబట్టి, ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా పిల్లలను ఆటలాడించాలని కోరుతున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణరావుః (స్థానిక సంస్థలు – కరీంనగర్) అధ్యక్షా, పాఠశాలలో విద్య నేర్పడం ఎంత అవసరమో, క్రీడలు కూడా అంతే అవసరం. ఆటపాటల ద్వారా నేర్చుకునే విద్య పిల్లలకు సమగ్రమైన విద్యావగాహన అలవడుతుంది. మన రాష్ట్రంలో క్రీడలు నిర్వహిస్తున్నారు కానీ, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎక్కడా నిర్వహించడం లేదు. కాబట్టి ప్రభుత్వం ద్వారా క్రీడలను నిర్వహించాలని కోరుతున్నాను.

శ్రీ కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డిః (స్థానిక సంస్థలు – నల్గొండ) అధ్యక్షా, క్రీడలకు, చదువుకి అవినాభావ సంబంధం ఉంది. విద్యార్థులు క్రీడలలో పాల్గొనాలంటే అక్కడ మౌలిక సదుపాయాలు ఉండాలి. కానీ ఒక్క పాఠశాలలో కూడా అటువంటి సౌకర్యాలు లేవు. అదే విధంగా పిఇటి మాస్టర్లు కూడా లేరు. ప్రతి పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డిః (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్ని మండలాలలో స్టేడియంలను కట్టడానికి అనుమతులిచ్చింది? ఎన్నింటిని పూర్తి చేశారు?

శ్రీ టి. పద్మారావుః అధ్యక్షా, హైదరాబాద్ సిటీలో స్టేడియంను నిర్మించాలంటే దాదాపు 5 ఎకరాల స్థలం కావలసి ఉంటుంది. 119 నియోజక వర్గాలకు గానూ జిల్లాల వారీగా 85 స్టేడియంలకు అనుమతులిచ్చాము. 12 స్టేడియంలకు నిర్మాణం పనులు పూర్తయినాయి. మిగతా స్టేడియంలు కొన్ని 50 శాతం, కొన్ని చివరి దశలో ఉన్నాయి. తొందరలో వాటిని పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత విద్యాశాఖ మంత్రితో కోఆర్డినేషన్ పెట్టుకొని పాఠశాల విభాగం క్రింద ఉండే క్రీడలను కూడా క్రీడా విభాగం క్రిందికి తెచ్చే విధంగా కృషిచేస్తామని తెలియజేస్తున్నాను. క్రీడలకు బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. అది సరిపోక పోవడంతో ముఖ్యమంత్రిగారిని మరిన్ని నిధులను విడుదల చేయమని కోరుతున్నాము. ఈ బడ్జెట్‌లో నుండే గెలిచిన క్రీడాకారులకు బహుమతులను ఇవ్వడం జరుగుతుంది. ఉదాహరణకు, క్రీడాకారిణి సింధూకు రూ.5 కోట్లను ఇవ్వడం జరిగింది. అతి తొందరలోనే మిగిలిన స్టేడియంలను కూడా పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను. ఇవేగాక మీ మీ నియోజక వర్గాలలో స్టేడియంలకు సంబంధించి పనులు జరగకపోతే మా దృష్టికి తీసుకొస్తే వాటిని కూడా పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను.

**మార్కెట్ యార్డుల్లో యాజమాన్య సంఘాల నియామకం**

ప్రశ్న నెం. 1542 (31)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం. ఎల్.సి.:– గౌరవనీయులైన సాగునీరు, మార్కెటింగ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ పనితీరు గణనీయంగా మెరుగుపడిందన్న విషయం వాస్తవమేనా?

(ఆ) మార్కెట్ యార్డులలో రైతులకు సమకూరుస్తున్న సదుపాయల వివరాలు ఏమిటి?

(ఇ) రాష్ట్రంలోని మార్కెట్ యార్డులలో ఇప్పటివరకు నియమించిన మరియు ఇంకా నియమించాల్సిన నిర్వహణ కమిటీల సంఖ్య ఎంత?

గౌరవనీయులైన సాగునీరు, మార్కెటింగ్ శాఖ మంత్రి (శ్రీ టి. హరీష్‌రావు):– (అ) అవునండీ.

(ఆ) రైతుల విశ్రాంత గృహాలు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు, ధాన్యం క్లీనర్లు, కవరు చేసిన షెడ్లు, గోదాములు డ్రైయింగ్ ప్లాట్‌ఫారంలు, క్యాంటిన్, త్రాగునీరు సదుపాయాలు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, ఆరోగ్య క్యాంపులు మున్నగువాటిని రైతుల కోసం మార్కెట్ యార్డులో సమకూర్చడమయింది.

(ఇ) ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీల సంఖ్య - 139. ఇంకా నియమించాల్సినవి - 41.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః అధ్యక్షా, ప్రశ్నకు తగ్గట్టుగా మంత్రిగారు సముచితమైన సమాధానం ఇవ్వడం జరిగింది. కేంద్రప్రభుత్వ పథకమైన జాతీయ వ్యవసాయ మార్కెట్ మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరుగుతుందా? వాటి వివరాలను తెలుపవలసిందిగా కోరుతున్నాను. రైతుల ప్రయోజనార్థం మరియు వినియోగదారుల సౌకర్యార్థం ప్రారంభించిన 'మన కూరగాయల పథకం'కు సంబంధించి ఎన్ని విక్రయ కేంద్రాలు ప్రారంభించ బడ్డాయి, ఈ పథకం ద్వారా ఎన్ని కూరగాయలు సేకరించబడి

అమ్మకాలు జరుగుతున్నాయి? ఎంత మంది రైతులు లబ్ధిపొందారు? ఈ పథకం వలన ఉపయోగాలేమిటి? రైతు బజార్ల నందు నగదు రహిత లావాదేవీలు అమలు జరుగుతున్నాయా? మార్కెట్ కమిటీల యందు ఛైర్మన్‌ల పదవికి రిజర్వేషన్ అమలుచేయడం, మరియు మహిళలకు ఛైర్మన్‌లుగా ఇప్పటి వరకు అవకాశం కల్పించడం జరిగిందా? వాటి వివరాలు తెలపండి? మార్కెట్ యార్డుల యొక్క ఆదాయం పెంచుటకు సరుకుల రాకపోకలకు సరైన విధంగా రికార్డ్ చేయడానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా? వాటి వివరాలను తెలియజేయాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ కొంపల్లి యాదవరెడ్డి: అధ్యక్షా, ఉల్లి పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. రంగారెడ్డి జిల్లాలో వీటిని అసలు కొనడం లేదు. వాటిని ప్రభుత్వం కొనే ప్రయత్నం చేస్తుందా? మహబూబ్‌నగర్ జిల్లాలో వాటికి బిల్లులు ఇవ్వడం లేదు. కంది పంట ఈ సంవత్సరం చాలా ఎక్కువగా పండింది. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే ప్రభుత్వం కొనే ప్రయత్నం చేస్తుందా? చేవెళ్లలో రైతు బజార్‌కు శంకుస్థాపన చేశారు. దాని నిర్మాణం ఎప్పుడు పూర్తి అవుతుందని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణరావు: అధ్యక్షా, వ్యవసాయ మార్కెట్ కమిటీల సంఖ్య — 139. ఇంకా నియమించాల్సినవి — 41 అని చెప్పారు. 139 మార్కెట్ యార్డులకు కమిటీలు వేశారు. కానీ 41కి కమిటీలు వేయలేదు. అవి ఎప్పటిలోగా వేస్తారు? రాష్ట్రంలో కొత్తరైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నారా? అలా ఏర్పాటు చేసేటట్లైతే సిరిసిల్ల జిల్లాలో కూడా ఒక కొత్త మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: అధ్యక్షా, మార్కెట్‌లను నిర్మిస్తున్నారు కానీ దానిలో సిబ్బందిని నియమించడం లేదు. సిబ్బందిని నియమించి వారికి శిక్షణ కూడా ఇవ్వాలి. హైదరాబాద్, కరీంనగర్ మార్కెట్‌లలో ఎక్కడ పడితే అక్కడ చెత్త, చెదారంతో నిండిపోయి ఉంది. మురుగునీరు ప్రవహిస్తున్నది. మార్కెట్‌లోకి ప్రవేశిస్తే జ్వరం వచ్చేటట్లుగా ఉంది. నిన్న పత్రికలలో కూడా ఫోటోలను ప్రచురించడం జరిగింది. దీనిలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ మొదలైన మార్కెట్ల గురించి రాయడం జరిగింది. ఈ పరిస్థితులను మీరు గమనించండి? మార్కెట్ యార్డులను ఎవరు శుభ్ర పరుస్తారు? మార్కెటింగ్ శాఖా వారా? లేక పురపాలక సంఘం వారా? శుభ్రత విషయంలో కొన్ని చోట్ల వారిద్దరి మధ్య పంచాయితీలు జరుగుతున్నాయి? మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ వారే శుభ్రపరచుకోవాలి? ఆ వ్యవస్థను మీరు ఏర్పాటు చేయాలి. మంత్రిగారు ఒకసారి తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా కోరుతున్నాను

**10.20 ఉ.** శ్రీ ఫారూక్ హుస్సేన్: (నామినేటెడ్) అధ్యక్షా, సిద్దిపేటలో ఉన్న రైతు బజార్‌ని మోడల్ రైతు బజారుగా తయారుచేశారు. ఇదే విధంగా మన రాష్ట్రంలో ఉన్నటువంటి 180 మార్కెట్లను తయారుచేసే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నదా, తెలుపవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ టి.హరీష్‌రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా ప్రశ్నలు వేశారు. కాకపోతే కౌన్సిల్‌లో కొంత మార్పు కనిపిస్తున్నది. అన్నీ నూటి ప్రశ్నలే వస్తున్నాయి. గౌరవనీయులు శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డిగారు న్యామ్‌పైన వేయడం జరిగింది. న్యామ్ అనేది కేంద్ర ప్రభుత్వం మార్కెట్లలో ఎక్కువ పోటీ తత్వాన్ని నెలకొల్పి, రైతులకు మద్దతు ధర రావాలి, పారదర్శకత పెరగాలి అనే ఉద్దేశ్యంతో దీనిని తీసుకురావడం జరిగింది. అయితే మన రాష్ట్రం చాలా ప్రోయాక్టివ్‌గా, దేశంలో మొట్టమొదటగా దీనిని అమలుచేయాలని మనం అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికి కూడా, దాని సర్వర్ సరిగా పనిచేయకపోవడం వల్ల, దానిని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నాము. మన రాష్ట్రంలో 44 మార్కెట్ యార్డుల్లో ఈ న్యామ్‌ను తొలి దశలో అమలు చేసి, రాబోయే రోజుల్లో అన్ని మార్కెట్ యార్డులకు ఈ న్యామ్‌ను విస్తరించాలనే ఆలోచనలో ఉన్నాము. అయితే కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లాము. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం దీనిని పరిష్కరించి, సర్వర్ యొక్క కెపాసిటీని పెంచుతామని చెప్పింది. ఇప్పుడైతే అన్ని ఉత్పత్తులు చేయకపోయినా, ప్రతి మార్కెట్‌యార్డులో ఒకటి, రెండు వస్తువులను మనం న్యామ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతున్నది.

మార్కెట్ కమిటీల్లో మహిళల రిజర్వేషన్ గురించి శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు అడిగారు. తెలంగాణ ఏర్పడకముందు 150 మార్కెట్ యార్డులు ఉండేవి. తరువాత మరో 30 మార్కెట్ యార్డులను కలుపుకుని, మొత్తం 180 మార్కెట్ యార్డులు ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖరరావు గారు భారతదేశంలో ఎక్కడా లేని విధంగా మార్కెట్ యార్డులలో ఎస్సీ, ఎస్టీ, బిసిలలో మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టి, చరిత్ర సృష్టించారు. దీని వలన మొదటిసారిగా మహిళలు ఛైర్మన్లుగా ఉంటున్నారు.

(అధికార పార్టీ సభ్యుల హర్షధ్వానాలు)

ఇప్పటివరకు ఎంతమంది మహిళలు ఛైర్మన్లు అయ్యారు అని అడిగారు. లాటరీ సిస్టంలో మొత్తం 60 స్థానాలు మహిళల కొరకు

రిజర్వు చేయబడినాయి. ఇప్పటివరకు ప్రభుత్వం 48 మంది మహిళలను ఛైర్మన్లుగా నామినేట్ చేయడం జరిగింది. మరో 12 మందిని అతి త్వరలోనే నామినేట్ చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

మూడో ప్రశ్న ఆదాయం పెంచడానికి ఏదైనా చేస్తున్నారా అని అడిగారు. న్యామ్ విధానం అమలు చేసినట్లయితే మార్కెట్లోకి వచ్చే ప్రతి సరుకు ఆన్‌లైన్‌లో ఎంటరవుతుంది. బయటకు వెళ్లే సరుకు కూడా ఎంటరవుతుంది. పారదర్శకత పూర్తి స్థాయిలో ఉంటుంది కాబట్టి, జీరో వ్యాపారం ఆగిపోయి, ఆదాయం బాగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే అది ఇంకా అమలులోకి రాలేదు. కాని ఈ లోపు హైదరాబాద్‌లో ఉండే పెద్ద మార్కెట్లయిన బోయిన్‌పల్లిలోగాని, గడ్డిఅన్నారంలో గాని, చాలా చోట్ల ఇన్‌వార్డ్, ఔట్‌వార్డ్ ఎంట్రీ చేస్తున్నాము. దాని వలన ఆదాయం దాదాపు 30 నుండి 40 శాతం పెరగడం జరిగింది. రాబోయే రోజుల్లో రాష్ట్రం అంతా దీనిని అమలుచేయడం జరగుతుందని మీ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదే విధంగా రైతు బజార్లలో Cashless transactions కొరకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా అని అడిగారు. ఆ దిశగా దేశంలోనే మనది మొదటి రాష్ట్రంగా గుర్తించబడింది. ఈ రెండు వేల రూపాయల నోట్లు వచ్చిన తరువాత, రెండు వేల రూపాయలు ఇచ్చి, కిలో పాలకూర ఇవ్వండి అంటేనో, కొత్తిమీర కావాలంటేనో, ఆ రెండువేలకి చిల్లర లేక, చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. రైతులు సాయంత్రాలు కూరగాయలు పారేసి పోతున్నారు. ఈ విషయాలు మా దృష్టికి వచ్చినప్పుడు దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం cashless transaction విధానం తీసుకువచ్చాము. మన దగ్గర హైదరాబాద్‌లో కూకట్‌పల్లితో మొదలుపెట్టాము. IDFC Bank సహకారంతో మొదలుపెట్టాము. డబ్బులు అవసరం లేకుండానే, బొటనవేలి ముద్రతో, ఆధార్ ద్వారా రైతుకి టోకెన్ ఇవ్వడం, తిరిగి రైతు సాయంత్రం వెళ్లేటప్పుడు అతని బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేయడమో లేక అతనికి కావాలంటే నగదు ఇచ్చే విధంగా ఇప్పటికి ఎనిమిది మార్కెట్ యార్డుల్లో ఈ విధానం అమలుచేస్తున్నాము. మన రాష్ట్రంలో ఉన్న అన్ని మార్కెట్లలో ఈ cashless transaction విధానాన్ని వచ్చే రెండు, మూడు వారాల్లో అమలులోకి తీసుకువస్తామని చెప్పి, గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. తరువాత ఈ cashless transaction విధానం ఎలా పనిచేస్తున్నదని మేము చెక్ చేశాము. రైతులకు అమ్మకాలు బాగా పెరిగినట్లు తెలిసింది. వినియోగదారులకు కూడా చాలా సౌకర్యంగా ఉందని తెలిసింది.

తరువాత సభ్యులు "మన కూరగాయలు" గురించి కూడా అడిగారు. బేసిగ్గా ఈ పథకం ఏమిటంటే హైదరాబాద్‌లో అప్పుడప్పుడు కూరగాయల ధరలు విపరీతంగా పెరగడం, లేదా ఒకేసారి బాగా పడిపోవడం. మార్కెట్ స్టెబిలైజేషన్, అంటే ధరలను నియంత్రించే ఉద్దేశం ఒకటైతే, రైతులకు నేరుగా మద్దతు ధరనిచ్చి, వారికి నష్టం కలగకుండా చూడాలనే ఉద్దేశంతో, అటు రైతు, ఇటు వినియోగదారుడు ఇద్దరినీ దృష్టిలో పెట్టుకొని, "మన కూరగాయలు" అనే పథకం ప్రవేశపెట్టడం జరిగింది. ఇప్పటివరకు జంటనగరాల్లో 20 విక్రయకేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. మరో 80 విక్రయ కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేయబోతున్నాము. మొత్తం వంద చోట్ల తాజా కూరగాయలను, తక్కువ ధరకు హైదరాబాద్ ప్రజలకు అందించడం కోసం ఈ "మన కూరగాయలు" అనే పథకం తేవడం జరిగింది. దీని ప్రభావంతో సూపర్ మార్కెట్లలో కూడా ఆటోమాటిగ్గా కూరగాయల ధరలు తగ్గడాన్ని స్పష్టంగా ప్రభుత్వం నోటీస్ చేయడం జరిగింది.

అలాగే శ్రీ యాదవరెడ్డిగారు ఉల్లిపాయల గురించి అడిగారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత, నిన్ననే ఎల్‌.కె.పి గారి పుస్తక ఆవిష్కరణలో నేను చెప్పాను ప్రభుత్వం మంచి చేస్తే మెచ్చుకోవాలి, తప్పులు చేస్తే దాన్ని ఎత్తి చూపాలని. ఉల్లిగడ్డల విషయంలో విపరీతంగా ధరలు పెరిగిపోయి, ప్రభుత్వాలు పడిపోయిన విషయం మనకు తెలుసు. విపరీతంగా ధర తగ్గిపోవడమూ మనం చూసాము. పోయిన సంవత్సరం ఉల్లిగడ్డల ధర విపరీతంగా పెరిగి, నలభై, యాభై రూపాయల వరకు వెళ్లింది. అప్పుడు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి కిలో పది రూపాయలకే ఉల్లిగడ్డలను అందించి, వినియోగదారుడిని ఆదుకోవడం జరిగింది. ధర బాగా పెరిగింది కదాని రైతులు ఎక్కువ పండిస్తే, ధర పడిపోయింది. కిలో ఉల్లిగడ్డకు కనీసం రెండు, మూడు రూపాయలు కూడా రాని పరిస్థితి. మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు, రైతులు మార్కెట్‌కి వచ్చే పని లేకుండా, మార్కెటింగ్ డిపార్టుమెంటే రైతు పొలం దగ్గరకు వెళ్లి, కిలో ఎనిమిది రూపాయల చొప్పున కొని, రైతులను కూడా కాపాడుకున్నామని మనవి చేస్తున్నాను.

(అధికార పార్టీ సభ్యుల హర్షధ్వానాలు)

ఇప్పటిదాకా ఆ విధంగా 21 లక్షల క్వింటాళ్ల ఉల్లిగడ్డను ప్రభుత్వం కొనుగోలు చేసింది. రైతులకు ఈ విధంగా హమాలీ లేకుండా, ట్రాన్స్‌పోర్టేషన్ లేకుండా, ప్రభుత్వమే అతని పొలం దగ్గరకు వెళ్లి సరుకు కొనడం భారతదేశంలోనే ఎక్కడా జరగలేదని మనవి చేస్తున్నాను.

దాదాపు దీనిమీద ఇప్పటివరకు ఇరవై కోట్ల రూపాయలు

ఖర్చుపెట్టడం జరిగింది. మేము కొన్న సరుకుని మలక్‌పేట మార్కెట్లో అమ్ముకున్నాము. మాకు వచ్చేది రెండు,మూడు రూపాయలే. అంటే ఒక్కొక్క కేజీ మీద ఆరు, ఏడు రూపాయల నష్టాన్ని ప్రభుత్వం భరించి, రైతుల్ని కాపాడే ప్రయత్నం చేసినాము.

టమాట విషయంలో కూడా ఇలాగే జరిగింది. పావలా కిలో, అఠాణ కిలో అయితే, రైతులు మార్కెట్లో వదిలిపెట్టి, వెళ్లిపోయారు. అప్పుడు మేము కిలో ఐదు రూపాయల చొప్పున కొని, రైతులను ఆదుకోవడం జరిగింది. అయితే యాదవరెడ్డిగారు ఏమన్నారంటే మా రంగారెడ్డి జిల్లాలో కూడా ఉల్లిగడ్డలు పండుతాయి. మహబూబ్ నగర్‌తో పాటు, మా దగ్గర కూడా కొనాలని చెప్పారు. తప్పకుండా, వారు ఆ వివరాలు అందిస్తే, ఆ గ్రామాల్లో కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ఉల్లిగడ్డ రైతులు ఎక్కడున్నా కాని, కనీస మద్దతు ధర ఎనిమిది రూపాయలు ఇచ్చి, కాపాడుకుంటాం. ఆ వివరాలు ఇస్తే, వారి దగ్గర కూడా ప్రారంభిస్తామని మనవి చేస్తున్నాను.

కందిపంట గురించి అడిగారు. దానికి ధర రావడం లేదని సభ్యులు ప్రస్తావించారు. వాస్తవానికి ఈ విషయాన్ని మేము ముందుగానే గమనించాము. ఈ సారి మంచి వర్షాలు పడి, చెరువుల్లో నీళ్లుండి, రాష్ట్రంలో కంది పెద్ద ఎత్తున వచ్చే అవకాశముంది. అందుకే నేనే స్వయంగా కేంద్ర మంత్రి శ్రీ రాధా మోహన్ సింగ్‌గారి దగ్గరకు వెళ్లి, నాఫెడ్ ద్వారా కంది కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభించాలని రెండు సార్లు వారి దృష్టికి తెచ్చాము. ఇప్పటికే కొన్ని కేంద్రాలను నారాయణ్‌పేట వంటి చోట్ల ప్రారంభించాము. తాండూర్‌లో కూడా త్వరలోనే ప్రారంభిస్తాము. నాఫెడ్ మరియు రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్క్‌ఫెడ్ ఈ రెండిటి సహకారంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రూ.4,050 మద్దతు ధరను కంది రైతులకు అందచేస్తామని మనవి చేస్తున్నాను. కాబట్టి కంది రైతులు కూడా తొందరపడకుండా, దీనిని వినియోగించుకోవాలని కోరుతున్నాను.

చేవెళ్ల రైతు బజారు శంకుస్థాపన జరిగింది కాని, పనులు మొదలు కాలేదని సభ్యులు చెప్పారు. వీలైనంత త్వరలోనే ఈ పనిని పూర్తి చేస్తామని మనవి చేస్తున్నాను. అలాగే శ్రీ నారదాసు లక్ష్మణరావుగారు మిగతా మార్కెట్ కమిటీలు ఎప్పటిలోగా వేస్తారని అడిగారు. అతి త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాల మేరకు పూర్తిచేస్తామని మనవి చేస్తున్నాను. సిరిసిల్లకు రూ.1.25 కోట్లతో ఒక రైతు బజారును మంజూరు చేశాము. అయితే ఇప్పుడది జిల్లా కేంద్రంగా మారింది కాబట్టి, అవసరమైతే మరిన్ని నిధులిచ్చి, మోడల్ రైతు బజారుగా దానిని తీర్చిదిద్దుతామని మనవి చేస్తున్నాను. అలాగే గౌరవ ఎల్‌ఓపిగారు మార్కెట్లను పెంచినందుకు సంతోషమన్నారు. మార్కెట్ల వికేంద్రీకరణ జరగవలసి ఉంది. లేకపోతే ఒక మార్కెట్ మీద ఎక్కువ లోడ్ పడి, అక్కడ ఇబ్బంది జరుగుతున్నది. కాబట్టి మండల స్థాయికి మార్కెటింగ్ వ్యవస్థను తీసుకుపోవాలని కొత్తగా 30 మార్కెట్లను మంజూరు చేశాము. ఇంకా కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. స్టాఫ్‌ను పెంచాలని వారు కోరారు. ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ద్వారా కొంత స్టాఫ్‌ను తీసుకున్నాము. రెగ్యులర్ స్టాఫ్ కొరకు ఫైలు ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మొన్ననే ఆర్థిక శాఖ క్లియర్ చేయడం జరిగింది. పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా స్టాఫ్‌ను తీసుకోవడమే కాకుండా, ఎక్స్‌పర్ట్స్‌ను కూడా పెట్టాలనుకుంటున్నాము.

అదే విధంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్లకు పదవి కాలం ఒక సంవత్సరమే ఇచ్చారు. వ్యవధి పొడిగించాలన్నారు. తప్పకుండా ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలిస్తుంది. చెత్త విషయం గురించి చెప్పారు. మార్కెట్ల నిర్వహణ కొన్ని చోట్ల స్థానిక సంస్థలు నిర్వహిస్తుంటాయి. కొన్ని చోట్ల రైతు బజార్లు మాత్రం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. ఎవరు నిర్వహించినా, మార్కెట్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. ఈ విషయం మా దృష్టికి కూడా వచ్చింది. అవసరమైన చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, మంత్రిగారు మార్కెటింగ్ శాఖ మీద మంచి పట్టు ఉండి, ప్రజలకు అనుకూలమైన సమాధానం వస్తున్న సందర్భంగా, మాకున్న అనుమానాలు నివృత్తి చేసుకునే అవకాశం ఇవ్వాలి. మార్కెటింగ్ శాఖ ద్వారా ఇన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు, హరిత హార కార్యక్రమం కూడా చేపడితే బాగుంటుందని మా మనవి.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: అధ్యక్షా, రెండు ప్రశ్నలకే ఇంత సమయం పోయింది. చీఫ్ విప్‌గారు మళ్లీ క్లారిఫికేషన్ అడుగుతున్నారు. మనం త్వరగా చర్చను ముగించవలసి ఉంటుంది. మిగిలిన మెంబర్లకు అవకాశం రావాలి. ప్రతిపక్షంలో ఉన్న మేమే కోపరేట్ చేస్తున్నాము.

మిస్టర్ ఛైర్మన్: ప్రశ్న నెం.1608 సభ్యుడి కోరిక మేరకు వాయిదా వేయడమైనది.

### జిల్లాల్లో క్రీడా పాఠశాలల ఏర్పాటు

ప్రశ్న నెం.1454 (34)

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల జిల్లా వారీ వివరాలేమిటి? వాటిలో విద్యార్థుల ప్రవేశాలకు మార్గదర్శకాలు ఏమిటి?

(ఆ) అవసరమైనంత ప్రచారం లోపించినందున, ప్రతిభావంతులైన అభ్యర్థులు ఈ పాఠశాలల్లో ప్రవేశాలను పొందలేకపోతున్న విషయం వాస్తవమేనా?

(ఇ) ప్రతి జిల్లా క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా వుందా?

(ఈ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌ. ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి (శ్రీ టి. పద్మారావు):- (అ) తెలంగాణ రాష్ట్రంలో మూడు క్రీడా పాఠశాలలు ఉన్నాయి. అవి..

1. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల, హకీంపేట, రంగారెడ్డి జిల్లా.

2. ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్ జిల్లా.

3. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల, ఆదిలాబాద్ జిల్లా.

క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు మార్గదర్శకాలు 8 సంవత్సరాల వయోవర్గంలో వున్న పిల్లల (బాలురు, బాలికలు) కోసం 4వ తరగతి నుండి వుంటాయి. వీరిని ఈ క్రింది వాటిలో పరీక్షించడమవుతుంది.

(ఎ) ఆంత్రోపోమెట్రిక్ (పొడవు, బరువు)

(బి) ప్రేరక ప్రతిభా పాటవాలు. (30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రోడ్ జంప్ 6x10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబులిటీ, 1 కేజీ మెడిసన్ బాల్‌పుట్, 800 మీటర్ల పరుగు).

(సి) వైద్యం(వయస్సు పరిశీలన, భంగిమ, ఎముకల అసాధారణతలు)

(ఆ) లేదండీ. 3 అంచెల విధానమైన మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభావంతులైన పిల్లలను ఎంపిక చేసి, ప్రవేశాలను కల్పించేందుకు ప్రతి సంవత్సరం అవసరమైన ప్రచారాన్ని ఇవ్వడమవుతున్నది. ఈ ప్రక్రియను గత 22 సంవత్సరాలుగా మే నెలలో ప్రారంభించి, జూలై 3వ వారానికి పూర్తి చేయడం జరుగుతున్నది.

<u>ఎంపిక స్థాయిలు:</u>

1. మండల స్థాయి: మండల పరిధిలోని 4వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సమాచారాన్ని ఇచ్చి, సంబంధిత జిల్లా క్రీడల అధికారుల సహాయంతోను, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో మండల విద్యాధికారి (ఎంఇఓ) ఎంపికలను చేపడతారు.

2. జిల్లా స్థాయి: మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థుల కోసం కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ- డిఎస్ఏ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి- డిఎస్‌డిఓ చేపడతారు.

3. రాష్ట్ర స్థాయి: హకీంపేట టిఎస్ఎస్ఎస్, కరీంనగర్ ఆర్ఎస్ఎస్‌లో ప్రవేశాల నిమిత్తం జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రంగారెడ్డి జిల్లా హకీంపేట వద్ద గల తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల నిర్వహిస్తుంది. ఆదిలాబాదులోని ఆర్ఎస్ఎస్‌కు సంబంధించి, ఈ పాఠశాల ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ప్రారంభమయినందున, 2016వ సంవత్సరానికి విడిగా ఎంపికలను నిర్వహించడమయింది.

(ఇ) అవునండీ. దశల వారీగా ప్రతి జిల్లాలో క్రీడా పాఠశాలలను ఏర్పాటుచేసే ప్రతిపాదన వుంది.

(ఈ) అవునండీ. ఈ విషయం పురోగతిలో వుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 2016-17 ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాల ప్రారంభమయింది. దశల వారీగా త్వరలోనే ఇతర జిల్లాలకు విస్తరింపజేసే ప్రతిపాదన ఉంది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, పాఠశాలల్లో ఉండే పిల్లల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ క్రీడా పాఠశాలలు ఏర్పాటుచేయడం జరిగింది. అందులో జరిగే అడ్మిషన్లు సరైన రీతిలో జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. అందుకొరకే ఈ పాఠశాలల్లో అడ్మిషన్లు ఏ రకంగా జరుగుతాయి, వాటి యార్డ్ స్టిక్స్ ఏమిటి అనేది స్పష్టంగా చెప్పవలసి ఉంది. గతంలో కూడా కరీంనగర్ పాఠశాలల్లో చాలా ఆరోపణలు ఉన్నాయి. కాబట్టి దానిమీద పూర్తి విచారణ జరిపించి, అడ్మిషన్లు సక్రమంగా జరపడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుపవలసిందిగా మీ ద్వారా గౌ. మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, ప్రతి జిల్లాకు ఒక క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసినట్లయితే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీకి చెందిన బీద పిల్లలకు న్యాయం జరుగుతుంది, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బీద విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశముంటుందని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు: (స్థానిక సంస్థలు - హైదరాబాద్) అధ్యక్షా, ప్రభుత్వం నడిపే స్పోర్ట్స్ స్కూల్స్ కంటే ఎక్కువగా, ప్రైవేట్ అకాడమీకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని నేను ఆరోపిస్తున్నాను. గోపిచంద్ అకాడమీ, సానియా మీర్జా అకాడమీకి కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని నామినల్ రేటుకి కేటాయించారు. ఈ రోజున ఆ అకాడమీల్లో పేద పిల్లలకు అడ్మిషన్లు దొరకడం లేదు. కేవలం సినిమా

యాక్టర్ల పిల్లలకు, బాగా డబ్బుగల వారి పిల్లలకు మాత్రమే అక్కడ అడ్మిషన్ దొరుకుతున్నది. దీనిపైన ప్రభుత్వం ఏమి చర్య తీసుకుంటున్నది? స్పోర్ట్స్ అకాడమీ ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది. వారికి కేవలం రూ.68 కోట్ల బడ్జెట్ మాత్రమే ఉంది. అందులోంచి రూ.5 కోట్లు సింధుకి ఇచ్చినామని చెప్పినారు. గోపీచంద్ అకాడమీకి రూ.100 కోట్లు ఇచ్చినారు.

మిస్టర్ చైర్మన్: మీరు ఎక్కడి నుంచి ఎక్కడికో పోతున్నారు. దయచేసి ప్రశ్న గురించి మాట్లాడండి. మీకు అవకాశం ఇస్తే ఇలాగే చేస్తారు. ప్రభాకర్‌గారూ మీకు ఇచ్చిన అవకాశాన్ని పాడుచేసుకుంటున్నారు. మంత్రిగారూ, సమాధానం చెప్పండి.

10.40 ఉ. శ్రీ టి. పద్మారావు: అధ్యక్షా, గోపీచంద్ అకాడమీకి, సానియామిర్జా అకాడమీకి గత ప్రభుత్వాల హయాంలోనే భూములిచ్చారు. మా ప్రభుత్వం ఇవ్వలేదు. క్రీడా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. నాలుగో తరగతి నుంచి వీళ్లకి అడ్మిషన్స్ ఇస్తాం. ఒకసారి నాలుగో తరగతిలో అడ్మిషన్ ఇస్తే, ప్రమోట్ అవుతూ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వెళతారు. మా స్కూల్స్‌లో కేవలం 60 నుంచి 80 వరకు మాత్రమే అడ్మిషన్స్ నాలుగో తరగతిలో ఇస్తారు. తర్వాత వాళ్లు ప్రమోట్ అవుతూ పోతారు. దానికి కొన్ని నియమ నిబంధనలు పెట్టాం. గౌరవ సభ్యులు అన్నట్లు పెద్ద పెద్దవాళ్ల పిల్లలకి ఇవ్వడం కాదు. మాకు అందరూ ఒకటే. ప్రతిభ ఉన్న వారికి ఉన్నంతలో అడ్మిషన్ దొరుకుతుంది, దొరకదనే సమస్యే ఉత్పన్నం కాదు. అడ్మిషన్స్‌కి సంబంధించి కొన్ని నిబంధనలు పెట్టాం. అందులో (ఎ) ఆంత్రోమెట్రిక్ .. పొడవు, బరువు

(బి) ప్రేరక ప్రతిభా పాటవాలు. (30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రోడ్ జంప్ 6x10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్ వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, 1 కేజీ మెడిసన్ బాల్‌పుట్, 800 మీటర్ల పరుగు)

(సి) వైద్యం (వయస్సు పరిశీలన, భంగిమ, ఎముకల అసాధారణతలు)

మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి.. ఈ మూడు అంచెలలో అత్యంత ప్రతిభావంతులైన పిల్లలను ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించడానికి ప్రతి సంవత్సరమూ అవసరమైన ప్రచారం చేస్తున్నాం. ప్రచారం చేయడం లేదని చెప్పడం తప్పు. ఈ ఎంపిక ప్రక్రియను గత రెండు సంవత్సరాలుగా మే నెలలో ప్రారంభించి జూలై మాసంలో పూర్తి చేయడం జరుగుతోంది. ఈ టైము గ్యాపులో అడ్మిషన్స్‌కి అప్లై చేయకుండా ఉన్న వారికి అవకాశం ఉండదు, ఎందుకంటే ఆల్‌రెడీ షెడ్యూల్ ప్రకారం ఫిలప్ అయిపోతాయి. అంతేగానీ పెద్ద వాళ్లపిల్లలకి అడ్మిషన్స్ ఇస్తున్నారని అనడం భావ్యం కాదు. ఖచ్చితంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ స్పోర్ట్స్ స్కూల్స్‌లో అడ్మిషన్స్ ఇవ్వడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధి

ప్రశ్న నెం. 1536 (35)

శ్రీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్న విషయం వాస్తవమేనా?

(ఆ) ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రాష్ట్రంలోని కొన్ని ప్రధాన దేవాలయాలలో ఆదాయం గణనీయంగా పెరిగిందన్న విషయం వాస్తవమేనా?

(ఇ) అయితే, గత రెండు సంవత్సరాలలోని పెరుగుదల వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన గృహ నిర్మాణ, దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి):- (అ) అవునండీ.

(ఆ) అవునండీ.

(ఇ) వివరాలను సభాసమక్షంలో ఉంచడమయింది.

Gross Income of important temples during the year 2014-15, 2015-16

| Sl. No | Name of the Temple | Income for the year 2014-15 | Income for the year 2015-16 |
|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) |
| 1 | Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada, Karimnagar Dist. | Rs. 70.08,21,471/- | Rs.85,87,04,367/- |
| 2 | Sri Lakshmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Nalgonda Dist. | Rs. 73,03,16,049/- | Rs. 77,80,77,950/- |
| 3 | Sree Seetha Ramachandra Swamy Devasthanam, Bhadrachalam, Khammam Dist. | Rs. 29,86,91,836/- | Rs. 38,76,80,936/- |
| 4 | Sri Ganesh Temple, Secunderabad | Rs. 6,73,19,865/- | Rs, 6,97,30,102/- |
| 5 | Sri Anjaneya Swamy Devasthanam, Kondagattu, Karimnagar Dist. | Rs. 14,52,31,889 | Rs. 17,77,03,245/- |
| 6 | Sri Mallikarjuna Swamy Devasthanam, Komuravally, Warangal Dist. | Rs. 10,13,47,789/- | Rs.13,08,45,401/- |

| (1) | (2) | (3) | (4) |
|---|---|---|---|
| 7. | Sri Gnana Saraswathi Devasthanam, Basar, Adilabad Dist. | Rs. 14,55,52,509/- | Rs.17,71,31,975/- |
| 8 | Sri Kaleshwara Mukteswara Swamy Devasthanam, Kaleswaram, Karimnagar Dist. | Rs. 3,55,78,429/- | Rs. 5,39,98,762/- |

గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ గారు స్వయంగా దేవాలయాల విషయంలో ఎంతో ముందుచూపుతో వెళుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి 2014-15లో రూ.70,08,21,471ల ఆదాయం ఉంటే 2015-16లో రూ.85,87,04,367ల ఆదాయం వచ్చింది. దేవాలయాల ఆదాయ వివరాలు సభ్యులందరికీ ఇవ్వడం జరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలంగాణాలోని అన్ని దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుతోంది. రద్దీకి తగినట్లుగా భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నాం. గోదావరి పుష్కరాలు, కృష్ణా పుష్కరాలు, సమ్మక్క-సారక్క జాతర లను బ్రహ్మాండంగా నిర్వహించి, భక్తులకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల కృషి ఫలితంగా మంచి కార్యక్రమాలు జరిగాయి. భవిష్యత్తులో శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయం, శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం జరిగింది.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, తెలంగాణాలో దేవాలయాల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లుగా మంత్రిగారు చెప్పడం జరిగింది. నల్గొండ జిల్లా, నార్కెట్‌పల్లి మండలంలో గల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని చెబుతూ ఒక ప్రభుత్వ ఉత్తర్వు కూడా జారీ చేశారు. కానీ దానికి సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడానికి గల కారణాలేమిటి? అంత పెద్ద దేవాలయానికి నిధులు విడుదల చేసే అవకాశం ఉన్నదా? దయచేసి మంత్రిగారు చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి: అధ్యక్షా, ధన్యవాదాలు. చీఫ్ విప్ సుధాకర్ రెడ్డిగారు ప్రస్తావించిన విషయం గురించే నేను కూడా మాట్లాడుతున్నాను. వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం 1800 సంవత్సరాల చరిత్ర గల దేవాలయం. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారు. వేణుగోపాలస్వామి దేవాలయాన్ని అడాప్ట్ చేసుకుంటున్నామని గతంలో ప్రభుత్వం ఒక జీ.ఓ. కూడా జారీ చేసింది. కాబట్టి వెంటనే దాన్ని టేకోవర్ చేసి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ నారదాసు లక్ష్మణరావు: అధ్యక్షా, నేను కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం గురించి మాట్లాడుతున్నాను. ఇంతకు ముందు అది కరీంనగర్ జిల్లాలో ఉండేది, ఇప్పుడు జగిత్యాల జిల్లాలో చేరిపోయింది. ప్రతి రోజూ ఆదిలాబాదు, నిజామాబాదు, వరంగల్ తదితర జిల్లాల నుంచి భక్తులు అక్కడికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకొని వెళుతుంటారు. మొక్కులు చెల్లించు కుంటుంటారు, కానుకలు సమర్పిస్తుంటారు. కానీ అక్కడ భక్తులకు వసతి సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. ప్రైవేటు వ్యక్తులు లాడ్జీలు కట్టారు కానీ అవి కూడా సరిపోవడం లేదు. కావున భక్తులకు సరిపడ వసతి సౌకర్యాలు కల్పించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి. నరేందర్ రెడ్డి: (స్థానిక సంస్థలు - రంగారెడ్డి) అధ్యక్షా, వికారాబాదు జిల్లా కేంద్ర సమీపంలో అనంతగిరిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అనంత పద్మనాభస్వామి టెంపుల్ ఉంది. ఆ టెంపుల్ పేరు మీద ఐదు వేల ఎకరాల అటవీ భూమి ఉంది. కేరళ తర్వాత చెప్పుకోదగ్గ రెండో ప్రసిద్ధి దేవాలయం ఇది. మూసీ నది కూడా అక్కడి నుండే ప్రారంభమవుతుంది. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఆ దేవాలయాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : అధ్యక్షా, దయచేసి అంతటా సెక్యులరిజం ఉండాలి. దేవాలయాల భూములను కొంత మంది వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. ఎంతో విలువైన ఈ భూములు అన్యాక్రాంతమైపోతున్నాయి. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొన్నట్లు కనబడడం లేదు. దీని మీద ఏదైనా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏదైనా వేస్తారా? లేకపోతే మీ డిపార్టుమెంటులో ఏదైనా విధానం ఏర్పాటు చేస్తారా? దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ఏమి యాక్షన్ తీసుకోబోతున్నారు? రెండు - మా సుధాకర్‌రెడ్డిగారు భద్రాచలం టెంపుల్‌గురించి ఎప్పుడూ సభలో అడుగుతుంటారు. యాదాద్రి టెంపుల్, వేములవాడ టెంపుల్‌ని అభివృద్ధి చేయండి, సంతోషం, మాకు అభ్యంతరం లేదు. కానీ what about Bhadrachalam temple అని అడుగుతుంటారు. భద్రాచలం టెంపుల్‌కి రూ.100కోట్లు కేటాయిస్తున్నామన్నారు కానీ ఇప్పటి వరకు రిలీజ్ కాలేదు. ఆ నిధులను రిలీజ్ చేయాలని కోరుతున్నాను.

గత ప్రభుత్వం ఒక స్కీము పెట్టింది, మంత్రిగారికి తెలుసు. కొంత కంట్రిబ్యూషన్ కడితే మిగతా మొత్తాన్ని సిజిఎఫ్ నుండి ఇచ్చేవాళ్లు. నా నియోజకవర్గంలో 24 దేవాలయాలకు దాదాపు

రూ.3లక్షల కంట్రిబ్యూషన్ ఎమౌంటుని ఇచ్చాను, ఆ డి.డి.లు డిపార్టుమెంటులో ఉన్నాయి. దానికి అనుగుణంగా సిజిఎఫ్ నుంచి ఒక్క రూపాయి కూడా రిలీజ్‌కాలేదు. ఏమన్నా అంటే – ఆదాయం వచ్చే దేవాలయాలన్నీ ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లాయి, ఆదాయం లేని దేవాలయాలు తెలంగాణాకి వచ్చాయని అంటున్నారు. దేవాలయాల నుంచి ఆదాయం లేకపోతే మీరు గవర్నమెంటు నుండి ఇవ్వండి. తక్షణమే ఆ దేవాలయాలన్నింటికీ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎ. ఇంద్రకరణ్‌రెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు, రాజగోపాల్‌రెడ్డి గారు మాట్లాడుతూ నార్కేట్‌పల్లి వేణుగోపాలస్వామి దేవాలయం గురించి చెప్పారు. ప్రభుత్వం ఆ దేవాలయాన్ని దత్తత తీసుకుంటుందని గతంలో చెప్పారన్నారు. యాదాద్రి టెంపుల్ ఆధ్వర్యంలో దాన్ని టేకోవర్ చేయడానికి ప్రతిపాదనలు తయారైన సందర్భంలో కోర్టుకెళ్లడం వల్ల అది ఆగిపోయింది. కోర్టులో మేము కూడా కౌంటర్ వేశాం. అది క్లియర్ అయిన తర్వాత ఆ టెంపుల్‌ని అడాప్ట్ చేసుకుంటామని తెలియజేస్తున్నాను.

నారదాసు లక్ష్మణరావు గారు కొండగట్టు దేవాలయం గురించి చెప్పారు. 2014–15లో ఆ దేవాలయానికి రూ.14,52,388 ల ఆదాయం వచ్చింది. 2015–16లో రూ.17,71,03,245 కి ఆదాయం పెరిగింది. అక్కడ ఉన్న కోనేరు, నీటి వసతి గానీ గతంలో ఎప్పుడూ లేని విధంగా బ్రహ్మాండంగా అభివృద్ధి చేశాం. నూతనంగా మరొక రూ.5కోట్ల ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. ఫైనాన్స్ మినిస్టర్ రాజేందర్‌గారు కూడా దాని గురించి ప్రయత్నం చేస్తున్నారు. అక్కడ భక్తులకు అవసరమైన వసతి గృహాలు, మిగతా సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయడానికి దేవాదాయశాఖ కృషిచేస్తోంది.

గౌరవ యల్‌ఓపి గారు దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని చెప్పారు. దేవాలయాలకు చెందిన ఒక్క ఎకరం కూడా ప్రభుత్వం తీసుకునే హక్కు లేదని హైకోర్టు స్పష్టంగా చెప్పడం జరిగింది. ప్రజల సౌకర్యార్థం, రైల్వే డిపార్టుమెంటుకి అవసరమనుకుంటే కోర్టు ద్వారా మాత్రమే తీసుకోవాలి. ఎవ్వరికీ కూడా హక్కు లేదు. తెలంగాణ రాష్ట్రంలో దేవాలయ భూములు 82వేల ఎకరాలున్నాయి. నాకు తెలిసి అందులో చాలా వరకు అన్యాక్రాంతమయ్యాయి. ఆభూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలను దేవాలయాల పేరు మీదనే కలెక్టర్ల ద్వారా జారీ చేయించాలనే ప్రయత్నం చేస్తున్నాం. అన్యాక్రాంతమైన భూములకు సంబంధించి మేము ఎన్ని నోటీసులు ఇచ్చినా అవతలి వాళ్లు స్పందించడం లేదు. దీనికి సంబంధించి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేశాం. పర్యవేక్షణ జరుగుతోంది. అన్యాక్రాంతమైన భూములకు సంబంధించి పర్సనల్‌గా గానీ, పత్రికల ద్వారా కానీ మాకు ఫిర్యాదు చేస్తే ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నాం.

గౌరవ షబ్బీర్ అలీ గారు మాట్లాడుతూ, తాను 24దేవాలయాలకు రూ.3లక్షలు కంట్రిబ్యూట్ చేశాను, మిగతా మొత్తాన్ని సిజియఫ్ నుండి ఇవ్వమని అడుగుతున్నారు. సిజియఫ్‌లో ఒక్క రూపాయి కూడా లేదు. తిరుమల తిరుపతి దేవస్థానములు ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లిన తర్వాత వాళ్ల నుంచి మన ప్రాంతంలోని దేవాలయాలకు నిధులు రావడం లేదు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రిగారు రూ.50కోట్ల బడ్జెట్ ఏర్పాటు చేసిన తర్వాత ఇప్పుడు గౌరవ సభ్యులు అడిగిన దేవాలయాలకు నిధులు ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయాల అభివృద్ధికి మీరు 30 శాతం కంట్రిబ్యూట్‌చేస్తే మిగతాది సిజియఫ్ క్రింద ఇస్తాం. గౌరవ యల్‌ఓపి గారు రూ.3లక్షలు కంట్రిబ్యూట్‌చేశామంటున్నారు, అంటే ఇకమేము ఇచ్చేది రూ.10లక్షలుంటుంది. ఆ పది లక్షలు ఒక దేవాలయానికి సరిపోతుంది. మీరు చెబుతున్నవి ముందే శాంక్షన్ అయ్యాయి కాబట్టి ఆలస్యం లేకుండా ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాం.

గతంలో ఎప్పుడూ లేని విధంగా యాదాద్రికి రూ.950కోట్ల నుంచి రూ.1000కోట్ల వరకు ఖర్చు పెట్టి బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి, తెలంగాణ తిరుపతిగా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు మన ముఖ్యమంత్రిగారు. వేములవాడ దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నాం. రాముల వారి కళ్యాణానికి భద్రాచలం వెళ్లినపుడు ముఖ్యమంత్రిగారే స్వయంగా అక్కడ తిరిగి చూసి ఆదేవాలయ అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించారు. ఆ పనులను ఆర్కిటెక్టుకి అప్పజెప్పడం జరిగింది. భద్రాచలం రాములవారి దేవాలయాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉంది. అలాగే బాసర సరస్వతీదేవి టెంపుల్, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం వంటి ముఖ్యమైన మందిరాలను డెవలప్ చేసే ప్రతిపాదనలున్నాయి.

### ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో సదుపాయాలు

ప్రశ్న నెం. 1385(36)

శ్రీ వి. భూపాల్‌రెడ్డి, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) రాష్ట్రంలో అనేక ప్రాథమిక ఆరోగ్య ఉప–కేంద్రాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్న విషయం వాస్తవమేనా?

(ఆ) అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అత్యల్ప వేతనాలలో వాచ్‌మెన్, ఇతర అసిస్టెంట్లు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం కూడా వాస్తవమేనా?

(ఇ) అయితే, ప్రాథమిక ఆరోగ్య ఉప–కేంద్రాల వద్ద కనీస మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఆ కేంద్రాలలో సిబ్బంది వేతనాలను పెంచడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డాక్టర్ సి. లక్ష్మారెడ్డి):– (అ) లేదండీ.

రాష్ట్రంలో మొత్తం 4797 ఉప–కేంద్రాలు ఉన్నాయి. అందులో, 1642 ఉప–కేంద్రాలు ప్రభుత్వ భవనాలలో ఉన్నాయి, మిగిలిన 3155 ఉప–కేంద్రాలను, ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం నిధులతో దశల వారీగా ప్రభుత్వ భవనాలను నిర్మించాలని యోచిస్తున్నది.

(ఆ) రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించడమవుతున్నది.

(ఇ) వర్తించదు.

శ్రీ వి. భూపాల్‌రెడ్డి: (స్థానిక సంస్థలు – మెదక్) అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు 'ఎ' ప్రశ్నకు సమాధాం చెబుతూ – లేదన్నారు. నేను ఆ పిహెచ్‌సి లను సందర్శించిన ఒక నెల తర్వాత వచ్చి, అక్కడ ఇబ్బందులున్నాయని తెలియజేస్తూ మీకొక లెటర్ ఇవ్వడం జరిగింది. అక్కడ ఇద్దరు డాక్టర్లను పోస్ట్ చేశారు కానీ ఒక్కరే పని చేస్తున్నారు, మరొక డాక్టర్‌ని వేరే చోట డెప్యుటేషన్ మీద వేశారు, ఆయన్ని అక్కడే కంటిన్యూ చేస్తున్నారు. పేషంట్స్ అక్కడ తక్కువేమీ లేరు. 200మంది రోజూ వస్తున్నారు, పది ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ జరుగుతున్నాయి. అక్కడ ఒక స్టాఫ్ నర్సు, మూడు ఎయన్‌యం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బిల్డింగు అకామొడేషన్ సరిపోవడం లేదు, ఇంకా కొంత ఎకామొడేషన్ కావాలని అడగడం జరిగింది. నేను అక్కడ విజిట్ చేసిన తర్వాత – వాచ్‌మెన్ల గురించి చెబితే అవుట్‌సోర్సింగ్ క్రింద పే చేస్తున్నామన్నారు. మళ్లీ కూడా నేను తెలుసుకున్నాను, నేషనల్ హెల్త్ మిషన్ క్రింద నెలకి రూ.4900 లు మాత్రమే ఇస్తున్నారు. నేను ఆరోజు అక్కడికి వెళ్లినపుడు – దొంగలు కాంపౌండు వాల్‌కి హోల్ చేసి ఛైర్లు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. మీరు ఉండగా ఎందుకు ఇలా జరిగిందని అక్కడ వున్న వాచ్‌మెన్లను మందలించడం జరిగింది. మేమేమి వాచ్‌మెన్లం సార్, రూ.4,900లు ఇస్తే ఏమి నౌకరు చేయాలన్నారు. నేను అప్పటికప్పుడు రూ.2,000 పర్సనల్‌గా ఇచ్చాను. ఇప్పటికీ కంటిన్యూగా ఇస్తున్నాను, ఇది నాలుగో నెల, ప్రతి నెలా ఐదో తారీఖున వచ్చి తీసుకెళ్లమని చెప్పాను. వాళ్లు వచ్చి తీసుకెళుతున్నారు. ఈవిధంగా ఇబ్బందులున్నాయని చెబుతూ మీకు లెటర్ ఇచ్చాను. ఏమీ రిజల్ట్ లేకపోతే ఈ ప్రశ్న వేశాను. ప్రభుత్వాన్ని హెచ్చరించడం కాదు కానీ సమస్యని మీదృష్టికి తీసుకొస్తున్నాను. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

డాక్టర్ సి. లక్ష్మారెడ్డి: అధ్యక్షా, సబ్‌సెంటర్లపై క్వశ్చన్ ఉంది కాబట్టి వాటికి సంబంధించిన ఆన్సర్ ఇవ్వడం జరిగింది. పిహెచ్‌సి లకు సంబంధించి అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్‌కి ఎక్కడైనా లోకల్‌గా శాలరీస్ తక్కువగా ఉంటే చర్యలు తీసుకొని, వారికి సరైన వేతనాలు అందించే దిశగా చేస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసే విషయంలో ప్రభుత్వపరంగా తప్పకుండా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. Next time, ఎప్పుడైనా ఆ ప్రశ్న వస్తే తప్పకుండా చెబుతాం.

### క్రీడా సంబంధిత మౌలిక సదుపాయాల కల్పన

ప్రశ్న నెం.1437(37)

శ్రీ ఎన్.రామచంద్రరావు, ఎం.ఎల్.సి.:– గౌరవనీయులైన ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలతో పాటు అన్ని పాఠశాలలలో ప్రతిభను వెలికి తీయడానికి మౌలిక సదుపాయాలను, శిక్షణా సదుపాయాలను సమకూర్చే ప్రతిపాదన ఏదైనా ఉందా?

(ఆ) రాష్ట్రంలో కొత్త క్రీడా ప్రాంగణాలను నిర్మించే ఏదేని ప్రతిపాదన కూడా ఉందా?

(ఇ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

గౌ. ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి (శ్రీ టి. పద్మారావు):– (అ) క్రీడా ప్రాధికార సంస్థ నుండి ప్రస్తుతం అట్టి ప్రతిపాదనలేమీ లేవు.

(ఆ) ప్రతి శాసనసభ నియోజక వర్గంలో దశల వారీగా క్రీడా ప్రాంగణాలను నిర్మించాలని 18–10–2012 తేదీగల వైటి &సి శాఖ, జి.ఓ.ఎంఎస్.నెం.82లో విధాన నిర్ణయాన్ని తీసుకోవడమయిందని తెలియజేయడమయింది.

(ఇ) 119 నియోజక వర్గాలకుగాను 89 నియోజకవర్గాలను ఇప్పటికే వర్తింపజేసి పూర్తిచేయడమయింది. 53 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇంకా ప్రారంభించాల్సినవి 57 ఉన్నాయి. (89) నియోజకవర్గాలలో మొత్తం (125) క్రీడా ప్రాంగణాలను మంజూరుచేయడమయింది. మిగిలిన 30 నియోజక వర్గాలకు సంబంధించినవి (119–89) =30 భూమి లభ్యంగా లేనందున / అవసరమైన భూమిని గుర్తించనందున, ప్రతిపాదనలను

సమర్పించనందున (30) నియోజకవర్గాలలో మినీ ప్రాంగణాలను మంజూరు చేయలేదు. భూమిని గుర్తించి క్రీడా ప్రాధికార సంస్థ పేరిట కేటాయించి, సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా సదరు శాసనసభ నియోజక వర్గాల నుండి ప్రతిపాదనలు అందిన వెంటనే మినీ ప్రాంగణాలను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. (జాబితాను అనుబంధం-1 రూపంలో సభా సమక్షంలో ఉంచడమయింది.)

**11.00 ఉ.** శ్రీ ఎన్.రామచంద్రరావు : (పట్టభద్రుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్) అధ్యక్షా, మౌలిక వసతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఖేలో ఇండియా ప్రోగ్రాంలో భాగంగా ప్రతి జిల్లాకు యాభై కోట్లు కేటాయించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. అది ఎంతవరకు అమలవుతుందో నాకు తెలియదు. స్టేడియాం కాకుండా అందులో పని చేస్తున్న కోచ్‌ల సర్వీసుల రెగ్యులరైజేషన్ ఎంతవరకు చేశారో తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఎందుకంటే, రాష్ట్రం విడిపోయే సమయంలో 72 కోచ్‌ల ఖాళీలు ఉండేవి. వాటిలో నేటిని భర్తీ చేయలేదని నాకున్న సమాచారం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం కోట్ల రూపాయలతో సత్కారం చేస్తుంది. కానీ, ఎవరైతే క్రీడల్లో పాల్గొంటున్నారో వారికి మాత్రం ప్రోత్సాహం ఇవ్వడం లేదు. క్రీడల్లో పాల్గొనే వారిని కూడా ప్రోత్సహిస్తే వారు ముందు, ముందు పాల్గొనే క్రీడల్లో రాణించడానికి అవకాశం ఉంటుంది.

అలాగే ఇతర దేశాల్లో పాల్గొనే క్రీడాకారులకి టి.ఏ., డి.ఏ.లు ఇస్తున్నారా? లేదా అనేది ప్రభుత్వం తెలియజేయాలి.

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు : అధ్యక్షా, ఎక్సైజ్ శాఖకి వచ్చే ఆదాయంలో 0.75శాతం క్రీడల శాఖకి కేటాయించాలని ఉంది. అందులో భాగంగా ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖ నుండి క్రీడల శాఖకి ఎన్ని నిధులు కేటాయించారో తెలియజేయాల్సిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ సబావత్ రాములు నాయక్ : (నామినేటెడ్) అధ్యక్షా, పూర్ణ అనే అమ్మాయి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం జరిగింది. అందుకు బహుమానంగా ఆ అమ్మాయికి ప్రభుత్వం రూ.25లక్షలు ఇవ్వడం జరిగింది. అకాడమీ పెట్టుకునేందుకు సానియా మిర్జాకు మరియు గోపిచంద్‌కు ప్రభుత్వం తరఫున సహాయం అందించినట్లుగా పూర్ణ అనే అమ్మాయి కూడా అకాడమీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున ఏమైనా సహాయం చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణ : (స్థానిక సంస్థలు – ఖమ్మం) అధ్యక్షా, మన రాష్ట్రంలో గతంలో ఉన్న 10 జిల్లాలని 31 జిల్లాలుగా చేశారు. 10 జిల్లాలుగా ఉన్నప్పుడే కోచ్‌ల కొరత ఉన్నట్లుగా గౌరవ మంత్రివర్యుల దృష్టికి తీసుకువచ్చాను. ఇప్పుడు 31 జిల్లాలు అయ్యాయి కాబట్టి, కనీసం అవుట్ సోర్సింగ్‌లోనైనా కోచ్‌లను నియమించాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పూల రవీందర్ : అధ్యక్షా, గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యం గల వారిని గుర్తించి శాసనసభ నియోజకవర్గాల స్థాయిల్లోనే విద్యార్థులకు శిక్షణ ఇప్పించినట్లయితే గ్రామీణ ప్రాంత ప్రజలను, విద్యార్థులను ప్రోత్సహించినట్లుగా ఉంటుందని మీద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ వి.భూపాల్ రెడ్డి : అధ్యక్షా, సానియా మిర్జా, మరియు పుల్లెల గోపీచంద్ అకాడమీలో అడ్మీషన్స్ పొందేందుకు పేద వారికి ఏదైనా రిజర్వేషన్ కల్పించే ఆలోచనను ప్రభుత్వం పరిశీలించాలని, అకాడమీలు కేటాయించే వాటిలో కూడా రిజర్వేషన్ కల్పించాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి కోచ్‌ల యొక్క నియామకం జరగలేదు. రాష్ట్రంలో మంచి పట్టుదల గల క్రీడాకారులు చాలా ఉన్నారు. అందుకని వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వద్ద కోచ్‌లను నియామకం చేసే ఆలోచన ఏమైనా ఉందా అనేది తెలియజేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ టి.పద్మారావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ ఎం.ఎస్. ప్రభాకర్ రావు గారు చెప్పిన దాంతో నేను ఏకీభవిస్తున్నాను. అసలైతే ఎక్సైజ్ శాఖ నుండి 0.75శాతం నిధులు క్రీడల శాఖకి రావాలి. ఆ పర్సంటేజీ చూసుకుంటే ఎక్సైజ్ శాఖలో ఇప్పుడున్న నిధుల ప్రకారం దాదాపు రూ.200కోట్లు క్రీడా శాఖకు వస్తుంది. ఒకవేళ ఆనిధులు గనుక కరెక్ట్‌గా క్రీడా శాఖకి వస్తే క్రీడా శాఖలో చెప్పలేనన్ని నిధులు వెచ్చించి క్రీడలను బాగా ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చు.

గతంలో అలా జరగకుండా కేవలం క్రీడా శాఖకి బడ్జెట్‌లోనే కొంత నిధులు కేటాయించే వారు. నేను క్రీడా శాఖ మంత్రిగా అయిన తరువాత గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాన్ని మనం కూడా అనుసరిస్తే వారికీ మనకు తేడా ఉండదని ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లాను. రాబోయే కాలంలో నేను క్రీడా శాఖల మంత్రిగా ఉన్ననూ, లేకున్ననూ తప్పనిసరిగా ఆ నిధులు క్రీడా శాఖకు వచ్చేట్లుగా నావంతు కృషి నేను చేస్తానని

తెలియజేస్తున్నాను. గతంలో ఆ నిధులు గనుక క్రీడా శాఖకి ఖచ్చితంగా వచ్చి ఉంటే ఇప్పుడు సభలో ఏ సభ్యులు కూడా నన్ను ప్రశ్నించే అవసరం ఉండకపోయేది.

అధ్యక్షా, ఇంకో అదృష్టం ఏమిటంటే ఎక్సైజ్ శాఖ మరియు క్రీడా శాఖను కూడా నేనే చూస్తున్నాను. ఎందుకంటే, ఈ సమస్య కొంత సులువు అవుతుందనే ఉద్దేశ్యంతో తెలియజేస్తున్నాను.

కేంద్ర ప్రభుత్వం వారు ప్రకటించిన ఏషియా ఖేల్ పథకం క్రింద రూ.1.60లక్షల నిధులు స్టేడియంలకు ఇస్తామని చెప్పడం జరిగింది. కానీ, ఇప్పటివరకు ఆ నిధులు మంజూరు కాలేదు. ఒకవేళ ఆ నిధులు వస్తే స్టేడియంలను బాగు చేసేందుకు కృషి చేస్తాము. కోచ్‌లను రెగ్యులర్ చేయడమనేది ప్రభుత్వ నిర్ణయం. గతంలో నేను క్రీడా వసతి గృహాలను పర్యటించినప్పుడు కోచ్‌లు వారి జీతాలు రూ.8వేలు, 10వేలు, 12వేల అని చెప్పడం జరిగింది. అది నాకు కూడా కొంత ఇబ్బంది అనిపించింది. వారి జీతాలు పెంచే విషయాన్ని కూడా వీలైనంత తొందరలో పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తాను. క్రీడాకారులు క్యాంప్‌లకు వెళ్లినప్పుడు వారికి అందే టి.ఏ., డి.ఏ.లు జీ.ఓ.4 క్రింద అందజేస్తున్నాము. గత ప్రభుత్వాలైతే ప్రయాణ ఖర్చులే ఇస్తుండేవి కావు. కానీ, ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారులు పంపించిన టి.ఏ., డి.ఏ.ల వివరాలు ప్రభుత్వ పరంగా ఒకసారి పరిశీలించి మంజూరు చేస్తున్నాము. అలాగే పేద వారికి ఏదైనా రిజర్వేషన్ కల్పించే విషయంలో కూడా పుల్లెల గోపీచంద్ గారితో చర్చించి ప్రభుత్వం పరిశీలిస్తుందని మీద్వారా సభ్యులకి తెలియజేస్తున్నాము.

## నూతన పోలీసు కమీషనరేట్ల ఏర్పాటు

ప్రశ్న నెం. 1554(38)

సర్వశ్రీ నారదాసు లక్ష్మణ్‌రావు, టి. భానుప్రసాద్ రావు, డా. ఆర్. భూపతి రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) రాష్ట్రంలో కొత్త పోలీసు కమీషనరేటును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా?

(ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

(ఇ) ఎప్పటిలోగా వీటిని ఏర్పాటు చేయడమవుతుంది?

గౌరవనీయులైన హోం శాఖ మంత్రి (శ్రీ నాయిని నర్సింహారెడ్డి):- (అ) అవునండీ.

(ఆ) ప్రభుత్వం కరీంనగర్, నిజామాబాద్, రామగుండం, సిద్ధిపేటలలో పోలీసు కమీషనరేట్లను ఏర్పాటు చేసింది.

(ఇ) కొత్తగా ఏర్పడిన 4 పోలీసు కమీషనరేట్లు ఉనికిలోకి వచ్చి 11-10-2016వ తేదీ నుండి పనిచేయడం ప్రారంభించాయి.

తెలంగాణ ప్రభుత్వం ప్రజల సౌకర్యం, భద్రతా మరియు చేరువగా పోలీసు సేవలు తీసుకువచ్చే ఉద్దేశ్యంతో పోలీసు శాఖను ఆధునీకరించడానికి నిర్ణయించడం జరిగింది. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని కొత్తగా కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, సిద్ధిపేటలో నాలుగు కమీషనరేట్లను ఏర్పాటు చేసింది. శాసనమండలి అధివేశంలో లేనందున ప్రభుత్వం కొత్త కమీషనరేట్లను ఏర్పాటు చేస్తూ అక్టోబరు 8న ఆర్డినెన్స్ జారీ చేయడం జరిగింది. ఈ ప్రాంతాలలో జనాభా పెరుగుదల, వేగవంతమైన పట్టణీకరణ జరగడం లేదా పట్టణ ప్రాంతాల సంస్థలు పెరగడం వాటి పరిష్కారం కొరకు పరిపాలనా సౌలభ్యం, సౌకర్యం కొరకు భౌగోళిక పరిస్థితుల కారణంగా మెరుగైన పోలీసు మరియు శాంతి, భద్రతల నిర్వహణ నేర నిరోధక నియంత్రణ కొరకు మరియు మహిళల భద్రత కొరకు కొత్త కమీషనరేట్ల ఏర్పాటు కొరకు ఆవశ్యకత ఏర్పడింది. కొత్త కమీషనరేట్ల వల్ల ప్రజలకు మరింత మెరుగ్గా పోలీస్ సేవలు అందుతాయి. నేరాల సంఖ్య నియంత్రణే కాకుండా త్వరితగతిన నేరాలను ఛేదించడం సాధ్యం అవుతుంది. నేరస్థులపై గట్టి నిఘా ఉంటుంది. నిర్దిష్టపర్యవేక్షణ సాధ్యం అవుతుంది. ట్రాఫిక్ నియంత్రణ మరియు మెరుగైన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నాన్ కాంట్రాక్ట్ ఆన్‌లైన్ ఛానల్ సిస్టమ్ అమలులోకి తేవడం వస్తుంది.

విజిబుల్ పోలీస్ ఉంటుంది మరియు మొబైల్ అందుబాటులోకి వస్తుంది. ప్రణాళికా బద్ధంగా సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. పాస్‌పోర్ట్ మొదలగు వాటిపై సత్వర ఎంక్వైరీ పరిష్కారానికి జారీ అవకాశం ఉంటుంది.

శ్రీ నారదాసు లక్ష్మణరావు : అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్నకు దాదాపుగా సంతృప్తికరమైన సమాధానం దొరికింది. అయినప్పటికీ ఒకసూచన చేస్తున్నాను. కొత్తగా ఏర్పాటు చేసిన నాలుగు కమీషనరేట్లు ఏవైతే ఉన్నాయో, వాటి పరిధిలో సి.సి. కెమెరాల ఏర్పాటును చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా? ఎందుకంటే, మొన్న కరీంనగర్ పట్టణంలోని 48వ డివిజన్‌లో చల్లా స్వరూపారాణి హరిశంకర్ అనే కార్పొరేటర్ రూ.25లక్షలను ఆ డివిజన్‌లో ఉన్నటువంటి ప్రముఖుల దగ్గర విరాళాలు సేకరించి 125 సి.సి. కెమెరాలను ఆ డివిజన్‌లో ఏర్పాటు చేయించడం జరిగింది. అంటే సి.సి. కెమెరాల పట్ల ప్రజలు మొగ్గు చూపుతున్నారనే విషయం మనకు అర్థం అవుతోంది. సి.సి. కెమెరాల ద్వారా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరే అవకాశం

ఎక్కువగా ఉన్నది గనుక ఈ నాలుగు కమీషనరేట్ల పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఒక సూచన.

అలాగే ఏ ప్రభుత్వం అయినా కూడా సంపూర్ణంగా అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలంటే రాజకీయ సుస్థిరత, శాంతి–భద్రతలు అమలులో ఉండడం అత్యంత అవసరం. అందుకే ఈ రాష్ట్రప్రభుత్వం శాంతి భద్రతలను అదుపులో పెట్టడానికి ఈ కమీషనరేట్లను ఏర్పాటు చేయడం జరిగింది దాంతోపాటు ఈ సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తే ఇంకా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పి ఆ సూచనను పరిశీలించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ టి. భానుప్రసాద రావు : (స్థానిక సంస్థలు – కరీంనగర్) అధ్యక్షా, నాలుగు కమీషనరేట్లు ప్రారంభించడం జరిగిందని గౌరవ మంత్రివర్యులు తెలియజేయడం జరిగింది. అలాగే రాచకొండ కమీషనరేట్ కూడా ఏర్పాటు చేసినట్లుగా తెలిసింది. ఎందుకోగానీ దాని విషయం ఇందులో మెన్షన్ చేయలేదు. దానిని కూడా కొత్తగా ఏర్పాటు చేసినట్లుగా నేను భావిస్తున్నాను. అయితే నూతన కమీషనరేట్లు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమైన విషయం. రెండు రోజుల క్రితం రామగుండం కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి నియోజకవర్గం క్రిందకు వచ్చే శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కి సంబంధించిన ఒక ఏఎస్ఐ సూసైడ్ చేసుకోవడం జరిగింది. ఇలా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన అధికారులు డిప్రెషన్‌కి లోనై, ఇతరత్రా సమస్యలు ఏమున్నాయో తెలియదు కానీ, చాలామంది సూసైడ్ చేసుకోవడం జరిగింది. ఇప్పటికే ఏమైనా ఓరియెంటేషన్ క్లాసెస్ జరుగుతున్నప్పటికీ, ఇంకా ఏమైనా ప్రత్యేకమైన క్లాసెస్ తీసుకునే అవకాశం ఉందా అని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డా. ఆర్. భూపతిరెడ్డి : (స్థానిక సంస్థలు – నిజామాబాద్) అధ్యక్షా, నిజామాబాద్ జిల్లాలో కొత్తగా పోలీస్ కమీషనరేట్ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయం. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో పోల్చుకుంటే నిజామాబాద్ జిల్లా చాలా పెద్ద జిల్లా. దాదాపు 15లక్షల జనాభా ఉంటుంది. అందులో రెండు కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీలు ఉంటాయి. అందులో దాదాపు అర్బన్ పాపులేషనే దాదాపు ఐదు లక్షలు ఉంటుంది. అక్కడ పాపులేషన్ ఎక్కువగా ఉండడం వల్ల కొంత ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. కాబట్టి ఈ కమీషనరేట్ పరిధిలో ఒక ఏసిపి ట్రాఫిక్‌ని కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

అదేవిధంగా నిజామాబాద్ జిల్లాను ఆనుకొని మహారాష్ట్ర బార్డర్ ఉంటుంది. ఆ బార్డర్‌లో ఎక్కువగా ఇల్లీగల్ యాక్టివిటీస్ గానీ, మట్కా, గుట్కా, ట్రాన్స్‌పోర్ట్ మరియు కల్తీ నూనె తయారు చేయడం లాంటివి ఎక్కువగా జరుగుతుంటాయి. కాబట్టి అక్కడ కూడా ఒక ఏసిపి, టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి : అధ్యక్షా, మంత్రిగారు నాలుగు కమీషనరేట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కానీ, రాచకొండ కమీషనరేట్ ఏర్పాటు విషయం తెలియజేయలేదు. ఆ రాచకొండ కమీషనరేట్ ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా భువనగిరిలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. యాదాద్రి పుణ్యక్షేత్రానికి కూడా భక్తులు విరివిగా వస్తారు కాబట్టి భువనగిరిలో పెడితే బాగుంటుందని మీద్వారా ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

శ్రీ నాయిని నర్సింహారెడ్డి : అధ్యక్షా, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని గౌరవ సభ్యులు శ్రీ నారదాసు లక్ష్మణరావు గారు కోరారు. నిజంగా కూడా అన్ని జిల్లాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. హైదరాబాద్‌లో కూడా పెద్ద ఎత్తున సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సిసి కెమెరాల వల్ల దొంగతనాలు అరికట్టడం, చైన్ స్నాచింగ్ కూడా తగ్గింది. కమిషనరేట్ల పరిధిలో కూడా అతి తొందరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతాము. సభ్యులు శ్రీ టి.భానుప్రసాద రావు ఒక ఏఎస్ఐ సూసైడ్ విషయాన్ని లేవనెత్తారు. ఆ విషయం మీద ప్రత్యేకంగా ఏదైనా ప్రశ్న రూపంలో వస్తే పూర్తి వివరాలు తెలియజేస్తాను. కానీ, ఇప్పటికే డిజి గారు పోలీస్ అధికారులకి పని ఒత్తిడి ఎందుకు జరుగుతుందనే విషయంలో ఎంక్వైరీ చేస్తున్నారు. వారికి పోలీస్ అకాడమీలో కూడా అప్పుడప్పుడు శిక్షణను ఇవ్వడం జరుగుతోంది. అదేవిధంగా ఎస్సై స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు అందరినీ పిలిచి హైదరాబాద్‌లో కూడా ఒక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇంతకుముందు ఉన్నటువంటి సైబరాబాద్ కమిషనరేట్‌ని రెండుగా చేసి అందులో ఒకదానిని రాచకొండ కమీషనరేట్‌గా చేయడం జరిగింది. రాచకొండ కమీషనరేట్ పరిధిని చూసుకొని దానికి మధ్య భాగంలో, అందరికీ అందుబాటులో ఉండేట్లుగా కమీషనరేట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాము. అందులో భాగంగా ఎల్.బి. నగర్ ప్రాంతాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొంతమంది నేరస్థులు హైదరాబాద్‌లో దొంగతనాలు చేసి గ్రామాలల్లో తలదాచుకుంటున్నారు కాబట్టి వారిని అరికట్టడానికి కష్టమవుతోంది. ఒకవేళ కమీషనరేట్ వస్తే మొబిలిటీ పెంచి పెట్రోలింగ్ ఎక్కువ చేసి ఏసిపిలను ఏర్పాటు చేసి అతి త్వరలో వారిని పట్టుకోడానికి అవకాశం ఉంటుందని, లా

అండ్ ఆర్డర్ మెయింటెనెన్స్ సక్రమంగా ఉంటుందనే ఉద్దేశ్యంతోని ఈ కమీషనరేట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను.

**11.20 ఉ.** గ్రామాలలోకి వెళ్లి తలదాచుకోవడం వలన దొంగలను అరికట్టడం కష్టమవుతుంది. అందువల్ల కమిషనరేట్‌లో మొబిలిటీ పెంచి పెట్రోలింగ్ ఎక్కువగా చేసి, ఎసిపిలను ఏర్పాటు చేసినట్లయితే, త్వరగా వాళ్లను పట్టుకోవడానికి అవకాశముంటుంది. లా అండ్ ఆర్డర్ మెయిన్‌టెయిన్ కూడా సక్రమంగా జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే ఈ కమిషనరేట్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెబుతూ, సెలవు తీసుకుంటున్నాను.

### కార్పోరేట్ ఆసుపత్రులలో అనవసర వైద్య పరీక్షల నిర్ధారణ

ప్రశ్న నెం.1415(39)

సర్వశ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మహమ్మద్ అలీ షబ్బీర్, ఎం. రంగారెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) రాష్ట్రంలోని దాదాపు అన్ని కార్పోరేటు, ప్రైవేటు ఆసుపత్రులలో అమాయక రోగులకు అనవసరమైన రోగనిర్ధారణ పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్దేశించి, భారీ మొత్తాలు పోగు చేసుకుంటున్న విషయం వాస్తవమేనా?

(ఆ) ఈ కార్పోరేటు ఆసుపత్రులు స్థానిక ఆర్ఎంపి, పిఎంపి డాక్టర్లకు కమీషన్లను సమాకూరుస్తూ, అనవసరమైన శస్త్ర చికిత్సలకు సిఫారసు చేయించుకుంటున్న విషయం కూడా వాస్తవమేనా?

(ఇ) కొన్ని ఆసుపత్రులు సిజిహెచ్ఎస్ జాబితాలో ఉన్నప్పటికీ, రోగులను తీసుకోవడం లేదన్న విషయం కూడా వాస్తవమేనా?

(ఈ) అయితే, ప్రారంభించాల్సిన ప్రతిపాదిత చర్య ఏమిటి?

గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (డా. సి. లక్ష్మా రెడ్డి):- (అ) లేదండీ. అయితే, అట్టి సంఘటనలు నివేదించిన చోట కఠిన చర్యను తీసుకోవడమయింది.

(ఆ) లేదండీ.

(ఇ) సిజిహెచ్ఎస్ సర్వీసులు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి.

(ఈ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి : అధ్యక్షా, ఇప్పుడున్నటువంటి పరిస్థితుల్లో కార్పోరేట్ హాస్పిటల్స్ పేద ప్రజలను దోచుకుంటున్నాయి. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఇవ్వాళ ఆరోగ్యం బాగోలేనప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే ఉన్న ప్రాణం పోయేటటువంటి పరిస్థితి ఉంది. ఎందుకంటే డాక్టర్ల నిర్లక్ష్యం, అందుబాటులో మందులు లేకపోవడం, క్లీన్‌లీనెస్ విషయంలో చాలా లోపాలు ఉండటం వల్ల తప్పని పరిస్థితుల్లో పేద ప్రజలు కార్పోరేట్ హాస్పిటల్స్‌లో చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎమర్జెన్సీ సర్వీసు, ఐసియు వంటి అన్ని సౌకర్యాలు ఉన్నట్లయితే ఎవరూ కార్పోరేట్ హాస్పిటల్స్‌కి వెళ్లరు. కానీ, కార్పోరేట్ హాస్పిటల్స్‌కు ట్రీట్‌మెంట్ కోసం వెళితే వాళ్ల బలహీనతలను ఆసరాగ తీసుకొని వేలకు వేలు దోచుకుంటున్నారు.

ఉదాహరణకు – జ్వరం వచ్చినప్పుడు ప్లేట్‌లేట్స్ కొద్దిగా పడిపోతే మందులతో ట్రీట్‌మెంట్ చేస్తే తగ్గిపోతుంది. కానీ, రక్తం ఎక్కించాలని, ఒక బాటిల్ రక్తానికి రూ.15,000 నుండి రూ.20,000 వరకు వసూలు చేసి అలా రోజుకు సుమారు రూ.50,000 వరకు బిల్లు రికార్డు చేసి ఒక నాలుగు, ఐదు రోజులు ఆసుపత్రిలో ఉంచి రూ.2.00 లక్షల వరకు దోపిడి చేస్తున్నారు. నిజానికి కొన్ని జ్వరాలకు రక్తం ఎక్కించాల్సిన అవసరం లేదు. ఆ విషయం గౌరవ సభ్యులకు, తెలంగాణ ప్రజానికానికి తెలుసు. కార్పోరేట్ హాస్పిటల్స్ సర్వీసు ఓరియెంటేషన్‌తో కాకుండా, ఒక పెద్ద వ్యాపారంగా చేస్తున్నారు. అలాగే గర్భిణీ స్త్రీల విషయంలో సాధారణంగా డెలివరీ అయ్యే కేసులను మిస్‌గైడ్ చేసి సిజేరియన్ ఆపరేషన్స్ చేస్తున్నారు.

గతంలో నేను సభ్యునిగా ఉన్నప్పుడు మా జిల్లా నుండి వచ్చే ప్రజలు ఎల్‌బి నగర్ దగ్గర ఉన్న ఆసుపత్రులకు వచ్చినప్పుడు నాకు ఫోన్ చేసి – సార్ ఇక్కడ మొదట డబ్బులు కడితే గాని, అడ్మిట్ చేసుకోమని అంటున్నారని చెప్పేవారు. ఆ విధంగా రోజు వచ్చే ఫోన్లలో 90 శాతం వరకు అలాంటి కాల్సే వచ్చేవి. కాబట్టి అటువంటి కార్పోరేట్ హాస్పిటల్స్‌ను కట్టడి చేసే విధంగా ఒక కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లయితే, పేద ప్రజలకు ఆరోగ్యం విషయంలో భద్రత ఉంటుందని తమరి ద్వారా గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను. తెలంగాణ రాష్ట్రం వచ్చి ఇప్పటికి మూడు సంవత్సరాలవుతుంది. ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారు. ఎన్నో ప్రాజెక్టులను కడుతున్నారు. కానీ అన్నింటికంటే ముఖ్యమైనది ఆరోగ్యం, అనే విషయం మరచిపోయి ఈ ప్రభుత్వం ఇంతవరకు అటువంటి కార్పోరేట్ హాస్పిటల్స్ మీద తగిన చర్యలు తీసుకోలేదు.

మిస్టర్ ఛైర్మన్ : రాజగోపాల్‌రెడ్డి గారూ, పదకొండున్నర దాక ప్రశ్నిస్తూ ఉంటే మీకు జవాబు రాదు. నేను అక్కడికే సమాప్తి చేస్తాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి : అధ్యక్షా, బీబీనగర్ దగ్గర ఉన్నటువంటి ఆసుపత్రిని 180 ఎకరాలలో పది లక్షల చదరపు

అడుగులతో కట్టడం జరిగింది. దానిని ఈ ప్రభుత్వం వెయ్యి పడకల ఆసుపత్రిగా చేయవచ్చు కదా! ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే కార్పోరేట్ హాస్పిటల్స్ దోచుకుంటున్నాయి. దీనిమీద గౌరవ మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ మంత్రిగారికి ఒక విషయం చెప్పదలచుకున్నాను. కార్పోరేట్ హాస్పిటల్స్ అన్నీ ఒక వ్యాపారంగా నడిపిస్తున్నాయి. ఆ హాస్పిటల్స్ మీద తగిన చర్యలు తీసుకునే విధంగా మానిటరింగ్ మెకానిజం చేయవలసిన అవసరముంది.

మిస్టర్ ఛైర్మన్ : శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారూ, సమయాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడండి. మిగతా ప్రశ్నలు ఉన్నాయని అర్థం చేసుకోరెందుకు, అయిపోయింది కదా, ఎన్ని ప్రశ్నలు అడుగుతారు!

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, కార్పోరేట్ హాస్పిటల్స్ మీద ఒక నియంత్రణ పెట్టాల్సిన అవసరముందని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

డా. సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, శ్రీ కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి గారు చాలా ఆవేశంగా ప్రభుత్వం ఏమి చేయడం లేదని మాట్లాడడం జరిగింది. ఆవేశంగా కాకుండా సూచనలు, సలహాలు ఇస్తే సంతోషం. కార్పోరేట్ హాస్పిటల్స్ విషయంలో ఇలా ఎప్పటి నుండి సంక్రమించిందో, ప్రజలందరికీ తెలుసు.

మిస్టర్ ఛైర్మన్ : మంత్రిగారు అడిగిన వాటికే సమాధానం ఇవ్వండి. ఉపోద్ఘాతం వద్దు.

డా. సి. లక్ష్మారెడ్డి : అధ్యక్షా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తరువాత కొంత వరకు ఆసుపత్రుల మీద మానీటరింగ్ జరిగింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌వారు ఈ మధ్యనే ఎనిమిది మంది మీద యాక్షన్ తీసుకోవడం జరిగింది. గతంలో ఎప్పుడు ఈ విధంగా వారిమీద చర్యలు తీసుకోలేదు. కార్పోరేట్ హాస్పిటల్స్, మిగతా హాస్పిటల్స్ మీద అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతోంది. కొంతవరకు అక్కడక్కడ అన్‌వాంటెడ్ సర్జరీలు జరుగుతున్న మాట వాస్తవమే. వాటిమీద నేను కూడా అనేకసార్లు స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం కూడా అన్ని చర్యలు తీసుకుంటోంది. డి.ఎమ్. అండ్ హెచ్.ఓ.కి ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. ఖచ్చితంగా వచ్చే నెల మొదటి రోజు నుంచి అన్ని ఆసుపత్రులలో జరిగే సర్జరీలను రికార్డు చేసి, మ్యాన్‌డేట్ చేస్తున్నాం. కాబట్టి ప్రతి నెలా ఏ ఏ ఆసుపత్రులలో ఎన్ని సర్జరీలు జరుగుతున్నాయో, వాటికి సంబంధించి ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చే విధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది.

అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు పూర్తిగా దెబ్బతిని నిర్లక్ష్యానికి గురి కాబడ్డాయని, ఐసియు లు కూడా అందుబాటులో లేవని గౌరవనీయులు రాజగోపాల్ రెడ్డి గారు మాట్లాడారు. వాస్తవం ఏమిటంటే, జిల్లా ఆసుపత్రుల్లో గానీ, ఏరియా ఆసుపత్రుల్లో గానీ ఎక్కడా ఐసియు లు లేవు. నేను ఒకసారి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినప్పుడు అక్కడ మొత్తం తిరిగి ఐసియు లు ఎక్కడా ఉన్నాయని అడిగితే, ఐసియులు లేవని చెప్పడం జరిగింది. ఇంత పెద్ద జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసియు లేకపోవడం చాలా దురదృష్టకరమని అప్పటికప్పుడు నిర్ణయం తీసుకొని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో ఐసియు లు ఏర్పాటు చేయాలని కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సిద్ధిపేట జిల్లాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఐసియు లు ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ బ్రహ్మాండంగా ఎమర్జెన్సీ సేవలు ఆ ప్రాంత నిరుపేదలకు అందుతున్నాయి. ఇప్పుడిప్పుడే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం ఏర్పడింది. ప్రభుత్వ ఆసుపత్రులలో 20 శాతం వరకు రోగులు పెరిగారు. జాతీయ స్థాయిలో కూడా అవార్డు ఈ మధ్యనే తీసుకోవడం జరిగింది.

అదేవిధంగా బీబీ నగర్‌లోని ఆసుపత్రి గురించి వారు మాట్లాడడం జరిగింది. ఆ ఆసుపత్రి ప్రారంభించి దాదాపు పదకొండు సంవత్సరాలు అయింది. వారి హయాంలోనే ఆసుపత్రి కట్టడానికి తొమ్మిది సంవత్సరాల సమయం పట్టింది. ఇవ్వాళ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత వాటి మీద చర్య తీసుకోవడం జరిగింది. కాంట్రాక్టర్‌ని పిలిచి మాట్లాడి, పనులను మొదలు పెట్టడం జరిగింది. ఇప్పటికే ఓ.పి సేవలను మొదలు పెట్టాము. ఇంకో రెండు నెలల్లో ఐసియు సేవలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**యాదాద్రి జిల్లా, భువనగిరి వద్ద గీత కార్మికుల శిక్షణా కేంద్రం**

ప్రశ్న నెం.1500 (40)

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్, ఎం.ఎల్.సి.:- గౌరవనీయులైన అటవీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

(అ) నల్గొండ జిల్లా, భువనగిరి మండలం, నందనం వద్ద కల్లు గీత కార్మికుల శిక్షణ కేంద్రం పనిచేస్తున్నదా?

(ఆ) చేయనట్లయితే, ఇందుకు గల కారణాలేమిటి?

గౌ. అటవీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ జోగు రామన్న):- (అ) లేదండీ.

(ఆ) 1998వ సంవత్సరం నుండి ఎటువంటి కార్యకలాపాలను చేపట్టలేదు. హరితహారం క్రింద 2016-17 సంవత్సరంలో ఈత చెట్ల పెంపకాన్ని చేపట్టడమవుతుంది. భవిష్య శిక్షణకు సంబంధించిన అంశం పరిశీలనలో ఉన్నది.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర గౌడ్ : అధ్యక్షా, ఇది ఎక్సైజ్‌శాఖకి సంబంధించిన ప్రశ్న. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా, బిసి వెల్ఫేర్ మంత్రిగారు చెబుతున్నారు కాబట్టి స్వాగతిసున్నాను. ముఖ్యంగా గీత పారిశ్రామిక ఆర్థిక సంస్థ అనేది గీత కార్మికుల వృత్తికి సంబంధించినటువంటి ఎక్సైజ్ శాఖ. మన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒక నెల ముందు, ఆనాడున్న రాష్ట్రపతి పరిపాలన సమయంలో ఈ సంస్థను బిసి శాఖలో కలపడం జరిగింది. ఆ తరువాత బిసిశాఖ నుండి ఈ సంస్థను కొత్తగా రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ నడపడం జరిగింది.

1991 సంవత్సరంలో భువనగిరి దగ్గర నందనం అనే గ్రామంలో 5 ఎకరాల భూమిని కొని సుమారు ఎనిమిదిన్నర లక్షల రూపాయలతో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి 40 లక్షలమంది గీత కార్మికులు (గౌడ్స్) కల్లుతోపాటు ఉప ఉత్పత్తులైన తాటి చెట్టుతో గానీ, ఈత చెట్టుతో గానీ, బుట్టలు అల్లడం గానీ, బ్రష్షులు గానీ, తాటిబెల్లం లాంటి ఔషధ గుణాలను ఉత్పత్తి చేయడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు 1998 సంవత్సరంలో ఈ గీత పారిశ్రామిక ఆర్థిక సంస్థను ఆపిందని గౌరవ మంత్రిగారు చెప్పారు. ఆ తరువాత ఈ సంస్థను తెరవలేదు.

నేను చెప్పేదేమిటంటే, గత ప్రభుత్వాల హయాంలో ఉక్కుపాదం పెట్టి గీత కార్మికులను అణచివేయడం జరిగింది. ఇవ్వాళ మన తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు అన్ని వర్గాల వారు బాగుపడితేనే బంగారు తెలంగాణ వస్తుందనే దృక్పథంతో ఉన్నారు. కాబట్టి ఆ గీత పారిశ్రామిక ఆర్థిక సంస్థ ఎలాంటి ఆక్రమణకు గురికాకుండా దానిని మళ్లీ తెరిచి గీత కార్మికులకు ఉపాధి కల్పించడం జరిగింది. ఈ విధంగా ఒక్క భువనగిరిలోనే కాకుండా అన్ని జిల్లాల్లో ట్రైనింగ్ క్యాంపులు ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను కొనసాగించే విధంగా ఏర్పాటు చేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జోగు రామన్న : అధ్యక్షా, గౌరవ సభ్యులు కోరినట్లు 2014 సంవత్సరంలోనే ఈ కార్పోరేషన్‌ని బిసి వెల్ఫేర్ శాఖకు అప్పజెప్పడం జరిగింది. ఈ ట్యాడీ కార్పోరేషన్ బదిలీ అయిన తరువాత గీత కార్మికులను ఆదుకోవడానికి రూ.9.00 కోట్ల సబ్సిడీ కేటాయించడం జరిగింది. దానిలో 247 మందికి ఇప్పటికే సబ్సిడీ లోన్లు కూడా ఇవ్వడం జరిగింది. అలాగే రూ.2.46 కోట్లు కూడా విడుదల చేయడం జరిగింది.

గౌరవ సభ్యులు చెప్పినట్లు, గతంలో 1997 సంవత్సరంలో శిక్షణా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. నిధులు లేనందున 1998 సంవత్సరం నుండి ఏ కార్యాకలాపాలు చేపట్టలేదు. మిషనరీ కార్పోరేషన్ ద్వారా ఇచ్చే నిధులు లేనందున శిక్షణ పొందిన వారికి వేతనాలు ఇవ్వకపోవడం వలన 1990 సంవత్సరం నుండి ప్రత్యేక నిధులు లేనందున తాటి ఉత్పత్తుల శిక్షణ మరియు ఉత్పత్తుల కేంద్రం కార్యకలాపాలు అమలులో లేవు. ఈ కార్పోరేషన్ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 క్రింద షెడ్యూల్ 9లో చేర్చబడింది. కాబట్టి ఇంత వరకు విభజన కాలేదు. విభజన నివేదిక షీలాబేడి కమిటీకి సమర్పించడం జరిగింది. ఆ కమిటీ ఆమోదం తరువాత తాటి ఉత్పత్తుల శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

## II. సభా కార్యక్రమం

### 1. ప్రత్యేక ప్రస్తావనలు

A) శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులు, తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఆంధ్ర ఉద్యోగులందరూ కూడా పరస్పరంగా వారి వారి రాష్ట్రాలకు వెళతామని వారి అభ్యర్థన పత్రాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించుకున్నారు. అందుకు ఇద్దరు చీఫ్ సెక్రటరీలు కూడా అంగీకరించారు. దానికి అనుగుణంగానే ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయుటకు ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చాయి. అవి ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయి. కాబట్టి సత్వరమే వాటిని పరిశీలించి, పరిష్కరించవలని మీ ద్వారా ఆర్థిక శాఖ మంత్రిగారిని కోరుతున్నాము.

B) శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ : జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని కూరగాయల మార్కెట్లలో పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ మార్కెట్‌లు కూడా చాలా దయనీయ స్థితిలో ఉన్నాయి. అక్కడ కూరగాయలు అమ్మే వారికి గానీ, కొనుగోలు చేయడానికి వచ్చే వినియోగదారులకు గానీ చాలా ఇబ్బందికరంగా ఉంది. అక్కడ మురికినీరు పేరుకొని ఉండడం మూలంగా వారికి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దానిమీద తక్షణమే మార్కెటింగ్ కమిటీ వారు చర్యలు తీసుకొని ఆ సమస్యను పరిష్కరించాలి. తెలంగాణ రాష్ట్రంలోని కూరగాయల మార్కెట్లను

ప్రపంచ స్థాయిలోనే నెంబర్ వన్‌గా ఉండేటట్లు తీర్చిదిద్దుతామని అంటున్నారు. ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దే విధంగా వద్దు కానీ, అప్పటి లాగే ఉండేటట్లు కొంచెం మార్పులు చేసి, బాగు చేయాలని మేము కోరుతున్నాము.

## 2. వాయిదా ప్రతిపాదన :

మిస్టర్ ఛైర్మన్ : గత రెండు సంవత్సరాల కాలంలో వ్యవసాయ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురై, పంటలకు మద్దతు ధర లభించక ప్రభుత్వం మరియు వ్యాపారుల నుండి చెల్లింపులు జరుగక, ఇన్‌పుట్ సబ్సిడీ లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం చెల్లించక పోవడం, రుణమాఫీ, పంటల మాఫీకి నోచుకోని రైతాంగం దయనీయమైన స్థితిగతులపై చర్చించుటకు శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైనది.

మిస్టర్ ఛైర్మన్: 'టీ' విరామం కొరకు సభను 15 నిమిషాలపాటు వాయిదా వేయడమైనది.

(15 నిమిషాల టీ విరామం కొరకు సభను ఉదయం 11.40 గంటలకు వాయిదా వేయడం జరిగింది.)

**12.00 మ.** (తేనీటి విరామం అనంతరం సభ మధ్యాహ్నం 12.00 గంటలకు పునఃప్రారంభమైంది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

మిస్టర్ ఛైర్మన్: 'మిషన్ కాకతీయ' అనే అంశంపై లఘు చర్చకు సంబంధించి నోట్‌ను సభకు వివరించవలసిందిగా గౌరవ మంత్రివర్యులు శ్రీ టి. హరీష్‌రావు గారిని కోరుతున్నాను.

## III. లఘు చర్చ
## మిషన్ కాకతీయ

శ్రీ టి హరీష్‌రావు: అనాది ఆధారాలైన చెరువుల పునరుద్ధరణ అనేది తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష. ఈ 60 ఏండ్ల సమైక్య పాలనలో చెరువులు నిర్లక్ష్యానికి గురి అయి ధ్వంసమైనాయి. ఉద్యమం సందర్భంగా చెరువుల పునరుద్ధరణ జరగాలని ప్రజలు కలగన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. కె. చంద్రశేఖర్ రావు గారు మిషన్ కాకతీయ పేరిట చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి అందరికీ ఎరుకే. మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినప్పుడు ప్రభుత్వానికి దీని ఫలితాలపై స్పష్టమైన అంచనాలు ఉన్నాయి.

సెప్టెంబర్ 2014 లో మొదటి సారిగా తెలంగాణలో చెరువుల గురించి సమగ్ర సర్వే జరిగింది. అన్ని జిల్లాల్లో మొత్తం చెరువుల సంఖ్య 46531 గా తేలింది. ఇందులో గొలుసుకట్టు చెరువులు సమారు 5 వేలకు పైనే ఉన్నట్టు లెక్క తేలింది.

ప్రతీ సంవత్సరం చెరువులు పునరుద్ధరణకు 20% చెరువులను ఎంపికచెయ్యాలని ప్రభుత్వం భావించింది. 12 మార్చి, 2015న నిజామాబాద్ జిల్లా సదాశివనగర్ గ్రామంలోని పాత చెరువు పునరుద్ధరణ పనులతో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు ప్రారంభించినారు.

మొదటి దశలో 8165 చెరువులకు ప్రభుత్వం రూ.2595 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 8059 చెరువుల్లో పనులను ప్రారంభించడం జరిగింది. ఈ అన్ని చెరువుల పనులు పూర్తి అయినాయి.

రెండో దశలో, 9113 చెరువులకు 3130 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. 8806 చెరువుల పనులను చేపట్టడం జరిగింది. ఇప్పటి వరకు రెండో దశలో 1536 పనులు పూర్తి అయినాయి. మిగతా చెరువుల పనులని జూన్ 2017 లోపు పూర్తి చెయ్యాలని ఆదేశించడం జరిగింది.

మూడో దశ పనులు జనవరి 2017 నుంచి ప్రారంభం కానున్నాయి. మూడో దశలో మొత్తం గొలుసు కట్టు కాలువలని పునరుద్ధరించాలని, అవకాశం ఉన్న చోట కొత్త చెరువులను నిర్మించాలని నిర్ణయించడం జరిగింది.

చెరువుల పునరుద్ధరణలో ఒక పని పూడిక తొలగింపు కార్యక్రమం. ఇది రైతుల భాగస్వామ్యంతో అద్భుతంగా జరిగింది. రెండు దశల్లో సుమారు 6 కోట్ల ట్రాక్టర్ ట్రిప్పుల పూడిక మట్టిని రైతులు తమ ఖర్చుతో తరలించుకపోయినారు. అందుకు వారు సుమారు 500 కోట్ల రూపాయలను వెచ్చించినట్లు అంచనా. 5 టి ఎం సిల నీటి నిల్వ సామర్థ్యం పెరిగింది. ఇది నిజంగా అపూర్వం. ప్రజల భాగస్వామ్యంతోనే మిషన్ కాకతీయ కొనసాగిందనడానికి ఇది ప్రబలమైన దాఖలా.

## మిషన్ కాకతీయ ఫలితాలు:

ఈ సారి చెరువుల కింద సాగు విస్తీర్ణం రెండింతలు అయ్యిందని ప్రాథమిక సమాచారం. వ్యవసాయ శాఖ చెరువుల కింద సాగు విస్తీర్ణాన్ని అంచనా వేస్తున్నది. మిషన్ కాకతీయ పనుల కారణంగా చెరువుల కింద సుమారు 5 లక్షల ఎకరాల ఆయకట్టుని స్థిరీకరించడం జరిగింది.

పూడిక మట్టి చల్లుకున్న చేను చెలకల్లో పత్తి పంట, మిరప, సోయాబీన్, వరి, కూరగాయలు, పప్పుధాన్యాలు, పండ్ల తోటలు,

పూల తోటలు మొదలైన పంటల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్టు తేలుతున్నది. పంట ఏపుగా పెరిగిందని రైతులు పేర్కొన్నారు. ఖరీఫ్‌లో పంట దిగుబడి తప్పకుండా పెరుగుతుందని అన్నారు. రసాయనిక ఎరువులు పురుగుల మందుల వాడకం కూడా తగ్గిందని వారు అన్నారు. ఇందుమూలముగా రైతులకు, రూ.3750/– ఒక హెక్టారుకు లాభము చేకూర్చడం జరుగుతుంది.

భూగర్భ జలాల వృద్ధిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని భూగర్భ జల శాఖ వారి అధ్యయనంలో తేలింది. 2016 మే నెల నుంచి సెప్టెంబరు దాకా వారి అధ్యయన ఫలితాలను క్రోడీకరించినారు. రాష్ట్రసరాసరి చూసినప్పుడు భూగర్భ జల మట్టం 8.42 మీ. పెరిగినట్టుగా తేలింది. మెదక్ జిల్లాలో అత్యధికంగా 15.17 మీ. అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 1.81 మీ. భూగర్భ జల మట్టం పెరిగినట్టుగా అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

5 వేలకు పైగా మిషన్ కాకతీయ చెరువుల్లో మత్స్య శాఖ వారి తరుపున 40 కోట్ల చేప పిల్లలని వదలడం జరిగింది. సంవత్సరకాలంలో మత్స్యకారుల చేతికి పంట అందుతుంది. మిషన్ కాకతీయ ఫలితంగా మత్స్యకార కుటుంబాలకు నిశ్చలమైన ఆదాయం సమకూరే పరిస్థితి ఏర్పడింది.

మిషన్ కాకతీయలో చెరువు కట్టలు బలోపేతం అయిన కారణంగా వరదలకు తెగిపోయిన చెరువులు, ఇతరత్రా నష్టపోయిన చెరువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వేల సంఖ్యలో నష్టానికి గురి అయ్యే చెరువులు వందల్లోకి పడిపోయినాయి. 2016లో భారీ వర్షాల వల్ల కేవలం 338 చెరువులు మాత్రమే తెగిపోయినాయి.

ప్రత్యేక డ్రైవ్ ద్వారా చెరువులని నింపినందువలన రబీలో రాష్ట్రం మొత్తంలో చెరువుల కింద సుమారు ఏడున్నర లక్షల ఎకరాల్లో సాగుకు వీలు కలుగుతున్నది. చెరువుల కింద రబీలో ఇంత పెద్ద ఎత్తున సాగు జరగడం ఇదే మొదటిసారి.

మిషన్ కాకతీయ పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో జరిగింది కనుకనే దేశ విదేశాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

“NITI - AYOG” ఉపాధ్యక్షులు అరవింద్ పనగారియా, ప్రముఖ వ్యవసాయ శాస్త్రజ్ఞులు గ్రీన్ రెవొల్యూషన్ దార్శనికుడు డా. ఎం.ఎస్. స్వామినాథన్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్ వారు, “వాటర్ మాన్ ఆఫ్ ఇండియా” గా ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన “రామన్ మెగసెసె అవార్డు గ్రహీత” శ్రీ. రాజేందర్ సింగ్ గారు, కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ఓ ఎస్ డి శ్రీ అమర్ జీత్ సింగ్ గారు, బ్రిటిష్ పార్లమెంటరీ బృందం మిషన్ కాకతీయ పనులపై, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై ప్రశంసలు కురిపించినారు.

ఇస్రో, నాబార్డ్, బిట్స్ హైదరాబాద్, ఐఐటి హైదరాబాద్, ట్రిపుల్ ఐ టి హైదరాబాద్ లాంటి విశిష్ట సంస్థలు మిషన్ కాకతీయ కార్యక్రమంలో పాల్గొని సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నాయి.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి: అధ్యక్షా, మిషన్ కాకతీయ మీద మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల వ్యవహారంలో గత పాలకులకు ముడి పెట్టారు. ఈ చెరువులు ఆక్రమణకు గురైన మాట వాస్తవం. రెండున్నర సంవత్సరాల నుండి కూడా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ కార్యక్రమం మంచి ఉద్దేశ్యం తో చేపట్టడం జరిగింది. కాబట్టి నా నెల జీతం మా ఊరి చెరువుకు ముఖ్యమంత్రిగారి సమక్షంలో ఇవ్వడం జరిగింది. సాంకేతికపరంగా కూడా ఇస్రో తో టైఅప్ అయ్యి మొదలైన విషయాలన్ని కూడా ఆహ్వానించదగిన విషయం.

రోజు నా టేబుల్ మీద వివేకానంద డైరీ ఉంటుంది. ఈ రోజు డిసెంబర్ 20th వివేకానందుడి సూక్తి ఏమిటంటే This world will always be a mixture of both good and evil of happiness and misery. This wheel will ever go up and come down , dissolution and resolution is the inevitable of law. ఎప్పుడు కూడా ఇది నడుస్తుంది. ఎక్కడున్నా తప్పు జరిగితే తప్పు అని చెబుతాము. మంచి చేస్తే మంచి అని చెబుతాము.

మిషన్ కాకతీయ మీద నిరంతర నిఘా ఉండాలి. వీటిలో రాజకీయ జోక్యాలు ఉండకూడదు. బిల్లులలో కూడా అవకతవకలు జరగకూడదు. మొత్తం చెరువులలో మొదటి ఫేజలో 46,531, రెండవ ఫేజ్‌లో 17,386 చెరువులు మరియు మూడవ ఫేజ్‌లో 9,000 పైగా చెరువులలో పనులు చేయించబోతున్నారు. నిధుల కొరత వలన 50 శాతం మాత్రమే పనులు జరిగాయి. Andhra Pradesh Re-organisation Act, సెక్షన్ 92 ప్రకారం నీతి అయోగ్ వారు మే 31న Finance Department కి రూ. 5,000 కోట్లు ఇవ్వాలని రికమెండ్ చేసారు.

అవినీతి లేకుండా చూడాలి. ఉన్న నిధులతో సక్రమంగా పనులు చేయించాలి. రాష్ట్రానికి ఏవిధంగా భరోసా ఇస్తారు? నోట్ల మార్పిడి ఉన్న ఈ క్రమంలో ఇన్ని వేల కోట్ల నిధుల సమీకరణ ఏవిధంగా జరుగుతుంది?

AIBP (Accelerated Irrigation Benefit Program) క్రింద అడగలేదు. బడ్జెట్‌లో రూ.2,484.86కోట్లకు గాను చెల్లించినది రూ.850 కోట్లు మాత్రమే పెండింగ్ బిల్లులు ఇంకా రూ. 300 కోట్లు

ఉంది. బిల్లులలో, మార్కెటింగ్‌లో రాజకీయ జోక్యం ఉండరాదు. మిషన్ కాకతీయను నీతి అయోగ్ ఉపాధ్యక్షుడు పనగారియా, శాస్త్ర వేత్త స్వామినాథన్, రామన్ మెగసెసె అవార్డ్ గ్రహీత రాజేందర్ సింగ్ తదితరులు ప్రశంసించారు. ఎలాంటి పక్షపాతం లేకుండా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవలసిన బాధ్యత ఉంది.

నర్సంపేటలోని ములుగు ప్రాంతంలో అవినీతి ఆరోపణలు వచ్చాయి. గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా దాని మీద చర్యలు తీసుకున్నారని తెలిసింది. అలాంటివి జరగకుండా చూడాలి. 33 చెరువుల దగ్గర ఉన్న ఇంజనీర్లను సస్పెండ్ చేసినట్లు నోటీసులో చూసాను. అలాగే మీ దృష్టిలోకి రాని అంశాలు చాలా ఉన్నాయి. ఖమ్మంలో కాకతీయ కాలం నాటి లకారం చెరువు కుడా ఆక్రమణకు గురైంది. మంత్రిగారు వెళ్లి చూడటం కూడా జరిగింది. FTL లిమిట్స్ దాటి ఆక్రమణకు గురైందంటే అనుకోవచ్చు. అక్కడ పెండ్లి మండపం కట్టడం జరిగింది. 30 ఎకరాల దాకా ఆక్రమణలకు గురైంది. లకారం చెరువు సమస్యతోపాటు, సిటీలోని నవాబ్‌పేట ప్రాంతంలోని చెరువు కూడా ఆక్రమణలకు గురైంది. వీటి మీద తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

వర్షాల కారణంగా కొన్ని చెరువులు నిండాయి. ఇంకా 7163 నిండని చెరువులు, దెబ్బతిన్న చెరువులు 190, లీక్ అవుతున్న మిషన్ కాకతీయ చెరువులు 33 ఉన్నాయి. నల్గొండలో 281 నిండని చెరువులు, ఆదిలాబాద్‌లో 1482, మహబూబ్‌నగర్ లో 5018, మెదక్‌లో 275, రంగారెడ్డి జిల్లాలలో 1570 నిండని చెరువులు ఉన్నాయి. మొత్తం మీద చిత్తశుద్ధితో, నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి అవకతవకలు లేకుండా సఫలీకృతం కావాలని కోరుతున్నాను.

4 రాష్ట్రాల మధ్య పంపకాలు చేయవలసిన అవసరముంది. మన రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో కూడా కేసు వేసింది. 65శాతం మనకు పరివాహక ప్రాంతం ఉంటే, ఆంధ్ర ప్రదేశ్‌కు 33 శాతం ఉంది. కృష్ణా బేసిన్‌లో మనకున్న ఆయకట్టు ఎక్కువ, పరివాహక ప్రాంతం ఎక్కువ. కానీ అన్యాయంగా 299 టీ.యం.సీలు ఇచ్చి మిగులు జలాలలో కూడా ఎగువ రాష్ట్రాలకు 270 టీ.యం.సీలు ఇచ్చినప్పుడు క్రింద రాష్ట్రాలకు వచ్చే అవకాశం లేదు. బ్రిజేష్‌కుమార్ ఇచ్చిన నివేదిక మీద అందరూ దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది. గోదావరి బేసిన్‌లో 5386, కృష్ణా బేసిన్‌లో 7836 చెరువులు నిండాయి. పరకాలలో 14 చెరువులు, వర్ధన్నపేటలో 1, ములుగులో 5 చెరువులలో డీవియేషన్స్ జరిగాయి. వీటిమీద టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, ఆకస్మిక తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

12.20 ప.

శ్రీ నారదాసు లక్ష్మణరావు: అధ్యక్షా, మొదటగా ఈ మిషన్ కాకతీయ అనే అంశంపై జరుగుతున్న లఘు చర్చలో మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అలాగే ఈ అంశంపై చర్చను చేపట్టినందుకు కూడా నేను మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మిషన్ కాకతీయ యొక్క ప్రాధాన్యత, దాని అవసరం, ఆవశ్యకత ఎంత ఉన్నదో తెలియాలంటే మన ముఖ్యమంత్రిగారి మాటలు వింటే అర్థమవుతుంది. మన దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారు ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని పేర్కొనగా, మన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారు చెరువులు తెలంగాణకు పంచప్రాణాలు అని చెప్పారంటే, చెరువుల యొక్క ప్రాధాన్యతను మనం అర్థం చేసుకోవచ్చు. అందుగురించే చెరువుల పునరుద్ధరణ పనులలో ప్రజలను భాగస్వాములను చేస్తూ, దాన్నొక పండుగలా నిర్వహించిన మిషన్ కాకతీయ రూపశిల్పి మన ముఖ్యమంత్రిగారిని, ఈ కార్యక్రమం యొక్క పనులను అంకితభావంతో నిర్వహిస్తున్న శ్రీ హరీష్‌రావుగారిని ఈ సందర్భంగా మరొకసారి అభినందిస్తున్నాను.

ఉమ్మడి రాష్ట్రంలో కవులు, కళాకారులు తెలంగాణ నీటి పరిస్థితిని, చెరువుల నిర్లక్ష్యతీరుని నిరసిస్తూ వ్రాసిన పాటలు ఎన్నో ఉన్నాయి. అందులో ఒక పాట గురించి ఇక్కడ ప్రస్తావించుకోవలసి ఉంది.

"తలాపున పారుతుంది గోదావరి,
నీ చేను, నీ చెలక ఎడారి, రైతన్నా నీ బతుకు అమాస,
ఆంధ్రబాబు చూసిండు తమాష.. "

ఇది ఆ నాటి కరువు పరిస్థితులను చూసి వ్రాసినటువంటి పాట. అటువంటి పరిస్థితుల నుండి చెరువులను రక్షించుకోవడానికి మిషన్ కాకతీయ అనే పథకం ద్వారా 46,000 చెరువులను పునరుద్ధరించుకోవడానికి రూ.40,000 కోట్లను కేటాయించుకుని, ఇప్పటికే మిషన్ కాకతీయ- 1 & 2 ద్వారా దాదాపు 15,000 చెరువులను పూర్తిచేసుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా నేను ఇక్కడ ఒక చారిత్రక అంశాన్ని కూడా గుర్తు చేయాలనుకుంటున్నాను. మానవ జాతి చరిత్ర విముక్తికోసం జరిగినటువంటి పోరాటాలన్నిటికి కారణాలు రెండు. ఒకటి, అస్తిత్వ ఆకాంక్ష రెండవది, ఆత్మగౌరవ ఆకాంక్ష. అస్తిత్వ ఆకాంక్షఅనేది మన దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దారితీయగా, రెండవది ఆత్మగౌరవ ఆకాంక్ష తెలంగాణ ఉద్యమానికి నాంది పలికింది. మనం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి, చివరికి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్‌గారి ఆమరణ నిరాహార దీక్షతో మనం తెలంగాణ రాష్ట్రాన్ని

సాధించుకోవడం జరిగింది. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకోవడానికి అనేక పథకాలు, ప్రాజెక్టులకు రూపకల్పన చేసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మన ప్రజలు భౌగోళికంగా మరియు రాజకీయంగా మాత్రమే విముక్తులు కావడం జరిగింది. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా ఇంకా బలపడవలసిన అవసరం ఉంది. ఇటువంటి పరిస్థితులలో అభివృద్ధికి మూలకారణమైన నీటిపారుదల రంగాన్ని అభివృద్ధిపరచడానికి ముఖ్యమంత్రిగారు ఒక కోటి ఎకరాలకు నీరు అందించాలనే బృహత్తర ప్రణాళికను రూపొందించారు. అందులో భాగంగా ఇదివరకే ఉన్నటువంటి ప్రాజెక్టులన్నిటికీ రీ-డిజైన్ చేసి, వాటిని ట్రూ డిజైన్ ద్వారా కోటి ఎకరాలకు నీరు అందించడానికి సంకల్పించారు. అందులో ఈ చెరువుల పునరుద్ధరణ ఒక ముఖ్యమైన అంశం.

ఈ చెరువులు అనేవి గ్రామీణ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి మూలాధారంగా ఉంటాయి. మన సంస్కృతి ఇందులో ఇమిడి ఉంది. మనం ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగకి, చెరువులకి అవినాభావ సంబంధం ఉంది. ఈ చెరువులను పునరుద్ధరించడానికి మనకు కృష్ణ, గోదావరి నదుల నుండి మనము 265 టిఎంసిల నీటిని వినియోగించుకునే హక్కు ఉండేది. మనకు తలాపున గోదావరి పారుతున్నది, కాళ్లకట్టున కృష్ణా నది ప్రవహిస్తున్నది. కాని మన పంట పొలాలకు నీరు అందని పరిస్థితి. ఆ నీటితో మన చెరువులను నింపుకునే అవకాశమూ లేదు. అసలు భారతదేశంలోనే అత్యధికంగా చెరువులు ఉన్న ప్రాంతం మన తెలంగాణ. మన తెలంగాణ దక్కన్ పీఠభూమిలో ఉండటం వలన, సముద్ర మట్టానికి మన భూములు దాదాపు 300 నుండి 600 మీటర్ల ఎత్తులో ఉండడం ద్వారా, ఎత్తున ఉన్న భూములకు నీళ్లు ఎలా వస్తాయని చెప్పి, ఎత్తును ఆధారంగా చూపి, నీళ్లు మనకు ఇవ్వడానికి నిరాకరించారుగాని, ఎత్తున ఉన్న ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీళ్లు ఇవ్వవచ్చు అని ఆ నాటి పాలకులు ఆలోచించలేదు. అందువల్ల చెరువుల విధ్వంసం జరిగింది. చెరువులను నిర్లక్ష్యం చేశారు. వాటి పునరుద్ధరణ గురించి ఆలోచించలేకపోయారు.

అయితే ఈ చెరువుల యొక్క ఆవశ్యకత కొత్తగా ఈ రోజు వచ్చింది కాదు. చెరువుల పునర్నిర్మాణం అనేది తెలంగాణ ఉద్యమం యొక్క ఆకాంక్ష. ఆ నాడు మన కెసిఆర్‌గారు ఉద్యమంలో భాగంగా గ్రామగ్రామాన పర్యటిస్తున్నప్పుడు ఈ చెరువుల పరిస్థితి గురించి మాకు వివరించి చెప్పేవారు. గంగాళంలాగా ఉండే చెరువులు తాంబాలాల మాదిరిగా మారడానికి కారణాలు కూడా వారు మాకు చెప్పారు. చెరువుల పునరుద్ధరణ అంటే మన సంస్కృతిని అభివృద్ధి చేసుకోవడమే. చెరువులు నీటితో నిండితే పంటలు బాగా పండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారు. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే చెరువుల పునరుద్ధరణ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఇది ఏదో ఆషామాషీ కార్యక్రమం కాదు. ఎంతో మేధోమథనం జరిగిన తరువాత రూపుదిద్దుకున్న కార్యక్రమం ఇది. అనేక మంది నిపుణులతో చర్చించిన తరువాత ఈ మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని చేపట్టటం జరిగింది. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం జరుగుతున్న సందర్భంలో నేను గౌరవ మంత్రి శ్రీ టి.హరీష్‌రావు గారి వెంట అనేక ప్రాంతాలకు వెళ్లడం జరిగింది. దేశరాజుపల్లి గ్రామంలో ఊరచెరువు, అదే విధంగా జగిత్యాల జిల్లాలో రాయికల్లు గ్రామం, పెద్దపల్లి జిల్లా, ఓదెల గ్రామంలో నల్లచెరువు, అదే విధంగా కరీంనగర్ జిల్లాలో దమ్మక్కచెరువు ఈ రకంగా చెరువుల పునర్నిర్మాణ కార్యక్రమంలో నేను పాల్గొన్నప్పుడు ప్రజలందరూ ఎంతో ఉత్సాహంగా, ఒక పండగలాగా, ఒక జాతరలాగా అక్కడ వాతావరణం నాకు కనిపించింది. అక్కడ విందులు, వినోదాలు, సంబరాలు జరుపుకున్నారు. ప్రజల నుండి వచ్చిన స్పందన చూసినట్లయితే ఈ కార్యక్రమం ఎంత వినూత్నమైనదో మనకు అర్థమవుతుంది.

ఆ నాడు కాకతీయులు, రెడ్డిరాజులు చెరువుల యొక్క ప్రాధాన్యతను గుర్తించి, వాటిని అభివృద్ధి పరిచి, వ్యవసాయ రంగానికి జీవం పోశారు. తద్వారా వాళ్ల రాజ్యాలు అభివృద్ధి కావడమే కాదు, గొప్పగొప్ప కట్టడాలను కూడా నిర్మించారు. అందుకే ఒక ప్రభుత్వంగాని, ఒక రాజ్యంగాని అభివృద్ధి చెందాలంటే చెరువులు కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. చెరువుల ద్వారా వ్యవసాయం, వ్యవసాయం ద్వారా ఆదాయం, ఆదాయం ద్వారా అభివృద్ధి అనేది ఈ నాడు కాదు ఆ కాలంలోనే నిరూపించబడింది. ఆ నాడు పాకాల, రామప్ప, లక్నవరము, ఘనపురము, బయ్యారం వంటి చెరువులన్నీ కూడా ఆ కాలంలో రాజులు మంచి టెక్నాలజీతో నిర్మించగా, ఆ తరువాత శాతవాహనులు, నిజాంపాలకులు, తరువాత నేడు మన తెలంగాణ ప్రభుత్వము చెరువుల నిర్మాణానికి పూనుకుని, తెలంగాణ ఆర్థికవ్యవస్థను పరిపుష్టం చేస్తున్న సందర్భంలో మిషన్ కాకతీయ రూపశిల్పి అయిన గౌరవ ముఖ్యమంత్రిగారిని, ఆ కార్యక్రమాన్ని గొప్పగా ముందుకు తీసుకువెళుతున్న శ్రీ టి.హరీష్‌రావుగారిని నేను మరొక్కసారి మనస్ఫూర్తిగా అభినందిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

12.40 మ. శ్రీ యన్. రామచంద్రరావు: అధ్యక్షా, మిషన్ కాకతీయ అంశంపై షార్ట్ డిస్కషన్‌లో మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ మిషన్ కాకతీయ అన్నది ప్రభుత్వం యొక్క ఫ్లాగ్‌షిప్ పథకం. తెలంగాణానికి అవసరమైన పథకం కూడా. మనందరికీ తెలుసు, తెలంగాణాకి ఉన్నటువంటి భౌగోళికక పరిస్థితుల్లో గ్రౌండ్ వాటర్ అన్నది ఒక సమస్యగా మిగిలిపోయింది. మన రైతులు బోర్‌వెల్స్ మీద పూర్తిగా ఆధారపడుతున్నందున తెలంగాణాలో గ్రౌండ్‌వాటర్ లెవెల్ కూడా బాగా తగ్గిపోతాయి. వానలు పడినా చెరువుల్లో నీరు నిలవకపోవడం వల్ల గ్రౌండ్ వాటర్ తగ్గిపోతుంది. రివర్స్ నుంచి ఫ్లో రాక ఈ చెరువులన్నీ కూడా దాదాపు ఎండిపోయే పరిస్థితుల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఈ పథకాన్ని చేపట్టింది. దాన్ని తప్పకుండా స్వాగతించాలి. దీని వల్ల తప్పకుండా రైతులకు మంచి జరుగుతుంది.

మైనర్ ఇరిగేషన్ ద్వారా దాదాపు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు దొరుకుతుందని అందరూ భావిస్తున్నారు. అయితే మొదటి సంవత్సరం వానలు తక్కువ పడడం వల్ల కొన్ని చెరువుల్లో అసలు నీరు లేకపోవడం, తర్వాత రెండో సంవత్సరం అంటే 2016లో మంచి వానలు పడ్డాయి కాబట్టి కొన్ని ట్యాంకులు నిండడం జరిగింది. దాని ఫలితంగా గ్రౌండ్ వాటర్ పెరిగినట్లుగా కనబడుతోంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ మిషన్ కాకతీయను అమలు చేస్తున్నపుడు ఆలోచించవలసిందేమంటే , ఏవైతే రివులెట్స్ ఫ్లో అయి ట్యాంకుల్లోకి పోతాయో వాటిని రిపేర్ చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే వాన పడినప్పుడు వాటర్ వేస్ట్ గాకుండా ఆ ట్యాంక్స్‌కి వచ్చేలా, అదే విధంగా వాటికి ఉండే ఫీడర్ మిషన్స్‌ని కూడా రిపేర్ చేస్తే తప్ప మిషన్ కాకతీయ పూర్తి లక్ష్యం సిద్ధించదని భావిస్తున్నాను. ట్యాంకులు నిండిన తర్వాత ఫీడర్ మిషన్ లేకపోతే ఆ వాటర్ ముందుకుపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి వాటిని కూడా రిపేర్ చేస్తారా? ఆ అంశాలు ఇందులో కలిసి ఉన్నాయా? దయచేసి క్లారిఫై చేస్తే బాగుంటుందని మంత్రిగారిని కోరుతున్నాను.

హైడ్రాలజీ ఆఫ్ ది సాయిల్‌పై ఎంతవరకు సైంటిఫిక్ స్టడీ చేశారు? అదే గాకుండా, హైడ్రాలజీ ఆఫ్ దట్ ఏరియా అంటే ... ఎక్కడి నుంచి వాటర్ వస్తోంది, వాటర్ కంటెంట్ భూమిలో ఎంత ఉంది, ఎంతవరకు రైతులకు లాభం జరగవచ్చనే హైడ్రాలజీ అసెస్‌మెంటు కూడా జరగవలసిన అవసరం ఉంది. అది జరిగితే ఎంత ఖర్చు పెట్టామో అంత మేరకు ఫలితాలు వచ్చాయా లేదా, రైతులు లబ్ధి పొందారా అన్నది తెలుస్తుంది. డీసిల్టింగ్‌కి ఎంత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారో అంతే ప్రాధాన్యత ఫీడర్ మిషన్ల రిపేర్లకు కూడా ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. పూడిక తీయడం వల్ల తప్పకుండా ట్యాంక్ కెపాసిటీ పెరుగుతుంది. కానీ ఈ ఇరిగేషన్ సిస్టంలో గ్రామ స్థాయిలో ఎంత వరకు లాభం పొందారు Whether it can change the entire irrigation system in that particular village or in that particular area అన్నది చూడవలసిన అవసరం ఉంది.

మిషన్ కాకతీయకి సంబంధించి కొన్ని సైంటిఫిక్ స్టడీస్ జరిగి రిపోర్టులు రావడం జరిగింది. One of the Scientific Reports says - "Mission Kakatiya can be construed as an adjunct to the construction of our irrigation projects. Unless these projects are constructed and water is fed to these tanks, they can never regain their old glory. The tanks without feeder possibility now or in near future, most of them may not get the benefit of repairs. There is no need to have misgiving on the project, but to make it more meaningful, a technical and economic feasibility study before attempting the repairs to each tank beds on these aspects and some other relevant things appears to be necessary."

There is another report from Resources and Analysis Scientific study which says -

"Mission Kakatiya is an ambitious project launched by the Government of Telangana to rejunivate 47000 tanks in the State by 2020." Then the article argued that – "It would be repetition of the old historical mistake to approach the issue without taking into consideration the hydrological and ecological aspects. Picking up only these tanks which have water generated in this catchment would save lot of precious money."

As a mater of fact, none of these interventions can alter the hydrology of the tank catchment. Unfortunately, such projects pass through the scrutiny of economists and planners with myriads of exaggerate benefits such as direct irrigation, ground water recharge, nutrient rich silt as fertilizers, fish productions. One only wonders, how the estimates of irrigations potential are arrived at which, one does not really know, how much inflows these tanks receive. ఈ

ట్యాంక్స్‌లోకి వచ్చేది కేవలం వాన నీరు మాత్రమేనా లేక వాగులు ఇతర సోర్సెస్ ఏమైనా ఉన్నాయా? కేవలం వానల మీద ఆధారపడకుండా ఇతర సోర్సెస్ మీద ఆధారపడవలసిన అవసరం ఉందని ఒక స్టడీ చెబుతోంది. ఇంతకు ముందు పెద్దలు రజ్వీగారు, సుధాకర్ రెడ్డి గారు అర్బన్ ఏరియాస్‌లో ఉండే చెరువుల గురించి మాట్లాడారు. అర్బన్ ఏరియాస్‌లో ఉన్న అనేక చెరువులు కబ్జాకి గురయ్యాయి, వాటి మీద అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. మొన్న వానలకు హైదరాబాదులోని అల్వాల్, యాప్రాల్ ప్రాంతంలో చెరువు నీళ్లు ఏవిధంగా ఫ్లాట్లలోకి, సెల్లార్లలోకి వచ్చాయో చూశాం. కొన్ని ప్రాంతాలలో మంచిగా చేశారు. అర్బన్ ఏరియాస్‌లో కబ్జాకి గురైన చెరువుల విషయంపై దృష్టి సారించాలి. మిషన్ కాకతీయ క్రింద చెరువుల పునరుద్ధరణ చేపట్టడం వల్ల అటు మత్స్యకారులకు, ఇటు వ్యవసాయానికి చాలా మంచి జరుగుతోంది. కొన్ని చెరువులు బ్రహ్మాండంగా ఉన్నాయి, వాటిల్లోకి effluents చేరకుండా చర్యలు తీసుకోవాలి. మంచి చెరువులున్నాయి, ప్రజలకు కూడా వాటి పట్ల ఒక అవగాహన వచ్చింది. అర్బన్ ఏరియాస్‌లో మిషన్ కాకతీయ క్రింద ఐడెంటిఫై చేసిన చెరువులను టూరిజానికి లింకప్ చేసే విషయంపై శ్రద్ధ పెడితే బాగుంటుంది. మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణ రైతుల నీటి సమస్యను కొంత తీర్చవచ్చును. అయితే దానికి సంబంధించి ప్రజలకున్న కొన్ని అనుమానాలను ప్రభుత్వం క్లియర్ చేయవలసిన అవసరం ఉందని భావిస్తూ, ఈ మిషన్ కాకతీయ వల్ల తెలంగాణ రైతులకు మంచి జరుగుతుందని తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మరొకసారి మీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

శ్రీ పూల రవీందర్: అధ్యక్షా, మిషన్ కాకతీయపై మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు. ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో చెరువులన్నీ జలకళతో నిండి ఉండడానికి ప్రధాన కారణం – నాటి ఉద్యమ నాయకుడు, నేటి ముఖ్యమంత్రి, గౌరవనీయులు కె. చంద్రశేఖర్‌రావు గారు ఉద్యమ కాలంలో అన్ని ప్రాంతాలను తిరుగుతూ, తెలంగాణ ప్రజలు పూర్తిగా వర్షాధార సాగు మీదే ఆధారపడ్డారనే విషయాన్ని గ్రహించి, అడుగంటుకుపోయిన భూగర్భ జలాలను పెంచి వాటిని కాపాడవలసిన బాధ్యత, రక్షించవలసిన బాధ్యత ఉందని ఆనాడే గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచించడం జరిగింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెన్వెంటనే ఈ మైనర్ ఇరిగేషన్‌లో భాగంగా ఈ చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఎప్పుడో కాకతీయుల కాలం నాడు, ఆ తర్వాత కులీకుతుబ్‌షాహీలు గానీ, నిజాం నవాబులు గానీ, శాతవాహనుల దగ్గరి నుంచి తీసుకుంటే సుమారు 45531 చెరువులను మన తెలంగాణ ప్రాంతంలో నిర్మాణం చేసుకోవడం జరిగింది. తెలంగాణ మెట్టప్రాంతం, ఈ ప్రాంతానికి నదీ జలాలు అందుబాటులోకి రావనే ఆలోచన ఆనాటి రాజుల కాలంలోనే చేశారు. గత పాలకులు అవకాశం ఉన్నటువంటి నదీ జలాలను కూడా అందుబాటులో లేకుండా చేశారు.

(గౌరవ డెప్యూటీ ఛైర్మన్ శ్రీ నేతి విద్యాసాగర్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని, ఏవిధంగానైతే తెలంగాణ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి, రాష్ట్ర సాధన కొరకు పోరాటం చేసిన ముఖ్యమంత్రిగారు ఈ మిషన్ కాకతీయను కూడా ఒక ప్రజా ఉద్యమంగా మలచి చెరువుల పునరుద్ధరణను చేపట్టడం జరిగింది. పురాతన కాలంలో ఒక రాజు మరొక శత్రురాజు చేతిలో ఓడిపోతే – మా కోటలు ధ్వంసం చేయండి, మా ఆస్తులు దోచుకోండి కానీ ప్రజల జీవనాధారమైన చెరువులను మాత్రం ధ్వంసం చేయవద్దని కోరుతూ ఆనాటి రాజుల కాలం నుండీ కాపాడుకుంటూ వస్తున్న చెరువులు... ఎప్పుడైతే సమైక్యాంధ్ర ఏర్పడిందో ఆనాటి నుంచి 60 సంవత్సరాల కాలంలో ఇవి పూర్తిగా నిరాదరణకి గురైన పరిస్థితిని మనం చూస్తున్నాం. వీటన్నింటినీ గ్రహించిన తర్వాత ముఖ్యమంత్రిగారు, ఒక మంచి నాయకత్వ పటిమ గల, శ్రమించే గుణం కల హరీష్‌రావు గారికి ఈ బాధ్యతలను అప్పజెప్పడం జరిగింది. వారు ఒకవైపు ప్రజలను, మరొకవైపు ప్రజా ప్రతినిధులను ఇందులో భాగస్వాములను చేసి ఈ చెరువుల పునరుద్ధరణని ప్రారంభించడం జరిగింది.

అధ్యక్షా, ఫేజు –1లో తీసుకొన్న 8059 చెరువులను పూర్తి చేయడం జరిగింది. సుమారు రూ.2559కోట్లతో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తీసుకొని 8059 చెరువులను మొదటి ఫేజులో మొదటి సంవత్సరంలో పూర్తి చేయడం జరిగింది. అంటే ఈ ప్రభుత్వం, ఈ ముఖ్యమంత్రిగారు, ఈ మంత్రిగారు ఎంత చిత్తశుద్ధితో పని చేస్తున్నారో చెప్పడానికి ఇదొక నిదర్శనం. రెండో ఫేజులో 8006 చెరువులు తీసుకుంటే 1536 చెరువులు పూర్తయ్యాయి. నిజానికి ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు పడుతున్న కష్టాన్ని వర్షం రూపంలో భగవంతుడు కరుణించాడు. గతంలో చెరువులన్నీ పూడిపోయాయి, పూడిక తీసే పరిస్థితి లేదు. కానీ ఇప్పటి వరకు పది వేల చెరువులను పూర్తి చేసుకున్నాం కాబట్టి ఇదే పద్ధతిలో మిగిలిన చెరువులను పూర్తి చేసుకోవాలనే సత్ సంకల్పంతో ఈ ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రిగారు ముందుకు పోతున్నారు. అధ్యక్షా, గతంలో ఏప్రిల్, మే, జూన్ మాసాలలో యంపీలు, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ ఎ.సి. లలో ఉండేవారు.

కానీ ఈ రెండు సంవత్సరాలలో ప్రజా ప్రతినిధులందరూ సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి వరకు చెరువుల పూడిక తీసే కార్యక్రమంలో ఉన్నారు. అంటే ఈ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో పని చేస్తోందో చెప్పడానికి ఏప్రిల్, మే నెలల్లో చెరువుల పూడిక తీసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజల యొక్క భాగస్వామ్యమే నిదర్శనం. ఈవిధంగా పని చేసుకుంటూ చెరువులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళుతోంది.

గతంలో ఎక్కడా కూడా మత్స్యకారులకు చెరువుల్లో నీరుండేది కాదు, నీరుంటే చేపలు పెంచుకొనే అవకాశం ఉండేది కాదు. కానీ ఈరోజు రూ.104కోట్లతో చెరువుల్లో చేపలను పెంచడానికి చేప పిల్లలను పంపిణీ చేసి, మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునే కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ప్రాంతంలో మరీ ముఖ్యంగా నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్య తీవ్రంగా ఉంది. ఫ్లోరైడ్ ప్రాంతంగా పేరొందిన నల్గొండ జిల్లాలో అటు పంటలు పండక, తాగునీరు లేక, చేతులు కాళ్లు వంకరపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. చెరువులు పూడిక తీసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా గ్రౌండ్ వాటర్ సరాసరి 8.42మీటర్లు పెరిగింది. వర్షాల వల్ల వచ్చిన నీరు కూడా పల్లానికి పోయి మళ్లీ కృష్ణానదిలోకి పోతోంది, ఆంధ్రా ప్రాంతానికి పోతోంది. ప్రభుత్వం ముందు చూపుతో ఉంది కాబట్టి ఆవిధంగా జరగకుండా నీటిని కాపాడింది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల ఒకవైపు మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడం, అదే విధంగా బోరు బావుల్లో నీరు రావడం జరిగింది. తెలంగాణ రైతాంగం పూర్తిగా బోరుబావుల మీదే ఆధారపడి బతుకుతోంది. మిషన్ కాకతీయ కార్యక్రమం వల్ల బోరు బావుల్లో నీటి మట్టం పెరిగి, తొమ్మిది గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తున్నందున, పంటలు బాగా పండుతున్నాయి. బోరు బావుల క్రింద రైతులు చక్కగా సాగు చేస్తున్నారు. కూరగాయలు వేసుకుంటున్నారు, పండ్ల తోటలు పెంచుతున్నారు, తెలంగాణ రైతాంగం, ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. ఇవన్నీ చెరువులతోటే ముడిపడి ఉన్నాయి. రాజుల కాలంలో 15 లక్షల నుంచి 16లక్షల ఎకరాల భూమి కేవలం చెరువుల క్రింద సాగయ్యే పరిస్థితులున్నాయి కాబట్టి వీటిని త్రవ్వారు. కానీ సీమాంధ్ర ప్రాంత ముఖ్యమంత్రులు వచ్చిన తర్వాత అది 2లక్షల ఎకరాలకు పడిపోయింది. ఈరోజు రబీలో 7.5 లక్షల ఎకరాలు సాగు అవుతోందంటే.. దానికి మన గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ మంత్రిగార్ల పట్టుదల, కృషే ప్రధాన కారణం. ఈవిధంగా చేసుకోవడం వల్ల తెలంగాణ ప్రాంతంలో సాగునీరు, తాగునీరు చాలా చక్కగా లభ్యమవుతోంది. గత పాలకుల హయాంలో చివరికి హైదరాబాదు నగరంలో ఉన్న చెరువులు కూడా అన్యాక్రాంతం అయ్యాయి. నేడు బౌండరీస్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఉన్న చెరువులను కాపాడుకునే అవకాశం వచ్చింది. హైదరాబాదు నగరంలో బోర్లు వెయ్యి, రెండు వేల ఫీట్ల వరకు వేస్తున్నారు. నేను ఈ సందర్భంగా కోరుతున్నదేమంటే – కృష్ణా, గోదావరి నదీ జలాలతో హైదరాబాదు నగరంలో ఉన్న చెరువులను కూడా పూర్తిగా నింపినట్లయితే గ్రౌండ్ వాటర్ టేబుల్ పెరిగి ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి, ఆమేరకు చర్యలు తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

1.00 మ. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఏరోజు ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్షపార్టీల నుండి ముక్త కంఠంతో ప్రశంసలు అందుకున్న దాఖలాలు లేవు. కానీ, ఈరోజు మనం చూస్తే పెద్దలు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు కానివ్వండి, రజ్వీ గారు కానివ్వండి, రామచందర్ రావు గారు దగ్గర నుండి మిషన్ కాకతీయ ఒక మంచి కార్యక్రమమనే ప్రశంసలు ప్రభుత్వం అందుకుందంటే, ఇంతకంటే మిషన్ కాకతీయ కార్యక్రమం బాగా జరుగుతుందని అనడానికి వేరే నిదర్శనం లేదని తమరి ద్వారా తెలియజేస్తూ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి : అధ్యక్షా, మిషన్ కాకతీయ ప్రోగ్రాం మంచి కార్యక్రమం. గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు మంత్రి వర్యులు శ్రీ హరీష్‌రావు గారు ఒక మంచి ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. మన చరిత్ర చూసుకుంటే పురాతన కాలం నుండి కూడా ప్రతి గ్రామంలో చెరువో, కుంటో ఉంటుండేది. ఎందుకంటే ఏది ఉన్నా, లేకున్నా ఊర్లో నీరు ఉంటే, మనుష్యులకే కాకుండా పశువులు, పక్షులతో, పచ్చదనంతో ఊరు కళకలాడుతుంటుంది. అలా పచ్చదనంతో ఉండాలనే ఉద్దేశంతోటి పడిన వర్షపాతం మొత్తాన్ని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెరిగేందుకు ఆనాడు ఎంతోమంది ప్రయత్నం చేశారు.

కానీ, ఈరోజు ఈ ప్రభుత్వం ఒక కార్యక్రమం చేపట్టి, దానికి మిషన్ కాకతీయ అనే ఒక మంచి పేరు పెట్టి ఈరోజు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం అనేది చాలా అభినందనీయం. చెరువుల పూడిక తీయడాన్ని, ఆనకట్టలకు మరమ్మత్తు ప్రక్రియ చేపట్టడాన్ని నేను అభినందిస్తున్నాను. మొదటి ఫేజ్‌లో ఎన్ని చెరువులు పూడిక తీయడం జరిగింది, రెండవ విడతలో ఎన్ని చెరువులు చేపట్టడం జరిగిందనే వివరాలు నా దగ్గర కూడా ఉన్నాయి. అయితే, రెండవ దఫాలో చేపట్టిన వాటిల్లో 50శాతం పనులు ఇంకా పూర్తి కానట్లుగా మాదగ్గర ఉన్న సమాచారం. గ్రామాల్లోని నాయకులో, ఆ ఊరి సర్పంచ్ గారో మా గ్రామాల్లోని

చెరువు పనులు మేము చేపట్టాలనే ఒక ప్రెస్టేజీతో వారు ఆ గ్రామాల్లోని చెరువు పనులను దక్కించుకునే వారు. అందులో భాగంగా వారు పోటీపడి ఆయా పనులకు ఎంతో తక్కువకు కోట్ చేయడం జరిగింది. నిజంగా కూడా ఆ పనిని కరెక్ట్‌గా నార్మ్స్ ప్రకారం క్వాలిటీతో పని చేస్తే ఆ పని గిట్టుబాటు కాదు. ఆ విషయం ఆ పని దక్కించుకున్న కాంట్రాక్టరుకు తెలుసు, డిపార్టుమెంట్ వారికి కూడా తెలుసు. అలాగే దానికి బ్యాంకు గ్యారంటీ కూడా ఇవ్వాలి. ఒకవైపేమో దక్కించుకున్న పనిమీద పెట్టుబడి పెట్టాలి మరోవైపు బ్యాంకు గ్యారంటీ ఇవ్వడానికి మార్జిన్ మనీ కట్టాలి. పెట్టుబడి పెట్టిన డబ్బులకి వెంటనే పేమెంట్ వస్తుందా అని అంటే ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వానికి నా విన్నపం ఏమంటే, ప్రభుత్వం ఇంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమానికి పని పూర్తి అయిన వెంటనే ఎప్పటికప్పుడు రికార్డు చేసి పేమెంట్ చేసినట్లయితే ప్రభుత్వం అనుకున్న ఫలితాలు పొందగలుగుతుంది.

ఆరు నెలల నుండి పేమెంట్ రాలేదని ఒక కాంట్రాక్టరు చెబుతున్నాడు. రూ.75లక్షలు పెట్టుబడి పెట్టాను ఇంతవరకు పేమెంట్స్ చేయలేదని మరో కాంట్రాక్టరు చెబుతాడు. ఇలా నాకు తెలిసిన వందల మంది కాంట్రాక్టర్లు నాకు చెప్పడం జరిగింది. ఇలా న్యాయంగా కష్టపడి పని చేసిన వారి పరిస్థితి ఇది.

అలాగే, కొందరేమో పనిచేయకున్నప్పటికీ ఆ కుంటల్లోనో, చెరువుల్లోనో ఉండే మట్టిని ఇటుక బట్టీల కొరకు టిప్పర్‌లోనో, ట్రాక్టర్లలోనో తీసుకుపోయి తట్టెడు మట్టి తీయకుండా వారే ఆ కుంటల్లో, చెరువుల్లోని మట్టిని తీసినట్లుగా చెప్పి బిల్ రికార్డు చేశారు. ఉదాహరణకు, చౌటుప్పల్ మండలంలోని పెద్దకొండూరు గ్రామంలో ఒక్క రూపాయి పని చేయకుండా దాదాపు 75శాతం పేమెంట్స్ తీసేసుకున్నారు. ఆ ఇటుక బట్టీల కొరకు త్రవ్విన బొందల్ని మిషన్ కాకతీయ క్రింద పని చేసినట్లుగా చూపించి బిల్ రికార్డు చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుండి కూడా most corrupted department ఏదని అంటే, Minor Irrigation Department అనే అంటారు. నాకున్న తొమ్మిది సంవత్సరాల రాజకీయ జీవితంలో చూస్తున్నాను. ఒక్క పని చేయించాలంటే కూడా తల ప్రాణం తోకకు వచ్చేది. వారికి డబ్బులు చెల్లించనిదే, బిల్ రికార్డు చేయరు. మామూలుగా పర్సంటేజి మాట్లాడుకొని, చేయని పనికి మాత్రం వారు అగ్రిమెంట్స్ చేస్తారు, బిల్స్ రికార్డు చేస్తారు.

వ్యవసాయం అనేది వర్షాలు పడిన నీటితో చేస్తేనే గిట్టుబాటు అవుతుంది. కానీ, ఈ లిఫ్టు ఇరిగేషన్ ద్వారా, సొరంగాల ద్వారా నీటిని తీసుకొని వ్యవసాయం చేస్తే మనకు ఎకరానికి ఖర్చు ఎంత అవుతుంది? ఆ ఎకరానికి రెండు పంటలమీద ఎంత దిగుబడి వస్తుందనేది ఆలోచిస్తే మాత్రం ఈ లిఫ్టు ఇరిగేషన్ స్కీంలు ద్వారా చేస్తే మనకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ఈ మిషన్ కాకతీయ కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమం ఇంకా విజయవంతం కావాలంటే ఈ శాఖలో నిజాయితీ గల అధికారులని జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

అదే అధికారులతో ప్రభుత్వం ఎన్ని పనులు చేపట్టింది, ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఎంతమంది టెండర్స్ లెస్‌కి కోట్ చేశారు. బిల్లులు ఎంతమందికి సరైన సమయంలో చెల్లిస్తున్నామనేది సరిగ్గా పర్యవేక్షించేలా చూడాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

గొలుసుకట్టు చెరువులను మొదటి ఫేజ్‌లో పెట్టి ఉంటే బాగుండేదని నా అభిప్రాయం. ఎందుకంటే, ఉదాహరణకు చౌటుప్పల్ మండలంలో మల్కాపురం చెరువు నిండితే కైతపురం, లక్కారం, చౌటుప్పల్, పంతంగి చెరువులన్నీ నిండి ఉండేవి. ఇవన్నీ కూడా గొలుసుకట్టు చెరువులు. మొదటి ఫేజ్‌లో మల్కాపురం పూర్తి చేశారు. అది పూర్తిగా నీటితో నిండిపోయింది. మధ్యలో కైతపురం, లక్కారం చేయలేదు. చివరిలో ఉన్న పంతంగి చెరువును తీసుకున్నారు. మధ్యలో గ్యాప్ రావడం వల్ల పర్‌పస్ సాల్వ్ కావడం లేదు. మిషన్ కాకతీయ క్రింద తీసుకున్న దాదాపు నలభై ఏడు వేల చెరువుల్లో పెద్ద చెరువులు దాదాపు 5వేల చెరువులున్నాయి. వాటిని మొదటి ఫేజ్‌లో పెట్టి ఉంటే బాగుండేదని నా అభిప్రాయం.

అధ్యక్షా, బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా క్షేత్ర స్థాయిలో నీవు కాంగ్రెస్ పార్టీ కండువ కప్పుకున్నావు, మాపార్టీ కండువ కప్పుకుంటే బిల్లులు ఇప్పిస్తామనే రక, రకాలు వేదింపులు జరుగుతున్నాయి. నేనేదో ఆరోపించాలని కాదు గానీ, ఇది నిజంగా గ్రౌండ్ రియాలిటీ. అధికారులని ఆ ప్రాంత రూలింగ్ పార్టీకి సంబంధించిన నాయకులు బెదిరించి ఇతర పార్టీలకు సంబంధించిన వారు ఎవరు పని చేసినా వారిని పని చేయనివ్వడం లేదు, వారికి బిల్లులు రానివ్వడం లేదు. ఇటువంటి పక్షపాతం ఎక్కడా కూడా చూపించకుండా, ఎవరైతే నిజంగా పని చేస్తున్నారో వారికి పార్టీలకు అతీతంగా పేమెంట్స్ చేయాలని వారికి డిపార్టుమెంట్ అధికారులు సహకరించే విధంగా గౌరవ మంత్రివర్యులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ బలసాని లక్ష్మీ నారాయణ : అధ్యక్షా, ప్రధానంగా మన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ఆనాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు ఉద్యమ సందర్భంగా గ్రామాల్లో పర్యటించిన రోజుల్లోనే తెలంగాణ రైతాంగానికి కోటి ఎకరాలు పండించుకోడానికి నీరందించాలని నిర్ణయించుకోవడం జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాకా ఆయన మంత్రివర్గం కూర్పు చేసే సందర్భంలోనే ఏ లక్ష్యమైతే మనం నిర్ణయించుకున్నామో ఆ లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆలోచనతో దానికి సమర్థులైన నాయకుడు కావాలని, పట్టుదల ఉన్నటువంటి, పని అప్పజెపితే విజయం సాధించి తీసుకువచ్చేటువంటి వ్యక్తి కావాలనే సుధీర్ఘమైన ఆలోచనతోనే మొదటి అడుగులోనే గౌరవ నీయులైన శ్రీ హరీష్ రావు గారిని సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఎప్పుడైతే ఎన్నిక చేసుకున్నారో ఆరోజే తెలంగాణ రైతంగానికి కోటి ఎకరాలకు నీరు అందుతుందనే ఒక ఖచ్చితమైన విశ్వాసం రైతుల్లో నింపారని సభ ద్వారా తెలియజేస్తున్నాను.

హైదరాబాద్ రాష్ట్రం ఉన్నప్పుడు 16వేల చెరువులు ఉన్నట్లుగా మనకు చరిత్ర చెబుతోంది. కానీ, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తెలంగాణలో దాదాపు 45వేల చెరువులున్నట్లుగా గుర్తించడం జరిగింది. దీనిలో ప్రధానంగా కాకతీయుల కాలంలో నిర్మించిన లక్నవరం గానీ, పాకాల గానీ, గణపవరం గానీ, రామప్ప గానీ అలాగే ఖమ్మం జిల్లాలో చూసుకుంటే బయ్యారం చెరువు ఇవన్నీ కూడా పెద్ద గొలుసుకట్టు చెరువులు. ఎప్పుడో కాకతీయులు నిర్మించినటువంటి చెరువులు ఈరోజుకి కూడా బ్రహ్మాండంగా ఉన్నాయి. వాటిని ఆదర్శంగా తీసుకొనే ఈరోజు కాకతీయ మిషన్‌లో మొదటి ధపాలో గానీ, రెండవ ధపాలో గానీ ఎనిమిది వేల చెరువులని పూర్తి చేయడం జరిగింది.

చెరువుల పూడిక కాంట్రాక్టుకి తీసుకుంటే మట్టి పూడిక తీయకున్నా కూడా డబ్బులు వస్తాయనే ఆలోచనతో ఒక్కొక్కరు 20, 30శాతనికి కూడా టెండర్స్ లెస్‌కి వేసిన సందర్భాలున్నాయి. అందులో ఎక్కువ మంది మనవాళ్లు వేసిన సందర్భాలే ఉన్నాయి. ఎందుకంటే, గతంలో ఒక అలవాటు ఉంది. మే నెలలో టెండర్లు పిలిచి, జూన్‌లో పనులు మొదలు పెట్టేవారు, జూలైలో బిల్లులు తీసుకునే వారు. ప్రతి చెరువుకు నెల, రెండు నెలల్లో పైన మట్టి పోసి అటూ, ఇటూ జరిపి ఐదు లక్షలు, పది లక్షలు పొందేవారు. అటువంటి పరిస్థితుల్లో మిషన్ కాకతీయ క్రింద రెండువేల కోట్ల రూపాయలు కేటాయించారు కాబట్టి, అదే పరిస్థితుల్లో మనం సాధించుకున్న తెలంగాణ కాబట్టి, మనం ఎలా పూడిక తీసినా కాడా బిల్లులు పొందవచ్చనే ఉద్దేశ్యంతోని అనుభవం లేనటువంటి చిన్న, చిన్న కార్యకర్తలు కూడా ఈ చెరువుల పూడిక టెండర్‌లల్లో పాల్గొన్న పరిస్థితి ఉన్నది.

కానీ, గౌరవ ముఖ్యమంత్రి, మంత్రి వర్యులు తీసుకున్న నిర్ణయాల వల్ల చాలా మంది నష్టపోయారు. ఇందులో గౌరవ సభ్యులు రాజగోపాల్ రెడ్డి గారు మాట్లాడిన దానితో నేను ఏకీభవిస్తున్నాను. ఎందుకంటే పనులు జరిగిన విధానంలో థర్డ్ పార్టీతో ఎంక్వైరీ చేయించడం గానీ, ప్రభుత్వ పరంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల అలాగే ప్రజల యొక్క భాగస్వామ్యం కల్పించడం వల్ల మరియు ప్రజాప్రతినిధులని ఇన్‌వాల్వ్ చేయడం వల్ల అవినీతికి ఆస్కారం లేకపోవడం వల్లనే దాదాపు 99శాతం కాంట్రాక్టర్లు నష్టపోయారనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకి బిల్లులు చెల్లించే విషయంలో కూడా కొంత ఆలస్యం జరుగుతుందనే విషయాన్ని మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఎందుకంటే, ఎవరైతే న్యాయంగా, నాణ్యతతో within time లో పనులు చేశారో వారికి బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అందుకని మంత్రిగారు బిల్లుల విషయంలో చొరవ చూపాలని కోరుతున్నాను.

ఎప్పటినుండో గంగాళాల లాగా ఉన్నటువంటి చెరువులు ఇప్పుడు మిషన్ కాకతీయ ద్వారా తాంబాళ్ల లాగా అయ్యాయని పెద్దలందరు చెబుతున్నారు. గతంలో 1972, 1974వ సంవత్సరాలలో చూసుకుంటే నా చిన్నప్పుడు ఏప్రిల్, మే మాసంలో చెరువుల పూడికతీతని పొలాలల్లో వేసుకునే పరిస్థితిని గమనించేవాడిని. అటువంటి పూడికతీత సందర్భాలు మరిచిపోయి, రసాయనిక ఎరువులు వాడకం పెంచుకున్న సందర్భంలో మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని పెట్టి రైతుల్ని అందులో ఇన్‌వాల్వ్ చేయడం జరిగిందని తెలియజేస్తున్నాను. అందులో భాగంగా చెరువులు ఎంత భాగంలో ఆక్రమణకు గురైంది, వాటి విస్తీర్ణం, వాటి ముంపు ప్రాంతం ఎంత ఉందనేది కూడా తెలుసుకోవడం జరిగింది. వలస పాలకుల వల్ల కొన్ని మంచి చెరువులు కూడా పూడిపోయిన పరిస్థితుల్లో ఉన్నాయి.

కానీ, ఆంధ్ర ప్రాంతంలో కాటన్ గారు పరిపాలించినప్పుడు వారు తీసుకున్నటువంటి నిర్ణయాల వల్ల ఆ ప్రాంతంలో తప్పనిసరిగా ప్రతి గ్రామంలో ఒక చెరువు ఉంటుంది. అలాగే మన దగ్గర కూడా కాకతీయులు గానీ, రెడ్డి రాజులు గానీ అలాగే నిజాం పరిపాలన అప్పుడు కూడా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి భూముల్ని అంతా కూడా ధ్వంసం చేసిన సంగతి మనందరికీ కూడా తెలుసు.

1.20 మ. పెద్ద ఎత్తున ఈ విధంగా జరుగుతూ ఉన్నది. మనం ఏదైతే కోటి ఎకరాలు అనుకున్నామో ఆ లక్ష్యం నెరవేరడానికి తప్పకుండా కృషిచేయవలసి ఉంటుంది. ఈ సంవత్సరం కాకతీయ మిషన్‌లో మనం చెరువులను బాగు చేసుకున్నట్లయితే, వచ్చే సంవత్సరం వర్షాలు పడి చెరువులు నిండుతాయి. ఈ సంవత్సరం

సెప్టెంబర్‌లో మనకు వర్షాలు రావడం వల్ల చాలా చెరువులు నిండాయి. అందుకు రైతులు కూడా చాలా సంతోషంగా ఉన్నారు.

ఇంతకు ముందు సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి కూడా మాట్లాడారు. ఇక్కడ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ లాగా ఖమ్మం జిల్లాలోని లకారం చెరువు కోసం సుమారు రూ.9.00 కోట్లు ఇస్తే బాగుంటుందని మా మంత్రిగారు చెబితే, దానికి ముఖ్యమంత్రిగారు ఇవ్వడం జరిగింది. పోయిన సంవత్సరం ఆ చెరువుకు పూడిక తీసినట్లయితే ఇప్పుడు మే నెలలో ఖమ్మం జిల్లాలోని కార్పోరేషన్‌లో ట్రాన్స్‌పోర్ట్‌తో మంచినీటి సౌకర్యం అందించే వాళ్లం. కానీ ఈ సంవత్సరం చెరువులు నిండటం వల్ల ట్రాన్స్‌పోర్ట్‌కు ఒక రూపాయి ఖర్చు పెట్టకుండా రైతులకు ఉపయోగపడింది.

అదే విధంగా మా జిల్లాలోనే నేను ఒక ఉదాహరణ చెప్పదలచుకున్నాను. ఈరోజున గోళ్లపాడు ఛానల్ అనేది ఖమ్మం పట్టణానికి పెద్ద ఎత్తున మురికి కాలువ లాగా తయారైంది. పూర్వకాలంలో మున్నేరు వాగు పైన ఆ ఆనకట్టను నిర్మించడం జరిగింది. దాని ద్వారా ఖమ్మం పట్టణంలో వ్యవసాయానికి సరిపోయే విధంగా సుమారు రెండు వేల ఎకరాలకు నీరు అందించేది. అది శిథిలావస్థకు చేరుకుంటే ఎవరూ పట్టించుకున్న వారే లేరు. మంత్రిగారు గత సంవత్సరం ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు, మేము ఒక వినతి పత్రం ఇచ్చి, ఆనకట్టను పునరుద్ధరించినట్లయితే పదిహేను వందల ఎకరాలకు నీరు పరోక్షంగా, ప్రత్యక్షంగా చేరుతుందని చెబితే, అందుకు వారు రూ.5.07 కోట్లు వెంటనే మంజూరు చేయడం జరిగింది. ఈ సంవత్సరం డెబ్బై శాతం పూర్తయి ఓవర్ ఫ్లో కూడా అయింది.

అలాగే ఆ ప్రాంతంలో అతి పురాతనమైన శివాలయం కూడా ఒకటి ఉంది. అక్కడ స్నానాలు చేయుటకు తగిన నీటి వసతి లేక ఎప్పుడూ కూడా నాగార్జున సాగర్ నుండి నీటిని తెప్పించుకునే పరిస్థితి ఉండేది. వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలిగేవి. ఆ కాలువల ద్వారా పుణ్యక్షేత్రంలోకి నీరు చేరి ప్రజలు స్నానాలు చేసే విధంగా తగిన సౌకర్యాలు కల్పించడం జరిగింది. అదేవిధంగా, కారేపల్లి మండలంలో బుగ్గవాగు ఒకటి ఉంది. దాని నుండి రఘునాథపాలెం మండలానికి, ఖమ్మం జిల్లాలోని మండలానికి దాదాపు రెండు, మూడు వేల ఎకరాలకు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకెళితే తక్షణమే వాటికి రూ.1.03 కోట్లు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం అక్కడ పనులు దాదాపు యాభై శాతం పూర్తయినాయి.

అధ్యక్షా, ఖమ్మం జిల్లాలోని వేమసూరి మండలం, సత్తుపల్లి నియోజక వర్గంలోని ప్రాంతం దాదాపుగా ఎడారి ప్రాంతంగా ఉండేది. అక్కడ నీటి సదుపాయాలు లేవు. ఒకప్పుడు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎన్.టి.ఆర్ కాలువను రూ.18.00 కోట్లతో నిర్మిస్తే, దురదృష్టవశాత్తు అక్కడ బొగ్గు నిక్షేపాలు రావడం వలన దానిని వారు తీసుకోవడం జరిగింది. దానికి ప్రత్యామ్నాయంగా 2004వ సంవత్సరంలో డా.వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, శ్రీ జలగం వెంకట్ రావు గారు ఎంఎల్ఏగా ఉన్నప్పుడు ఆ కాలువను సుమారు రూ.43.00 కోట్లతో నిర్మాణం మొదలు పెట్టి రూ.121 కోట్ల వరకు ఖర్చు పెట్టినా ఇంకా అది పూర్తి కాలేదు. ఇవ్వాళ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత మన ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకొని ఇంకో రూ.20 కోట్లు కలిపి, మొత్తం రూ.141 కోట్లతో ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఎడారి ప్రాంతంగా ఉన్న వేమసూరి మండలానికి నీటి సౌకర్యం కల్పించి దాదాపుగా 11,000 ఎకరాలకు నీరు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అలాగే, బయ్యారం అనే పెద్ద చెరువు ఉంది. దానివల్ల సీతంపేట, గార్ల మండలాలలోని ఎనిమిది చెరువులు నిండుతాయి. అలాంటి చెరువు 2005లో కొట్టుకు పోతే తొమ్మిది సంవత్సరాల ప్రభుత్వ పాలనలో దానిని పునరుద్ధరించడానికి కనీసం ఒక కట్టకూడా పోయకుండా వదిలేశారు. నాకు తెలిసి తొమ్మిది సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఎకరానికి కూడా నీరు అందివ్వలేదు. అలాంటి చెరువును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ఈరోజున పది వేల ఎకరాలకు నీరు ఇచ్చినటువంటి ఘనత కూడా మా తెలంగాణ ప్రభుత్వానికే ఉంది.

అధ్యక్షా, మిషన్ కాకతీయ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతో ఎంత వరకు పూడిక పనులు తీశారు? అలాగే, ఆ కార్యక్రమంలో చేపట్టిన పనుల వలన భూగర్భ జలాల పెరుగుదల ఏమైనా జరిగిందా? అలాగే గత పది సంవత్సరాలలో చిన్న నీటి పారుదల శాఖకు ఇచ్చిన బడ్జెట్ ఎంత? మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ శాఖకు పెట్టిన బడ్జెట్ ఎంత వరకు పెట్టారు? అలాగే గతంలో చిన్న నీటిపారుదల శాఖ ద్వారా రబీ పంటకు ఇచ్చిన ఆయకట్టు ఎంత, ఈ సంవత్సరం ఈ శాఖకు సంబంధించినంత వరకు ఇంత వ్యయం చేసిన తర్వాత వచ్చిన ఆయకట్టు ఎంత? అలాగే మిషన్ కాకతీయ ప్రాజెక్టులో ప్రజల భాగస్వామ్యం వల్ల ఎంత లాభం జరిగిందనేటువంటి వాటికి సంబంధించిన వివరాలను తెలియజేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర గౌడ్ః (శాసనసభ నియోజకవర్గం) అధ్యక్షా, మిషన్ కాకతీయ ప్రాజెక్టు మీద మాట్లాడే అవకాశమిచ్చిన మీకు మొదటగా ధన్యవాదాలు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మిషన్ కాకతీయ ద్వారా చేపట్టిన గొలుసు చెరువులను, ఎవరైతే కాకతీయులు, శాతవాహనులు, నిజాం రాజుల పరిపాలన కాలంలో ఉన్న 75,000 వేల పైచిలుకు చెరువులను అంతకు ముందు ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈరోజున మన ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు దాదాపు 79 టియంసిల సామర్థ్యంతో ఉన్నటువంటి చెరువులను ఐదు సంవత్సరాల ప్రణాళికతో, రెండు సంవత్సరాలలో దాదాపు 17,000 చెరువులను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

మా నిజామాబాద్ జిల్లాలో సదాశివరాం గ్రామంలోని పెద్ద చెరువుకు స్వయాన ముఖ్యమంత్రి గారే శంకుస్థాపన చేయడం జరిగింది. కాకతీయ మిషన్ కార్యక్రమానికి మహిళలు, రైతులు, యువకులు అందరూ చెరువుల దగ్గరకు తట్టలు మోసి, ఆ మట్టిని తమకు ఉన్న పొల్లాల్లో వేసుకున్నటువంటి సందర్భాలున్నాయి. చాలా ప్రాంతాలలో ఈరోజున భూగర్భ జలాలు అడుగంటుకు పోయాయి. ఎందుకంటే ఆనాటి రోజుల్లో బోరు బావులతో వ్యవసాయం చేసుకునేవారు. గత ప్రభుత్వాలు చెరువులను పట్టించుకోక, అక్రమాలకు పాల్పడడం వలన చెరువులు పూర్తిగా ధ్వంసమైపోయాయి. గత సంవత్సరం కొంత అనావృష్టి జరిగినా, ఈ సంవత్సరం భారీ వర్షాల వలన మిషన్ కాకతీయ పనుల ద్వారా పునరుద్దరించుకున్న చెరువులతోపాటు మిగిలిన అన్ని ప్రాంతాలలోని చెరువులు నిండు కుండ లాగా మారుతున్నాయి. దానివల్ల రైతులు గడచిన ఖరీఫ్ పంటలో సేద్యం చేసుకుని ఎంతో సంతోషంగా ఉన్నారు.

అలాగే, ప్రస్తుతం ఉన్నటువంటి చెరువులను పునరుద్దరించడం వలన భారీ వర్షాలకు ఒకటి, రెండు చెరువులు తప్ప భారీగా గండ్లు పడిన సందర్భాలు కూడా లేవు. అటువంటి చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని మిషన్ కాకతీయ పేరు మీద ఈరోజున మనం పూర్తి చేసుకుంటున్నాము. గతంలో రైతులు ఆర్మూర్, బాలకొండ, నిజామాబాద్ ప్రాంతాలలో రూ.20,000/-లకు ఒక లారీ ఒండ్రు మట్టిని, పశువుల పెండను తీసుకుపోయి తమ పంట పొలాల్లో వేసుకునే వారు. ఈరోజున ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ట్రాక్టర్లు తీసుకొచ్చి, ప్రొక్లేన్ల ద్వారా ప్రభుత్వమే తోడేసి ట్రాక్టర్లలో నింపి ఇస్తే వాటిని రైతులు తమ పంట పొలాల్లో వేసుకునే పరిస్థితి కల్పించింది.

ఇదేకాకుండా, గతంలో చెరువులలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండేది. ఈనాడు తెలంగాణ ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం వలన ఈరోజున చెరువులలో ఫ్లోరైడ్ పరిమాణం బాగా తగ్గిపోయింది. తద్వారా సారవంతమైన భూగర్భ జలాలు పెరిగాయి. కాబట్టి రైతులు తమ పంట పొలాలను వేసుకొని పంటలు పండిస్తున్నారు. అదేవిధంగా, మత్స్యకారులు, గీత కార్మికులు, కుమ్మరులు ఇంకా అనేక మంది కుల వృత్తులు చేసుకునే వారు అనేకమంది ఈ చెరువుల మీదనే ఆధారపడుతున్నారు.

గౌరవ ముఖ్యమంత్రిగారు, మంత్రి శ్రీ టి. హరీష్‌రావు గారు, అందరి అధికారులతో కలిసి గత సంవత్సరం హరితహారంలో గీత కార్మికుల కోసం చెరువు కట్టల మీద దాదాపు యాభై నాలుగు లక్షల ఈత మొక్కలను వేయడం జరిగింది. అలాగే రూ.48 కోట్ల ఖర్చుతో మత్స్యకారులకు చేప పిల్లలను అందజేసి, వచ్చే సంవత్సరం నాటికి వారికి ఉపాధి కల్పించే విధంగా కార్యక్రమాలను చేపడుతున్నారని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇటువంటి కార్యక్రమాలను చూసి దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా అందరూ ప్రశంసిస్తున్నారు. అలాగే రామన్ మెగసేసె అవార్డు గ్రహీత అయిన శ్రీ రాజేంద్రసింగ్ కూడా వచ్చి చెరువులను సందర్శించి ప్రశంసించడం జరిగింది.

అలాగే మా సొంత గ్రామం అయిన డిచ్‌పల్లి మండలంలోని అమృతాపూర్ గ్రామంలో దాదాపు 250 ఎకరాల ఆయకట్టు ఉన్నది. గతంలో చూస్తే చెరువు క్రింద ఏ మాత్రం కూడా పది ఎకరాల పంట కూడా పండదు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో భారీ వర్షాలకు చెరువులు పూర్తి స్థాయిలో నిండి 250 ఎకరాల పంట పండించుకుంటున్నారంటే అది కాకతీయ మిషన్ ప్రాజెక్టు ద్వారా అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని కొందరు ప్రశంసించడం మరికొందరు విమర్శించడం కూడా జరిగింది. ఈ కార్యక్రమానికి నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ టి. హరీష్‌రావు గారి నేతృత్వంలో ఒక యాగం లాగా నిర్వహించారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో మంచి వర్షాలు పడడం వలన చెరువులన్నీ నిండు కుండలా ఉన్నాయి. వచ్చే సంవత్సరం వరకు కూడా ఆ నీరంతా రైతులకు అందుబాటులో ఉంటాయి. ఎప్పుడైనా చెరువులు ఎండిపోతే మళ్లీ వాటిని పునరుద్ధరించే కార్యక్రమాన్ని తప్పకుండా మన ప్రభుత్వం తీసుకుంటుంది. ఇవ్వాళ మన తెలంగాణ ప్రభుత్వం ఆశించిన అభివృద్ధి అంతా కాకతీయ మిషన్ ద్వారానే వస్తోంది. కాబట్టి మన రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. రాబోయే రోజులలో కూడా మంచి పంటలు పండించుకోవడానికి ఈ కాకతీయ మిషన్ ద్వారా మనకు ఒక అవకాశం వచ్చిందని చెబుతూ, నాకు సభలో మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను. జై తెలంగాణ.

శ్రీ టి. హరీష్‌రావు : అధ్యక్షా, ఈరోజున గౌరవ సభ్యులు సర్వశ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, నారదాసు లక్ష్మణరావు , సయ్యద్ అల్తాఫ్ హైదర్ రజ్వీ, యన్.రామచంద్రరావు, పూల రవీందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బలసాని లక్ష్మీ నారాయణరావు, ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్ గార్లు మాట్లాడుతూ, మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అభినందిస్తూ, మంచి సూచనలు, సలహాలు ఇస్తూ చర్చలో పాల్గొన్నందుకు అందరికీ హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఎంఎల్ఏలు, మంత్రులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు పెద్ద ఎత్తున మండుటెండలలో కష్టపడి పని చేయడం వలన ముఖ్యంగా గ్రామీణ ప్రజల సహకారంతో ఈ మిషన్ కాకతీయ కార్యక్రమం విజయవంతమైనది. ముఖ్యంగా ఈ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చేపట్టిన ముఖ్య కార్యక్రమాలలో ఈ మిషన్ కాకతీయ కార్యక్రమం ఒకటి. మేము చెరువుల శంకు స్థాపనకు వెళితే గ్రామాలలోని అన్ని వర్గాల వారు, మహిళలు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే చాలా చోట్ల రైతులు తమ సొంత ట్రాక్టర్ల ద్వారా అన్ని చెరువులలోని పూడిక మట్టిని తీయడానికి వచ్చారు.

అదేవిధంగా ఈ కార్యక్రమానికి చాలా మంది ఉద్యోగులు తమ నెల జీతాన్ని కూడా విరాళంగా అందించడం జరిగింది. గౌరవ శాసనమండలి సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు వారి స్వంత గ్రామం అయిన కల్లూరు మండలంలోని పరశురాముడి కుంట కోసం నారాయణపురం గ్రామంలో తమ నెల జీతాన్ని కూడా వారు అందించడం జరిగింది. He is the first council member to give the salary. అలాగే ఫారూఖ్ హుస్సేన్ గారు కూడా తమ నెల జీతాన్ని అందించారు. ఎంఎల్ఏలు, పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు ఇలా చాలా మంది ఎన్నో యేళ్ల కల నిజమవుతుందని ఈ కార్యక్రమానికి వారు విరాళాలుగా తమ డబ్బులు ఇవ్వడం జరిగింది.

మరి కొంతమంది చెరువులను దత్తత తీసుకొని, వారే స్వయంగా ఆ చెరువుల పనిని పునరుద్ధరింప చేసి వారి సహాయాన్ని మాకు అందించడం జరిగింది. వారు వారి సొంత గ్రామంలో వారే పునరుద్ధరింప చేసి ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు సహాయం అందించడం జరిగింది. మంచి కార్యక్రమం జరిగితే తప్పకుండా ప్రజల భాగస్వామ్యం, వారి దీవెన ఉంటుంది, ప్రతిపక్షాల సహకారం ఉంటుంది అనడానికి ఈ మిషన్ కాకతీయ కార్యక్రమం ఒక ఉదాహరణ అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

గౌరవనీయులు పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ, మానిటరింగ్ మెకానిజం పెంచండి, బిల్లింగ్‌లో ట్రాన్స్‌పరెన్సీ పెంచండి అంటూ కొన్ని సూచనలు ఇచ్చారు. నిజానికి మేము కూడా చాలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ వ్యవస్థ కొన్ని సంవత్సరాలుగా కునారిల్లిపోయింది. ఒకే రోజున పునరుద్ధరించాలంటే, బహుశ మాకు కూడా సాధ్యం కాకపోవచ్చు. అలాగే గౌరవ సభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్‌లో పనే కాదు, అసలు జరగదని అన్నారు. జరగదు వాస్తవం. ఎందుకు జరగదంటే, గత ప్రభుత్వ హయంలో జరగని మాట వాస్తవం. ఎందుకు నెగ్లెక్ట్ చేశారనేది ఒక ఉదాహరణ వారికి చెప్పదలచుకున్నాను.

1.40 మ. అధ్యక్షా, మహబూబ్‌నగర్ జిల్లాలో 7,480, నల్గొండ జిల్లాలో 4,762, రంగారెడ్డి జిల్లాలో 2,851 చెరువులు ఉన్నాయి. ఈ మూడు జిల్లాలు కలిపితే 15,093 చెరువులకు ఒక ఎస్.ఈ. ఆయన హైదరాబాదులో ఉంటాడు. ఇక అతను ఎక్కడ దొరుకుతాడు, ఎక్కడ అందుతాడు, ఎక్కడ పనులు అవుతాయి? ఇక నల్గొండ జిల్లా. అంత పెద్ద నల్గొండ జిల్లాలో మొత్తం జిల్లాకు ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉండేవాడు. అతను నల్గొండలో ఉంటే భువనగిరికి, దేవరకొండకు, ఏ ఏ నియోజక వర్గాలకు ఎక్కడకు వెళ్ళాలి? అందుకే ఇంత మంచి కార్యక్రమం జరగాలంటే మేము ఏం చేశామంటే, నేను చెపుతున్నాను.

ఒక్క నల్గొండ జిల్లాకే నలుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఒక ఎస్.ఈ.ని తీసుకువచ్చాము. అలాగే ప్రతి జిల్లాకు ఒక సూపరింటెండింగ్ ఇంజనీర్‌ని పెట్టాము. గోదావరి పరీవాహక ప్రాంతానికి ఒక సీఈని పెట్టాము. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతానికి ఒక సీఈని పెట్టాము. ప్రతి మండలానికి ఒక ఏఈని ఇచ్చాము. ప్రతి నియోజక వర్గానికి ఒక డెప్యూటీ ఈఈని ఇచ్చాము. అందుకే పనులు యుద్ధప్రాతిపదికన జరిగాయి. ఒక పని చేయాలన్నప్పుడు అందులో ఉండే లోతుపాతులన్నీ కూడా చూశాము. అసలు వారికి సరైన ఎక్విప్‌మెంట్లు కూడా లేవు. వారి దగ్గర డిపార్ట్‌మెంటులో కూడా ఏ ఎక్విప్‌మెంట్లు లేకుండా పోయాయి. వాటి కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, ఎక్విప్‌మెంట్లను కొనుగోలు చేశాము. వాలంటరీగా వారందరికీ శిక్షణలు కూడా ఇచ్చాము. వారికి ఎక్విప్‌మెంట్లు, శిక్షణలు, సిబ్బందిని ఇచ్చి అన్ని రకాలుగా చేశాము కనుకనే మిషన్ కాకతీయకు సంబంధించిన పనులు నూరు శాతం పూర్తి చేయగలిగాము. కాబట్టి గతానికి, ఇప్పటికీ చాలా తేడా ఉంది. బహుశా ఈ మధ్యలో మీరు

క్షేత్రస్థాయిలో ఎక్కువగా వెళ్ళనట్లున్నారు. గౌరవ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిగారు ఎం.పి.గా ఉన్న అనుభవంతో మాట్లాడి ఉంటారని నేను అనుకుంటున్నాను.

(అంతరాయం)

అధ్యక్షా, అన్ని విషయాలను నేను వివరంగా చెపుతాను. అయితే, గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు చాలా విషయాలు చెప్పారు. వారు కూడా విజిలెన్సు మానిటరింగ్ మెకానిజాన్ని పెట్టాలని, వాటిల్లో పారదర్శకత తీసుకురావాలని అన్నారు. అవునూ, తప్పకుండా తీసుకురావాలి. దానికోసం మేము అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాము.

వాటిలో భాగంగా మేము ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చాము. అందులో ఎవ్వరైనా నేరుగా ఫిర్యాదులు చేయవచ్చు. ఎవరినైనా ఫోన్ చేయమని చెప్పాము. మేము రౌండ్‌ది క్లాక్ ఆన్‌లైన్ మెకానిజాన్ని 23472233 ఫోన్ నెంబర్‌తో హెల్ప్‌లైన్లను పెట్టి, ఎవరైనా మీకు ఎటువంటి ఇబ్బందులున్నా, క్వాలిటీ లేకపోయినా ఫోన్లు చేయవచ్చని చెప్పాం. మేము ఆ హెల్ప్‌లైన్ల ద్వారా ఫిర్యాదులను స్వీకరించాము. అందులో భాగంగా దాదాపు 337 ఫిర్యాదులు వస్తే, 140 ఫిర్యాదులకు సంబంధించి మేము తగిన చర్యలు కూడా తీసుకోవడం జరిగింది. మిగిలిన వాటిల్లో కొన్ని సూచనలు, విన్నపాలు ఉంటే వాటిని కూడా మేము కన్సిడర్ చేయడం జరిగింది.

అధ్యక్షా, కొంతమంది సభ్యులు బిల్లింగ్ విషయం గురించి కూడా మాట్లాడారు. వాటిని కూడా మొత్తం ఆన్‌లైన్ విధానానికి తీసుకువచ్చాము. బిల్లులు రికార్డ్ చేయడం ఆన్‌లైనే. ఆ బిల్లుకు క్లియరెన్స్ ఇవ్వడం కూడా ఆన్‌లైనే. వాటిని ఎవరైనా చూసుకోవచ్చు. ఆ బిల్లుకు సంబంధించి ఎంత మంజూరయింది, ఎంతవరకు అగ్రిమెంట్ అయింది? ఎంతవరకు బిల్లులను రికార్డు చేశారు, వాటికి ఎంత పేమెంట్ చేశారు, as on today బిల్లు పే మెంట్ ఎంత ఉంది? దీనిని వెబ్‌సైట్‌లో ఎవరైనా ఓపెన్ చేసి చూసుకోవచ్చు. మొత్తం ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే విధంగా, టోటల్ ఆన్‌లైన్ విధానాన్ని తీసుకురావడం జరిగింది.

అంతేకాదు అధ్యక్షా, క్వాలిటీ కంట్రోల్‌ను కూడా బాగా బలోపేతం చేశాము. దాదాపు 86 ఫిర్యాదులను గౌరవ ఎం.ఎల్.ఏ.లు కానీ, పత్రికలలో వచ్చిన కటింగ్స్ కానీ, ఎప్పటికప్పుడు తెప్పించి వాటిని ఎంక్వైరీ చేస్తూ వెళ్ళాము. మహబూబాబాద్‌లో ఒక దగ్గర అవినీతి జరిగిందని మా దృష్టికి వచ్చింది. దానిమీద ఎవరూ మాకు ఫిర్యాదు చేయలేదు. అది ఒక పత్రికలో వార్తగా వస్తే, దాని ఆధారంగా మేము ఎంక్వైరీ చేసి, ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను, ఇద్దరు డెప్యూటీ ఈఈలను, ఇద్దరు ఏఈలను వెంటనే సస్పెండ్ చేశాము. ఇక్కడ ఇంత గొప్ప పవిత్ర యజ్ఞం జరుగుతోంది, ఇంత గొప్ప కార్యక్రమం జరుగుతూ ఉంటే, ఎవరో ఏదో పాలకుండలో ఒక విషపు చుక్క వేసినట్లుగా ఒకరిద్దరు అధికారులు తప్పు చేస్తే, వారిని క్షమించే ప్రశ్నే ఉండదని చెప్పి తక్షణమే వారిపై తగిన చర్యలు తీసుకుని, డిపార్టుమెంట్‌కి ఒక మెసేజ్‌ని కూడా పంపాము.

అంతేకాదు, గౌరవ సభ్యులు శ్రీ లక్ష్మీనారాయణ గారు, రాజగోపాల్ రెడ్డి గారు మాట్లాడినప్పుడు బాగా తక్కువ శాతానికి టెండర్లు పోయాయి. 30 శాతానికి టెండర్లు వెళ్లాయి అన్నారు. అది వాస్తవం. ఎందుకంటే ఇవన్నీ కూడా గతంలో లాగానే డిపార్టుమెంట్లు ఉంటాయేమోనని, ఇవి ఇలాగే ఉంటాయేమోనని, గతంలో లాగానే మనం బిల్లులు రికార్డు చేసుకోవచ్చని చెప్పి, కొత్త జోష్‌లో మిషన్ కాకతీయ ఫేజ్-1 లో బాగా తక్కువ శాతానికి టెండర్లు వేశారు. ఫేజ్-2 లో అలా కుదరదు అనుకున్నారు. మేము ఆ క్వాలిటీ కంట్రోల్‌ను బాగా బలోపేతం చేశాము. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బాగా బలోపేతం చేసి, వీటికి సంబంధించి ఎక్కడ ఫిర్యాదులు మా దృష్టికి వచ్చినా కూడా వాటి మీద వెంటనే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తమ ద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గారు నీతి-అయోగ్‌కి సంబంధించి మాట్లాడారు. వాస్తవానికి ఇంతకు ముందు నేను చెప్పినట్లుగా నీతి-అయోగ్ ఛైర్మన్‌గారు, సభ్యులు సరస్వతి గారు, జైన్ గారు, ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలలోని మిషన్ కాకతీయ పనులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమాలన్నీ చాలా బాగున్నాయనీ, వీటికి మేము సపోర్ట్ చేయాలని ఢిల్లీకి వెళ్ళి నీతి-అయోగ్ ద్వారా దాదాపు రూ.5,000 కోట్లు విడుదల చేయాలని కేంద్రప్రభుత్వానికి ఉత్తరం వ్రాశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు కూడా ఢిల్లీకి వెళ్ళినప్పుడు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రిని, గౌరవ ప్రధాన మంత్రిగారిని కూడా కలిసి నీతి-అయోగ్ రికమెండ్ చేసింది, కనుక తమ రాష్ట్రానికి నిధులను మంజూరు చేయమని కోరడం జరిగింది. నేను కూడా ఢిల్లీకి వెళ్ళి గౌరవనీయులు ఉమాభారతి గారిని కూడా కలిసి నీతి-అయోగ్ రికమెండ్ చేసిందని, తమ రాష్ట్రానికి నిధులను మంజూరు చేయవలసిందిగా వారిని కూడా కోరడం జరిగింది.

కేంద్రప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులను పొందేందుకు, వారి సహకారం కోసం నిజాయితీగా తగిన ప్రయత్నాలు కూడా చేస్తున్నాము. అయితే, ఆర్ఆర్ఆర్ ద్వారా కొన్ని నిధులు ఇచ్చారు.

కానీ, ఈ నీతి-అయోగ్ సిఫారసు చేసిన విషయంలో కేంద్రం ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు.

మరికొంత మంది గౌరవ సభ్యులు నర్సంపేట నియోజకవర్గంలో ములుగు ప్రాంతానికి సంబంధించిన ఒక అంశాన్ని మా దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించి కూడా చర్యలు తీసుకున్నాము. నిండని చెరువులు విషయం, మరమ్మత్తుల విషయం, హనుమంతరావు నివేదికల గురించి కూడా సభ్యులు మనవి చేశారు. అదే విషయంపై సభ్యులు శ్రీ రామచంద్రరావు గారు, రాజగోపాల్‌రెడ్డిగారు కూడా మాట్లాడారు. అయితే, అధ్యక్షా తమ ద్వారా ఒక విషయం మనవి చేసేదేమిటంటే, చెరువులన్నింటిని మరమ్మత్తులు చేయవద్దని, హైడ్రాలజీ చూసుకోవాలని, నీళ్ళు వచ్చే వాటిని చేయాలని మొదలైన వాటికి సంబంధించిన కొన్ని విషయాలపై కొంతమంది గౌరవ సభ్యులు సూచనలు చేశారు.

ఇక్కడ విషయం ఏమిటంటే – కొత్త చెరువులను ఏమైనా చేపడితే, అక్కడ నీటి లభ్యత ఉందా లేదా అని చూసుకుని, కొత్త చెరువులను ఏర్పాటు చేసుకుంటాము. ప్రస్తుతం ఉన్నటువంటి చెరువులను మనం కాపాడుకోకపోతే అవి కబ్జాలకు గురయి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల హస్తగతమవుతాయి. అయితే, ఒక విషయం ఏమిటంటే, గతంలోనే చెరువులను నిర్మించేటప్పుడు, నీటి లభ్యత ఉందో లేదో చూసుకునే, ఆ కాలంలోనే చెరువులను కట్టారు.

అధ్యక్షా, ఒక చిన్న ఉదాహరణ ఏమిటంటే ఈ సంవత్సరం మన రాష్ట్రంలో ఉండే దాదాపు 46,000 చెరువులలో 30,000 చెరువులు మత్తడులు దుమికినాయి. అంటే, నీటి లభ్యత ఉంది కనుకనే మత్తడులు దూకినాయి కదా. 5,300 చెరువులలో 50-75 శాతం వరకు నీళ్ళు వచ్చాయి. 3,900 చెరువులలో 25-50 శాతం వరకు నీళ్ళు వచ్చాయి. ఇక మిగిలిన వాటిల్లో మాత్రమే 0-25 శాతం మేర నీళ్ళు ఉన్నాయి. అంటే, మన రాష్ట్రంలో దాదాపు 40,000 చెరువులకు నీళ్లు వచ్చాయి. 50 శాతం, 75 శాతం నీళ్ళు వచ్చినప్పుడే 30,000 చెరువులలో మత్తడులు దూకాయి. ఇంక మిగిలినవి కేవలం 5, 6వేల చెరువులు మాత్రమే. ఈ 6,000 చెరువులలో కూడా సమస్య ఏమిటంటే – ఈ సంవత్సరం మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదయినది. ఖమ్మంలో కూడా ఒక భాగంలో తక్కువ వర్షపాతం నమోదైంది. వాటివలన అక్కడ చెరువులలో నీరు వచ్చే పరిస్థితి లేదు. కారణం ఏమిటంటే – హైదరాబాదు చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఔటర్ రింగ్ రోడ్డు వేశాము. వాటివలన దాని క్యాచ్‌మెంట్ దెబ్బతిని ఫీడర్ దెబ్బతినడం వల్ల వాటి క్రింద ఉన్న చెరువులలో నీటి లభ్యత లేకపోయింది. మనకు కొత్తగా జాతీయ రహదారులు వచ్చాయి. కొత్తగా రైళ్లకు లైన్లు వచ్చాయి. కొత్తగా ఇరిగేషన్ కాకతీయ కెనాల్ వచ్చింది. వాటివలన చెరువుల ఫీడర్ దెబ్బతినడం వల్ల చెరువులలో రావలసిన నీళ్ళు రాక అక్కడక్కడే నీరు ఇంకిపోవడం జరుగుతోంది. వీటివలన ఆయా ప్రాంతాలలో చెరువులలోకి నీరు రాకపోవడమన్నది వాస్తవం. మన రాష్ట్రంలో అలా నీరు రాని చెరువుల సంఖ్య చాలా చాలా తక్కువగా ఉంది. అయితే, ఇప్పుడు మనం ఆ చెరువులను కూడా ఇరిగేషన్ ప్రాజెక్టులకు లింక్ చేసి, నీటిని అందించడానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నాము. గతంలో కాకతీయ వరద కాలువ ఉండేది. అప్పట్లో చెరువులకు తూములు ఇవ్వలేదు. ఇప్పుడు మనం వాటన్నింటికి తూములను తీసుకువస్తున్నాము.

కల్వకుర్తిలో, నెట్టెంపాడులో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఎస్ఆర్ఎస్పీ కెనాల్స్ ద్వారా తూములను ఇవ్వడం జరుగుతోంది. అలాగే, క్యాచ్‌మెంట్ దెబ్బతిన్న చెరువులు, నీటి లభ్యత తక్కువ ఉన్న చెరువులు, మిగిలిన వాటికి కూడా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల ద్వారా మరియు ఇరిగేషన్ కెనాల్స్ ద్వారా నీరందించే ఏర్పాట్లు చేసి, వాటిని కూడా సద్వినియోగం చేసుకుందామని ప్రయత్నం చేస్తున్నాము. చెరువులనేవి మనకు గొప్ప వారసత్వ సంపద. కాకతీయ కాలం నాటి నుండి వస్తున్న వాటిని కాపాడుకోకపోతే మనం చరిత్రహీనులమవుతాం. భవిష్యత్ తరాలు మనం తప్పు చేసినట్లు భావిస్తారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గురించి మరొకసారి చర్చిద్దాం.

నారదాసు లక్షణరావు గారు, రజ్వీ కూడా చెప్పారు,

آپ نے کہا کہ civilization کہاں ہوا؟ جہاں پر پانی ہے وہاں پر civilization پیدا ہوا ہے تو پانی کا کیا importance ہے، آپ نے بہت اچھے طریقے سے کہا۔ آپ حیدرآباد سے ہیں، اتنا اچھا experience آپ کو کہاں سے ملا، بول کر معلوم ہوا جناب آپ بول رہے تھے۔

అంటే నీరు అనేది జీవనాధారం. సింధూ నాగరికత నుండి కూడా నీరు ఎక్కడైతే ఉందో అక్కడే నాగరికతలు అభివృద్ధి చెందాయి.

آپ بولنا چاہتے ہیں تو بولو، appreciate کرنا چاہتے ہیں تو خوشی ہوگی۔

ఒకసారి చేసి వదిలేయకుండా నిరంతరంగా సాగాలి. అర్బన్ వాటర్ బాడీస్ గురించి ఆలోచించాలి. చాలా వరకు ఇవి మురికి కుపాలుగా మారిపోయాయి. ఆ ప్రాంతాలలో దోమలు, ఈగలు పెరిగిపోయి చెత్త కుప్పలుగా మారిపోయిన పరిస్థితులు గతంలో జరుగుతూ వచ్చాయి. వాటి మీద కూడా చర్యలు తీసుకుంటున్నాము. హైదరాబాద్ చెరువులన్నీ కూడా జిహెచ్ఎంసి పరిధిలో ఉండటం వలన మానిటరింగ్ అదే చేస్తుంది. ఉన్న 169

చెరువులను హైదరాబాదులో కాపాడటం కోసం తప్పకుండా ప్రయత్నం చేస్తామని తెలుపుతున్నాను.

రాజగోపాల్‌రెడ్డిగారు చెప్పినట్లు చెరువులుంటే చాలు ప్రజలు, పక్షులు అందరూ బ్రతుకగలుగుతానేది వాస్తవం. నందిని సిద్ధారెడ్డిగారు చెప్పినట్లు చెరువులు కట్టినారు, ఊరులు నిలబెట్టినారని. తెలంగాణలో 50 కుంటల చెరువులు కనిపిస్తాయి. గత పది సంవత్సరాలలో బిల్లులు లేకుండా, అవినీతి ఉందేమో గానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అటువంటివి ఏమైనా ఉంటే చెప్పండి వెంటనే చర్యలు తీసుకుంటాను. వచ్చే 5 సంవత్సరాలలో ప్రతి చెరువును, ప్రతి కుంటను మరమత్తు చేయాలనే నిర్ణయం తీసుకున్నాము. చౌటుప్పల్ లోని పెద్దకొండూరులో జరిగిన విషయంలో వెంటనే చర్య తీసుకొని నివేదికను సమర్పిస్తానని తెలుపుతున్నాను.

రామచంద్రరావుగారు అడిగినట్లు గ్రౌండ్ వాటర్, చెరువులలో నీరు ఉందా? వృథాగా ఉన్నయా అని అడిగారు చెరువులను బాగు చేయడం వలన గ్రౌండ్‌వాటర్ ఏ విధంగా పెరిగిందో ఈ సంవత్సరం స్పష్టంగా కనిపించింది.

మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాలు తక్కువగా పడ్డాయి. అత్యధిక వర్షపాతం మెదక్ జిల్లాలో ఉంది. చెరువుల గ్రౌండ్ వాటర్ ఏ విధంగా పెరిగిందంటే 15.17 మీటర్ల వర్షపాతం మెదక్‌లో పెరిగితే మహబూబ్ నగర్ జిల్లాలో మాత్రం 1.81మీటర్లు పెరిగింది. అదిలాబాద్ జిలాల్లో 8.92, కరీంనగర్ 9.00, ఖమ్మంలో 5.5, నిజామాబాద్ 6.29, వరంగల్ 9.10 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయి.

చెరువుల పునరుద్ధరణలో మొట్ట మొదట మేము చూసేది అలుగు, వాటి కట్టలు అదే విధంగా పంట కాలువ, ఆ తరువాత పూడికతీత. ఈ సంవత్సరంలో 30 వేల చెరువులలో నీళ్లు ఉన్నాయి కనుక చెరువుల పని జరిగే అవకాశం లేదు. ఇంజనీర్లు వాటిని కొలవడానికి ఆస్కారం లేదు. అందుకే మిషన్ కాకతీయ ఫేజ్-3 లో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ప్రతి చుక్క నీరు కూడా చెరువులోకి వెళ్లేటట్లు చూడాలని అనుకుంటున్నాము. అదే విధంగా, కొన్ని చెరువులు తెగిపోయాయి. వాటిని మిషన్ కాకతీయలో పెట్టమని చెప్పాం. ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కొన్ని చోట్ల కొత్త చెరువులు త్రవ్వడానికి అవకాశం ఉంది. ఎక్కడైతే హైడ్రాలజీ, నీటి సౌకర్యం ఉంటుందో, అక్కడ కొత్త చెరువుల త్రవ్వకాలను ప్రారంభిస్తూ మిషన్ కాకతీయ ఫేజ్-3 లో పెట్టమని కోరాం. మీరు ఎక్కడున్నా కొత్త చెరువులకు త్రవ్వకానికి అవకాశం ఉంటే సభ్యులెవరైనా సూచనలు ఇచ్చినా వాటి అన్నింటిని చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాము.

రాజగోపాల్ రెడ్డిగారు గొలుసుకట్టు చెరువులకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. తప్పకుండా దానికి ప్రతిపాదన ఇవ్వండి. కొన్నింటికి కొన్ని సమస్యలు ఉన్నాయి ఏమిటంటే కోర్టు గొడవలు, కొన్నింటిలో నీళ్లు లేకపోవడం, స్థానికంగా ఉండే ఇబ్బందుల వల్ల కొన్ని చేపట్టలేకపోతున్నాము. గౌరవ సభ్యులు రాజగోపాల్ రెడ్డిగారు గమనించాలి. గతంలో ఎంత బడ్జెట్ ఉంది, ఎంత పని జరిగింది, ఇప్పుడు ఎంత బడ్జెట్ ఉంది, ఎంత కాలంలో ఎంత పని జరిగిందనేది గమనిస్తే మీకే తెలుస్తుంది. 2005-06వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు రూ.146 కోట్లు, 2006-07లో రూ.184కోట్లు, 2007-08లో రూ.189కోట్లు, 2008-09లో రూ.313 కోట్లు, 2009-10లో రూ.297 కోట్లు, 2010-11లో రూ.451 కోట్లు, 2011-12లో రూ.556 కోట్లు, 2012-13లో రూ.717 కోట్లు, 2013-14లో రూ.595 కోట్లు, 2014-15లో రూ.2595 కోట్లు, 2015-16 లో రూ.3130 కోట్లు కేటాయించారు. 20 రెట్లు పెంచడం గొప్పకాదు, ఆన్‌లైన్‌లో టెండర్లను పిలవాలి, అగ్రిమెంటు చేయాలి, స్టేట్‌మెంట్ తయారు చేయాలి, ఆ పనికి సంబంధించి మార్క్ అవుట్ ఇవ్వాలి. ఆన్‌లైన్‌లో బిల్లును అప్‌లోడ్ చేయాలి. వీటన్నింటిని బట్టి చూస్తే ఎన్ని రెట్లు ఆ ఇంజనీర్లు పని చేసారో మీరు ఇక్కడ గమనించవలసిన అవసరం ఉంది.

2.00 మ.

2014-15వ సంవత్సరంలో రూ.2,595 కోట్ల బడ్జెట్‌ను మంజూరు చేయడం జరిగింది. 2015-16వ సంవత్సరంలో రూ.3,130 కోట్లు మంజూరు చేయడం జరిగింది. అంటే ఇరవై రెట్లు ఎక్కువ నిధులు మంజూరు చేయడం జరిగింది. అయితే ఇక్కడ మీరు గమనించవలసిన అంశం ఏమిటంటే – ఇరవై రెట్లు ఎక్కువ డబ్బులు ఇవ్వడం గొప్ప కాదు, ఇంజనీర్లు ఇరవై రెట్ల ఎక్కువ వర్క్‌లోడ్‌ను తీసుకున్నారు. ఎస్టిమేట్ ప్రిపేర్ చేయాలి, ఆన్‌లైన్ ఇ.ప్రొక్యూర్‌మెంటుకి టెండర్లు పిలవాలి, అగ్రిమెంట్ చేయాలి, ఆ పనులకు సంబంధించి మార్కింగ్ జరగాలి, ఎం.బి. రికార్డ్ చెయ్యాలి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అంటే దీనిని బట్టి ఇంజనీర్లు ఎన్ని రెట్లు అధికంగా పనిచేశారని ఇక్కడ మనం గుర్తించాలి. గతంతో పోలిస్తే దాదాపు ఇరవై రెట్లు ఎక్కువ పనిచేశారు. కొంతమంది ఇంజనీర్లయితే మేము పనిచేయలేమని చెప్పి, లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. కొంతమంది నీరసంతో చక్కెరొచ్చి పడిపోయారు. చాలామందికి బిపిలు, షుగర్‌లు వచ్చి, ఇబ్బంది పడ్డారు. వారం,వారం వీడియో కాన్ఫరెన్సు పెట్టి, మేము టార్గెట్లు పెడుతుంటే వారు మేము పనిచేయలేము, మాకు బిపిలు పెరుగుతున్నాయని చెప్పుకున్నారు. ఒకరిద్దరు యాక్సిడెంట్లు జరిగి, ప్రమాదవశాత్తు చనిపోయిన

సంఘటనలు కూడా ఉన్నాయి. అలాంటి వారిని మనం ఎంకరేజ్ చెయ్యాలి. వారి సేవలను గుర్తించి, అభినందించాలి. ఒకరిద్దరు తప్పు చేసినట్లయితే వారి మీద చర్యలు తీసుకోవాలి.

గతంలో మనం చూశాము. ఒక చెరువు తెగిపోతే, దాని మరమ్మత్తుకి శాంక్షన్ కావడానికి, ఎస్టిమేషన్ తయారుకావడానికి సంవత్సరకాలం పట్టేది. కాని ఇప్పుడు చూసినట్లయితే సంవత్సరానికి ఎనిమిది, తొమ్మిదివేల చెరువులకు ఎస్టిమేట్లు, శాంక్షన్లు, టెండర్లు, అగ్రిమెంట్లు, గ్రౌండింగ్ మరియు పనులు పూర్తి కావడం మొత్తం పనులన్నీ ఎనిమిది,తొమ్మిది నెలల కాలంలోనే చేస్తున్నామంటే దాని వెనక ఇంజనీర్ల కృషి ఎంత ఉందో మనం అర్థం చేసుకోవలసి ఉంది.

శ్రీ ఎన్. రామచంద్రరావు గారు ఫీడర్ చానల్స్ గురించి చెప్పారు. అటువంటి వాటికి మిషన్ కాకతీయ ఫేజ్-3లో ప్రాధాన్యం ఇస్తున్నాము. అర్బన్ ఏరియాల్లో వర్షాలు బాగా కురిసినప్పుడు ఇళ్లలోకి నీళ్లు రావడం గురించి చెప్పారు. దానికి కారణం ఒకరిద్దరు కారు. చాలా చోట్ల చెరువులు ఆక్రమించి ఇళ్లు కట్టడం జరిగింది. మొన్న హైదరాబాద్‌లో కొన్ని కాలనీలు పూర్తిగా మునిగిపోయాయంటే అందుకు కారణం ఒకప్పుడు చెరువు ప్రాంతాలలో ఇళ్లను నిర్మించడమే. కుంటలు, చెరువులలో ఇళ్లను, అపార్టుమెంట్లను నిర్మించి, కాలనీలుగా తయారు చేశారు. నీరు పల్లమెరుగున్నట్లు, వర్షం పడితే ఆ నీళ్లు ఎక్కడికి పోతాయి? లోతట్టు ప్రాంతానికి వెళతాయి. ప్రభుత్వం తప్పు చేసిందా, ఇంకెవరు తప్పు చేసారా అని కాదు ప్రశ్న. గత వంద, యాభై ఏళ్లనుంచి చెరువు ప్రాంతాలన్నీ లేఔట్లుగా మారిపోయాయి. అటువంటి ఇళ్లను పూర్తిగా కూలగొట్టి, చెరువులను పునరుద్దరించగలుగుతామా? ఇది హైదరాబాద్‌లో జరిగింది గాని, జిల్లాస్థాయిలో, గ్రామాల స్థాయిలో చెరువు భూములను కాపాడే ప్రయత్నం చేస్తున్నాము. హైదరాబాద్ గురించి కూడా ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాము. భారీ వర్షాలు కురిసినప్పుడు, ఆ నీరు లోతట్టు ప్రాంతాలకు రాకుండా ఛానల్స్‌ను క్లియర్ చేసే ప్రయత్నం మేము చేస్తున్నాము. ఆక్రమణల విషయంలో చర్యలు చేపడుతుంటే, కోర్టులకి వెళుతున్నారు, స్టే తెచ్చుకుంటున్నారు. ఆక్రమణలు జరిగిన చోట నిర్మాణాలను కూల్చివేస్తుంటే మన నాయకులే అడ్డుపడుతున్నారు.

శ్రీ బలసాని లక్ష్మీనారాయణగారు కూడా చెరువుల గురించి బాగా మాట్లాడారు. కాంట్రాక్టర్లకు చెల్లింపులు ఆలస్యంగా జరుగుతున్నట్లు చెప్పారు. మా దగ్గర ఉన్న తాజా సమాచారం ప్రకారం రూ.165 కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. దీనిని కూడా త్వరలో క్లియర్ చేస్తాము. చిన్నచిన్న పనులకు ప్రాధాన్యత ఇస్తే వాళ్లకు ఎంకరేజ్‌మెంటు ఇచ్చినట్లు ఉంటుందని చెప్పారు. తప్పకుండా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని, వేగవంతం చేస్తాము. మా డిపార్టుమెంట్‌వారు ఏమి చెప్పారంటే చెరువు పూర్తికాగానే డబ్బు ఇస్తే వాళ్లు వెళ్లిపోతారు. బాగా వర్షం పడి, అందులో లీకేజి ఉన్నా, కట్టలో ప్రాబ్లం ఉన్నా, ఒక ఐదారు నెలలు వేచి చూస్తే, తరువాత ఇబ్బంది లేకుండా ఉంటుందని ఇంజనీర్లు పేమెంటు కొంత ఆపుతున్నారు. వాళ్లు వెళ్లిపోతే మళ్లీ దొరకరు, అమలులో, ఆచరణలో దాని సేఫ్టీ చూసిన తరువాత పేమెంట్ చేస్తే బాగుంటుందని వాళ్లు భావించారు. చిన్నపాటి లోపాలు ఉన్నట్లయితే అదే మనిషితో చేయించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది కొంత మేరకు న్యాయమే, మీరు చెప్పేది కూడా కొంత వరకు న్యాయమే. రెండిటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతామని తెలియజేస్తున్నాను.

శ్రీ గంగాధర్ గౌడ్‌గారు పల్లెజీవనం గురించి, ఈత చెట్లు, చేప పిల్లలు అనేటటువంటి చాలా విషయాలు చెప్పారు. గత ప్రభుత్వంలో చేప పిల్లలు పెంచడానికి తెలంగాణకు ఇచ్చిన బడ్జెట్ రూ.4 కోట్లయితే, ఈ సంవత్సరం రూ.40 కోట్లు ఇవ్వడం జరిగింది. ఎల్‌ఓపిగారు ఈ విషయంలో మమ్మల్ని అభినందించాలి. మంచి ఉంటే మెచ్చుకుంటామని, అద్దంలా ఉండాలని వారే అన్నారు. ముప్పైవేల చెరువులు నిండాయి, ప్రజలు సంతోషంగా ఉండాలని చేపపిల్లల కొరకు ఎక్కువ డబ్బు కేటాయించాము. గతంలో ఒక సొసైటీకి రూ.12,500 ఇచ్చేవారు. అది కూడా ఒక నియోజక వర్గంలో ఐదు లేదా పది చెరువులకు ఇచ్చేవారు. కాని ఇప్పుడు మేము టోటల్ సబ్సిడీగా ప్రతి చెరువుకి డెబ్బై వేలు కావాలా, లక్ష రూపాయలు కావాలా, ఐదు లక్షలు కావాలా, అని అడిగి, నలభై కోట్లు ఖర్చు పెట్టి, నలభై కోట్ల చేపపిల్లలను ఇవ్వడం జరిగింది. నేను మొన్న సిద్దిపేట వెళ్లడం జరిగింది. అక్కడ పిల్లలు చేపలు పడుతుంటే చూసాను. నేను ఆ చేపలను పరిశీలించి చూసాను. మనం రెండు నెలల క్రితం వేసిన పిల్లలు ఈ రోజు పావుకిలో సైజుకి పెరిగి ఉన్నాయి. ఇంకొక ఆరు నెలలు వేచి ఉంటే మన తెలంగాణలో దాదాపు మూడు నుంచి నాలుగు వేల కోట్ల రూపాయల విలువ గల మత్స్య సంపద తయారవుతుంది. అది మిషన్ కాకతీయ ఫలం, మన ముఖ్యమంత్రిగారి ఆలోచన అని మనవి చేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్: అధ్యక్షా, చేపల గురించి మంత్రిగారు చెప్పినారు. రూ.నలభై కోట్ల రూపాయలను చేప పిల్లల కొరకు టోటల్‌సబ్సిడీగా ఇచ్చామన్నారు. డెఫినెట్‌గా అభినందిస్తాము. కాని ఎంత మిషన్ కాకతీయ అయినా, చెరువులలో అసలు నీళ్లే లేవు.

వర్షాలు పడితేనే కదా ఆ చెరువు నిండేది? ఎంత పెద్ద చెరువు కట్టుకున్నా, నీళ్లు లేకపోతే అది ఎందుకు పనికిరాదు. చేపపిల్లలతో పాటు, సొసైటీ సభ్యులకు వలలుగాని, చిన్నచిన్న బోట్లు, వాటికి డీజిల్, అవసరమైన మౌలిక సదుపాయాలు ప్రొవైడ్ చెయ్యండి. గతంలో మేము 50: 50 ప్రాతిపదికన ఇచ్చాము. మహిళా సభ్యులకు చేపలను మార్కెటింగ్ చేయడానికి స్కూటీలను సప్లై చేసి, వారు చేపలను అమ్ముకోవడానికి తగిన సౌకర్యాలను కల్పించి, చేపలను స్టోరేజి చేసుకోవడానికి ఐస్ బాక్సులు ఇవ్వండి. గతంలో మేము ఏమీ చెయ్యలేదని చెప్పడం కరెక్టు కాదు. ఆ నాడు మేము కూడా ఇవన్నీ చేసిఉన్నాము. మీరు ఇప్పుడు ఇంకా ఎక్కువ చేస్తున్నారు. ఎందుకంటే మన తెలంగాణ, మన బిడ్డలు కాబట్టి, మీరు ఇవన్నీ చేస్తున్నందుకు అభినందిస్తున్నాను.

శ్రీ హరీశ్‌రావు: మంచి కార్యక్రమాన్ని మీరు అభినందించినందుకు థాంక్యూ షబ్బీర్ సాబ్. అయితే మీరన్నట్లు అవన్నీ చేస్తున్నాము. మీరు ఒప్పుకుంటే ఈ సారి ఫిషరీస్ డిపార్టుమెంటు మీద ఒక షార్ట్ డిస్కషన్ పెట్టుకుందాం. ఏం చేసినాము, ఎంత ఖర్చు పెట్టినాము, మహిళలకు ఏం చేసాము, ఐస్ బాక్సులు ఎన్ని ఇచ్చాము, స్కూటీలు గతంలో ఎన్ని ఇచ్చారు, ఇప్పుడు ఎన్ని ఇచ్చారు, ఆ వివరాలన్నీ మాట్లాడదాం. నాకు గుర్తున్నంతమటుకు అప్పుడు ఫిషరీస్ డిపార్టుమెంటుకి రూ.5 కోట్ల బడ్జెట్ ఉంటే, ఈరోజు రూ.100 కోట్ల బడ్జెట్‌ను మేము కేటాయించాము.

వర్షాలు పడకపోతే ఏం చేస్తాం, అది దేవుడిచ్చేది కదాని ఎల్ఓపిగారన్నారు. కాని గతంలో వర్షాలు పడినప్పుడు ఎంత ఆయకట్టు వచ్చింది, ఈ సంవత్సరం ఎంత వచ్చిందనేది చూసినట్లయితే, 2008 నుండి 2015-16 వరకు చూస్తే ఏ సంవత్సరం కూడా రెండు లక్షల ముప్పై వేల ఎకరాలకు మించి రబీలో ఆయకట్టు రాలేదు. కాని ఈ సంవత్సరం ఏడు లక్షల యాభై వేల ఎకరాలకు చెరువుల క్రింద రబీలో ఆయకట్టు వచ్చింది. ఎందుకొచ్చిందంటే మనం చెరువులను బాగుచేసుకున్నాము కనుక. లీకేజీలు లేకుండా, తూములు మంచిగా చేసుకున్నాము కాబట్టి. వందల సంవత్సరాల క్రితం కట్టిన అలుగులను బాగు చేసుకున్నాము కాబట్టి ఆయకట్టు పెరిగింది. ఫస్ట్ టైం చెరువుల క్రింద 7,50,000 ఎకరాల ఆయకట్టు వచ్చింది.

సభ్యులు శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డిగారు లకారం చెరువు గురించి అడిగారు. అది ఖమ్మం పట్టణం మధ్యలో ఉంది. కాబట్టి దానిని సుందరీకరిస్తే, ఆ పట్టణ ప్రజలు వాకింగ్ కొరకు, పిల్లలు ఆడుకోవడానికి ఒక మంచి ప్రదేశంగా ఉంటుందని దాన్ని శాంక్షన్ చేసాము. ఖమ్మం మున్సిపాలిటీ మురికి నీరంతా అక్కడికే పోయి చేరేది. ఈగలు, దోమలకి అది బ్రీడింగ్ సెంటర్‌గా మారిపోయింది. ఆ మురికి నీటినంతా బైపాస్ చేసి, క్రిందికి తీసుకుపోయి, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకి సంబంధించిన ఫ్రెష్ వాటర్‌ను అక్కడికి తీసుకుపోయాము. కట్టను వెడల్పు చేసాము. డ్రైన్ వాటర్‌ను డైవర్ట్ చేశాము. అందువల్ల నేడు ఖమ్మం పట్టణ ప్రజలకు నేడు మంచి రిక్రియేషన్ ప్రాంతం ఏర్పడింది. ఆహ్లాదకర వాతావరణం లభించింది. అక్కడ 120 ఎకరాలు కబ్జా అయిన మాట వాస్తవం. ఖమ్మంకి నేను వచ్చినప్పుడు సుధాకర్ రెడ్డిగారు నాకు దరఖాస్తు ఇచ్చారు. నేను అదే రోజు కలెక్టర్‌తో మాట్లాడి, విచారణకు ఆదేశించాను. 90 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇప్పటికే స్వాధీనం చేసుకోవడం జరిగింది. మరొక 30 ఎకరాలను స్వాధీనం చేసుకునే క్రమంలో కొందరు కోర్టుకి వెళ్లి, స్టే తెచ్చుకున్నారు. జి.పి.తో సంప్రదిస్తున్నాము. ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నది.

మరొక అంశం జియో ట్యాగింగ్. గౌరవ సభ్యులందరూ కూడా దీని గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది. దేశంలో మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం చెరువులను జియో ట్యాగింగ్ చేయడం జరుగుతున్నది. ఏ చెరువు ఎక్కడ ఉన్నదో ఒక్కొక్కసారి ఇంజనీర్లకు కూడా తెలియని సందర్భాలున్నాయి. స్టాఫ్ తక్కువ ఉండేది, ఎస్టిమేట్లు లేవు, రిపేర్లు జరిగేవి కావు. ఇప్పుడు ఏమి చేసామంటే ప్రతి చెరువుని కూడా ఆన్‌లైన్‌లో దాని లాంగిట్యూడ్ మరియు లాటిట్యూడ్ ఆధారంగా జియో ట్యాగ్ చేస్తున్నాము. వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ఆ చెరువు విస్తీర్ణమెంత, దాని ఆయకట్టు ఎంత, దాని శిఖం ఎంత, అది ఎక్కడ ఉన్నది, ఏ ప్రాంతంలో ఉంది, ఆ చెరువు ఫోటో, everything మనకు ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. రిపిటీషన్ ఉండదు, అవకతవకలు జరగవు, ఒక చెరువుకి రెండుసార్లు శాంక్షన్ తీసుకునే అవకాశముండదు, అదే కాకుండా, చెరువు కబ్జాకు గురికాకుండా, ప్రజలందరికీ పక్కా సమాచారం ఉంటుంది. ప్రపంచంలో ఎవరు, ఎక్కడినుండైనా చూసుకోవచ్చు. దీనిని మొన్న అక్టోబర్ 29న మొదలు పెట్టాము. మొత్తం 46,000 చెరువులకు గాను, ఇప్పటివరకు దాదాపు 37,000 చెరువులను దీని క్రిందకు తీసుకువచ్చాము. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, చెరువులు చరిత్రలో ఉండిపోతాయి. NRSAతో మేము అనుసంధానం చేసుకున్నాము. ఇస్రో వారితో కూడా అండర్‌స్టాండింగ్ కుదుర్చుకున్నాము. వారు మనకు ఉపగ్రహం ద్వారా నెలనెలా ఫోటోలు పంపిస్తుంటారు. ఉపగ్రహం ద్వారా చెరువులో ఎంత నీరుందో కూడా అసెస్ చేసి చెప్పగలుగుతారు.

క్రింద మట్టి ఎంత ఉన్నది, ఎంత ఆయకట్టుకు నీళ్ల ఇవ్వగలుగుతామనే సమాచారం కూడా వారు మనకు అందజేసారు. ఆయకట్టు క్రింద వరి వేసారా, జొన్న వేసారా, మొక్కజొన్న వేసారా, ఏ పంట వేసారో వివరాలు కూడా మనకు దొరుకుతాయి. ఈ విధంగా మనం ఒక పారదర్శకమైన విధానాన్ని అనుసరిస్తున్నాము. చెరువులను ఒక గొప్ప సంపదగా ముందు తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని మేము చేపట్టామని తెలియజేస్తున్నాను.

ఇదే కాకుండా సమావేశాలు ముగిసిన తరువాత ఒకసారి ప్రాజెక్టులను సందర్శిద్దాం.

ఆదిలాబాద్ జిల్లాలో బోథ్ ప్రాజెక్టును చూసినప్పుడు నేను చాలా సంతోషపడ్డాను. కరక్‌వాడ గ్రామంలో ఈ ప్రాజెక్టు ఉంటుంది. చాలా రోజుల క్రిందట తెగిపోయింది. 4900 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువు ఇది. Almost a Medium Irrigation Project. ఈ ప్రాజెక్టు గురించి మా ఎమ్మెల్యే బాబూరావుగారు నా దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ కాకతీయ-1 క్రింద రూ.13.15 కోట్లు శాంక్షన్ చేసి, దానిని పూర్తి చేశాము. ఈ రోజు దాని క్రింద ఐదు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మీరు ఎవరైనా వెళ్లి, చూడవచ్చు. అలాగే బజార్ హత్నూర్ ప్రాజెక్టు. ఎం.కె.1 లో రూ.12.60 కోట్లు మంజూరు చేశాము. ఇందులో కుడి కాలువ, ఎడమ కాలువ మొత్తం పూడుకుపోయి ఉండేది. కుడి కాలువ 4.75 కిలోమీటర్లు, ఎడమకాలువ 27 కిలోమీటర్లు, మొత్తం పూర్తి చేసాము. దీని క్రింద ఇప్పుడు 4700 ఎకరాల పంట ఈ రబీలో సాగు చేయబడుతున్నది. ఆదిలాబాద్ జిల్లా పరిమండల్‌లో ఆనకట్టను 1878వ సంవత్సరంలో నిర్మించారు. దీని కొరకు మనం ఇప్పుడు ఒక కోటి రూపాయలు మంజూరు చేసి, మరమ్మతు చేయడం ద్వారా ఈ చెరువు నిండడమే కాకుండా, మరో నాలుగు చెరువులకు ఫీడర్ ద్వారా నీళ్లు పోయి, 845 ఎకరాల ఆయకట్టు సాగవుతున్నది.

ఈ సారి చాలా భారీ వర్షాలు కురిసాయి. ఒక్క రోజులోనే 38 సెంటీమీటర్ల వర్షం పడ్డది. కేవలం ఆరుగంటల వ్యవధిలోనే ఇంత వర్షం కురిసింది. ఇది చాలా అసాధారణమైన వర్షం. అలా జరిగినప్పుడు లైన్‌గా చెరువులు తెగిపోతుంటాయి. జగిత్యాల దగ్గర మాన్వాడ్ ప్రాంతంలో SRSP Canal ఆ విధంగా తెగిపోయింది. దానిలోంచి ఆరువేల క్యూసెక్కుల నీరు పోతుంది. ఆ చెరువు కట్టమీదనుంచే రెండు ఫీట్ల నీరు ప్రవహించింది. కాని ఆ చెరువు మాత్రం తెగలేదు. మిషన్ కాకతీయ ఫేజ్-1లో చేసిన పనుల కారణంగా ఆ చెరువు చెక్కుచెదరలేదు. కెనాల్ తెగి, రెండు ఫీట్ల నీళ్లు ప్రవహించినా, చెరువు తెగలేదు. That work has been taken up under Mission Kakatiya-1. అలాంటి ఫలితాలు కూడా మేము చూశాము. గతంలో బాగా వర్షాలు కురిసిన సంవత్సరాలు చూసినట్లయితే 2010లో వర్షాలు బాగా పడ్డాయి. అప్పుడు 4251 చెరువులు తెగిపోయాయి. 2013లో 1868 చెరువులు తెగినాయి. ఈ సంవత్సరం కూడా వర్షాలు బాగా పడినప్పటికీ 335 చెరువులు మాత్రమే తెగడం జరిగింది. మిషన్ కాకతీయ ఫేజ్-1 ఫలితాలుగా దీనిని మనం చెప్పుకోవచ్చు. ఇందులో ఎక్కువగా పెద్ద చెరువు పనులనే తీసుకున్నాము. అవి బలంగా ఉండబట్టి, క్రింద చెరువులు పాడు కాలేదు. ఒక పెద్ద చెరువు తెగితే, వరుసగా క్రింది చెరువులన్నీ తెగుతాయి.

నేను మొన్న ఈటివి చూస్తున్నాను. అందులో ఒక మంచి స్టోరీ టెలికాస్ట్ చేశారు. బయోడైవర్శిటీ అనే అంశం మీద రకరకాల పక్షులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో అలాంటిది జరగలేదు. సుదూర ప్రాంతాలనుండి పక్షులు రావడం చూపించారు. అమెరికన్ యూనివర్శిటీలు తమ స్టూడెంట్సుకి ఆర్థిక సహాయం చేసి, ఈ అంశంపైన రిసెర్చి చెయ్యమన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇంతమంచి ప్రోగ్రాం చేస్తున్నదని చెప్పి, పిల్లలకు గ్రాంటులిచ్చి మన రాష్ట్రానికి పంపింది. వారు ఇక్కడికొచ్చి, ఆరు నెలల పాటు దీనిగురించి పరిశోధన చేశారు. ఆ రీసెర్చ్‌లో వారు చెప్పింది ఏమిటంటే – చెరువుల పునరుద్ధరణ వలన ఎరువుల వాడకం తగ్గింది, యూరియా, డిపి వాడకం తగ్గింది. దానికి బదులుగా వారు చెరువుల పూడిక మట్టి వాడుకుని మంచి ఫలితాలు పొందారు. తద్వారా వాతావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించగలిగారు. పంట దిగుబడి పెరిగి, నీటి వాడకం తగ్గింది. చెరువు మట్టి వలన మూడు రోజులకు తడి ఇచ్చే బదులు, ఆరు రోజులకు ఒక తడి ఇస్తే సరిపోతుందని చెప్పారు.

ఇలా చెప్పాలంటే ఇంకా చాలా ఉంది. మిషన్ కాకతీయ అనేది it is a long, long lasting programme. ఒక తరానికో, ఒక వర్గానికో సంబంధించినది కాదు. కొన్ని వందల ఏళ్ల నుంచి వచ్చిన గొప్ప సంపదను, బంగారు తెలంగాణను, ఒక ఆకుపచ్చని తెలంగాణను మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు చేపట్టడం, దీనికి నిధుల కొరత లేకుండా ఎంత బడ్జెట్‌నైనా కేటాయించి, ఇంత మంచి కార్యక్రమాన్నిచ్చిన గౌరవ ముఖ్యమంత్రిగారికి, ఇది ఇంత బాగా విజయవంతం కావడానికి పార్టీలకతీతంగా సహకరించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు మరియు కష్టపడి పనిచేసిన ఇంజనీర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తూ, ఈ రోజు చర్చకు

అవకాశమిచ్చిన మా ఛైర్మన్‌గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జై తెలంగాణ.

మిస్టర్ ఛైర్మన్: ఈ రోజు మిషన్ కాకతీయ చర్చకు సమాధానమిచ్చిన మంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, డిసెంబర్ 2016 బుధవారం 21వ తేదీ ఉదయం 10 గంటలకు సమావేశం అయ్యేందుకు సభను వాయిదావేయడమైనది.

(Then the House adjourned at 2.20 PM to meet again at 10.00 AM on Wednesday the 21st December, 2016)

☺☺☺

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana  Legislative Council and Printed at  the Assembly Press, Public Gardens, Hyderabad.”**